మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 13 శుక్రవారం సెప్టెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 362
Navabhoomi daily fallows..





# పొలిటికల్ హీట్!

- కౌశిక్‌రెడ్డి సవాల్ నేపథ్యంలో ఆయన ఇంటికి అరెకపూడి గాంధీ
- కౌశిక్‌రెడ్డి ఇంటి బయట అరికెపూడి గాంధీ అనుచరుల ధర్నా
- కౌశిక్‌రెడ్డి ఇంటిపై గాంధీ అనుచరులు కోడి గుడ్లు, టమాటాలు
- పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అరెస్టు
- సీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హరీశ్,పలువురి అరెస్ట్



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** బిఆర్ఎస్ ఎంఎల్ఎ కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన శేరిలింగం పల్లి ఎంఎల్ఎ అరెకపూడి గాంధీని పోలీసులు అరెస్టు చేశారు. కౌశిక్ రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో అరెకపూడి గాంధీతో పాటు ఆయన అనుచరులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
కౌశిక్‌రెడ్డి సవాల్ నేపథ్యంలో ఆయన ఇంటికి అరెకపూడి గాంధీ వెళ్లారు. కౌశిక్‌రెడ్డి ఇంటి బయట అరికెపూడి గాంధీ తన అనుచరుల ధర్నా చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కౌశిక్‌రెడ్డి ఇంటిపై గాంధీ అనుచరులు కోడి గుడ్లు, టమాటాలు విసిరారు. కౌశిక్‌రెడ్డి ఇంట్లో గాంధీ ధర్నాకు దిగారు. కౌశిక్‌రెడ్డికి దమ్ముంటే బయటకు రావాలని, తాను ఇక్కడే ఉన్నానంటూ గాంధీ సవాల్ విసిరారు. వెంటనే పోలీసులు అరెకపూడి గాంధీతో ఆయన అనుచరులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.
తెలంగాణలో ఒక ఎంఎల్ఎకే రక్షణ లేదని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. సామాన్య ప్రజలకు ప్రభుత్వం ఎలా రక్షణ ఇస్తుందని ప్రశ్నించారు. తనని హత్య చేయడానికే తన ఇంటికి వద్దకు వచ్చారని, రేపు ఉదయం 11 గంటలకు బిఆర్ఎస్ పార్టీ

# తెలంగాణభవన్ వద్ద ఉద్రిక్తత

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ మహిళా కాంగ్రెస్ నేతలు భవన్ ముట్టడికి యత్నం
- పెద్ద ఎత్తున కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు తెలంగాణ భవన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నం
- తెలంగాణ భవన్ చుట్టూ మోహరించిన పోలీసులు..కాంగ్రెస్ యత్నాలకు అడ్డుకట్ట
- పోలీసులు, కార్యకర్తల మధ్య పెనుగులాట..గేటు బయట ధర్నాకు దిగిన కాంగ్రెస్ కర్యకర్తలు



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** బంజారా హిల్స్‌లోని తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ మహిళా కాంగ్రెస్ నేతలు గురువారం తెలంగాణ భవన్ ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. పెద్ద ఎత్తున మహిళా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని, భవన్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే అలర్ట్‌గా ఉన్న పోలీసులు భవన్ వద్ద భారీగా మోహరించారు. మహిళా కార్యకర్తలు ముట్టడించేందుకు ప్రయత్నించడంతో వారిని అడ్డుకున్నారు. అయినా కూడా వారు పోలీసులను దాటుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, కార్యకర్తల మధ్య పెనుగులాట జరిగింది. అనంతరం వారు భవన్ ముందు భైటాయించి నిరసన చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి, బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వెంటనే పాడి కౌశిక్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.
కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలతో ఆందోళన

# కౌశిక్ రెడ్డి అరెస్టుకు రంగం సిద్ధం

- గాంధీ ఇంటికి వెళ్లి తెలంగాణ భవన్‌కు తీసుకు వస్తానని కౌశిక్‌రెడ్డి ప్రకటన
- ఇప్పటికే కౌశిక్‌రెడ్డి హౌజ్ అరెస్ట్
- ఇరునేతల సవాళ్ల నేపథ్యంలో ఇద్దరి ఇళ్ల వద్ద పోలీసుల మోహరింపు



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టుకు రంగం సిద్ధమైంది. అరికెపూడి గాంధీకి బీఆర్ఎస్ కండువా కప్పుతానంటూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమయ్యాయి. ఈ నేపథ్యంలో కౌశిక్ రెడ్డి ఇంటి ముందు పోలీస్ బందోబస్తు ఏర్పాటు

# రేవంత్ సర్కార్‌కు హైకోర్టులో ఊరట

- ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు
- తెలంగాణ ప్రభుత్వాన్ని విద్యుత్ బిడ్డింగ్‌కు అనుమతించాలి
- ఎన్ఎల్డీసీని ఆదేశించిన హైకోర్టు

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** బీఆర్ఎస్ హయాంలో చత్తీస్గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది.
విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి బకాయిల చెల్లింపుపై గత

# 'బీఆర్ఎస్ మైండ్‌గేమ్'

- ప్రభుత్వాన్ని కూల్చే ప్లాన్‌లో బీఆర్ఎస్
- మా ప్రభుత్వానికేమీ డోకా లేదు
- ఐదేళ్ల పాటు మనుగడ ఖాయం
- కౌసిక్ అలా మాట్లాడితే బీఆర్ఎస్ సస్పెండ్ చేయాలి
- పాడి కౌశిక్ రెడ్డి ఇష్యూపై స్పందించిన సీఎం
- మీడియాతో సీఎం రేవంత్ చిట్‌చాట్..



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మైండ్ గేమ్ ఆడుతోంది. ఎవరి కోసం ప్రత్యేక రాజ్యాంగం ఉండదు. ఫిరాయింపుల చట్టం కఠినంగా ఉండాలి. కఠినంగా ఉంటే మా ప్రభుత్వానికి ఢోకా లేదు. మా సంఖ్య బలం 65ః అంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.
ఎమ్మెల్యేలు ఎవరూ పార్టీ మారకపోతే మాకే మేలు. బీఆర్ఎస్, బీజేపీ మా ప్రభుత్వాన్ని 3 నెలల్లో కూల్చేస్తామంటున్నాయి. చట్టం కఠినంగా ఉంటే ఆ పరిస్థితి రాదు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్టు తీర్పును నేను స్టడి చేయలేదు. అందువల్ల నేను దానిపై ఇప్పుడే ఏ కామెంట్ చేయలేను. బీఆర్ఎస్ నేతలు సైకలాజికల్ గేమ్ ఆడుతున్నారు. ఎవరి కోసం ప్రత్యేక రాజ్యాంగం ఉండదు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో కాంగ్రెస్ కంటే అత్యధికంగా బీఆర్ఎస్ సభ్యులే ఉన్నారు. మా వాటా నుంచి ఎంఐఎం, బీజేపీ, సీపీఐలకు అవకాశం కల్పించాం. 2018లో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పటికీ పీఏసీ చైర్మన్ పదవిని ఎంఐఎంకు ఇచ్చారు. 2014లో బిజినెస్ అడ్వయిజరీ కమిటీలోనూ టీడీపీ నుంచి నా పేరు, ఎర్రబెల్లి దయాకర్ పేరును ప్రతిపాదిస్తే తిరస్కరించారు. పార్టీ ఫిరాయింపుల

# బీజేపీలో ఐక్యతా రాగం..

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ భారతీయ జనతా పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు అంటూ జోరుగా ప్రచారం జరుగుతున్న బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఐక్యతను చాటేలా కీలక మీటింగ్ నిర్వహించారు.
బీజేఎల్పీ విస్తృత సమావేశానికి ఎంపీలు సైతం హాజరై రాష్ట్ర సమస్యలపై బీజేపీ పోరాటం సాగుతుందనే సంకేతాలు ఇచ్చారు.
తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలైన రుణమాఫీ అమలు, రైతు సమస్యలపై ఒక్కరోజు దీక్ష చేపట్టాలని బీజేపీ శాసనసభాపక్షం నిర్ణయించింది. ప్రస్తుత పరిణామాలపై అసెంబ్లీ ఆవరణలోని బీజేఎల్పీ - మిగతా 2లో

## సీతారాం ఏచూరి

# కన్నుమూత

- కమ్యూనిస్టు దిగ్గజం సీతారాం ఏచూరి కన్నుమూత
- శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్న సీతారాం ఏచూరి
- ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన సీపీఎం అగ్రనేత
- వామపక్ష శ్రేణుల్లో విషాదం..సీపీఎంకు తీరని లోటు
- నివాళులర్పించిన ప్రధాని,రాష్ట్రపతి,తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
వామపక్ష దిగ్గజం, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) కన్నుమూశారు. కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన... ఢిల్లీలోని ఎయిమ్స్ లో చికిత్స పొందుతూ ఈ మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు.
శ్వాసకోశ ఇన్ఫెక్షన్ కారణంగా సీతారాం ఏచూరి ఆగస్టు 19న ఎయిమ్స్ లో చేరారు. గత కొన్ని రోజుల నుంచి ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ వస్తోంది. ఎయిమ్స్ వైద్యులు ఆయనకు వెంటిలేటర్ అమర్చి చికిత్స అందిస్తున్నారు.
సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న చెన్నైలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు కల్పకం, సర్వేశ్వర సోమయాజులు ఏపీలోని కాకినాడకు చెందినవారు. చెన్నైలో పుట్టిన సీతారాం ఏచూరి హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేశారు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో బీఏ ఎకనామిక్స్ చదివారు.
1969 నాటి తెలంగాణ ఉద్యమంలో ఆయన ఢిల్లీ వేదికగా చురుగ్గా పాల్గొన్నారు. 1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)లో చేరారు. ఆ మరుసటి ఏడాది

# బదిలీలపై నిషేధం ఎత్తివేత

- ఎక్సైజ్ శాఖ మినహా మిగిలిన శాఖల్లో ఉద్యోగుల బదిలీపై నిషేధం ఎత్తివేత
- ఇప్పటికే పలు శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల
- మిగిలిన శాఖల్లో బదిలీలకు ఆయా శాఖలు మార్గదర్శకాలు విడుదల
- వీటి ప్రకారం ఈ నెల 22 వరకూ బదిలీల ప్రక్రియ..23 నుంచి నిషేధం

**అమరావతి-నవభూమిబ్యూరో**
ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల విషయంలో సీఎం చంద్రబాబు సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై పాజిటివ్ నిర్ణయాలు తీసుకుంటున్న చంద్రబాబు..
తాజాగా ఓ కీలక అంశంపై ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రంలో ఉద్యోగులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న బదిలీలపై నిషేధం ఎత్తివేతపై ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వీటిలో కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో వాటిలో మరో మార్పు ప్రకటించారు. రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖ మినహా మిగిలిన శాఖల్లో ఉద్యోగుల బదిలీపై ఉన్న నిషేధాన్ని గత నెల 19 నుంచి 31 వరకూ ఎత్తేస్తూ గతంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పలు శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేయడంలో ఆలస్యం కావడంతో ఆ గడువును ఈ నెల మొదటివారానికి పెంచారు. రాష్ట్రంలో ఓవైపు వరద సహాయక చర్యల్లో ఉద్యోగులు ఉండటంతో మరోసారి ఉద్యోగుల బదిలీలపై ఇచ్చిన గడువును మరోసారి పొడిగించారు.
ఏపీలో ఎక్సైజ్ మినహా మిగిలి శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ఇచ్చిన గడువును ఈ నెల 22 వరకూ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పలు శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల కాగా.. మిగిలిన శాఖల్లో బదిలీలకు ఆయా శాఖలు మార్గదర్శకాలు విడుదల చేస్తున్నాయి. వీటి

# జగన్ కోర్టుకు రావాల్సిందే

- జగన్‌కు హైకోర్టు చురకలు..
- పూచీకత్తు సమర్పించాలని ఇచ్చిన ఆదేశాలను
- జగన్ ప్రశ్నిస్తున్నారు...అది సరైన పద్దతి కాదు"



**అమరావతి-నవభూమిబ్యూరో**
ఎన్నికలు పూర్తయినప్పటి నుంచి ఏదో ఒక కేసులో వైసీపీ, ఆ పార్టీ నేతలు ప్రజల నోళ్లలో నానుతూనే ఉన్నారు. ప్రభుత్వం మారడం, మళ్ళీ టీడీపీ ప్రభుత్వం రావడం, చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో గతంలో టీడీపీ కార్యాలయం, చంద్రబాబు నివాసంపై జరిగిన దాడుల కేసు దర్యాప్తులో వేగం వచ్చింది. ఈ కేసుల్లో చాలా మంది వైసీపీ సీనియర్ నేతల పేర్లు ఉన్నాయి. వారి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడంతో పాటు వారికి అరెస్ట్ నుంచి మినహాయింపు ఇవ్వడానికి కూడా హైకోర్టు నిరాకరించింది. దీంతో చాలా మంది నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో తాజాగా జగన్.. న్యాయస్థానం ముందు హాజరై తీరాల్సిందేనంటూ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.
పాస్‌పోర్ట్ విషయంలో తనకు 5 ఏళ్లకు రెన్యూవల్ సదుపాయం కల్పించాలన్న జగన్ వాదనను విజయవాడ కోర్టు తిరస్కరించడంతో ఇదే వ్యవహారంపై జగన్.. హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణలో భాగంగా ఈరోజు హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. జగన్ కోర్టుకు రావాల్సిందేనని, ఆ విషయం ఆయనకు కూడా తెలుసంటూ జగన్ తలంటింది న్యాయస్థానం. ఎన్ఓసీ జారీ విషయంలో కోర్టు ముందు హాజరై జగన్ రూ.20 సొంత పూచి కత్తు కట్టాలన్న విజయవాడ కోర్టు నిర్ణయం విషయంలో కూడా తాను జోక్యం చేసుకోలేనని హైకోర్టు తేల్చి చెప్పింది. కోర్టు ఆదేశాలకు ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని, ప్రజా జీవితంలో ఉన్న పిటిషనర్ వైఎస్ జగన్‌కు ఈ విషయం బాగా తెలుసుంటూ వ్యాఖ్యానించింది ఉన్నతన్యాయ స్థానం.

**జగన్ తీరు అలానే ఉంది**

"విజయవాడ ప్రత్యేక కోర్టులో 2018లో దాఖలైన పరువు నష్టం దావా కేసు ఇంకా

# ఫ్యామిలీతో జగన్ రాజీ?

- పరాజయం తర్వాత విభేదాలు పరిష్కరించుకోవాలని ఆత్మీయుల సూచన
- సోదరి షర్మిలకు రాజీ ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం
- కుటుంబం లేనిదే గెలవడం కష్టమని జగన్ ఒక నిర్ణయానికి రాక
- లోటాస్ పాండ్‌తో పాటు కొన్ని వ్యాపారాల్లో వాటా కూడా షర్మిలకు..



**అమరావతి-నవభూమిబ్యూరో**
సోదరి షర్మిలతో జగన్ రాజీ కుదుర్చుకున్నారా? కుటుంబంలో విభేదాలను పరిష్కరించుకోవాలని చూస్తున్నారా? ఇంట గెలిచి రచ్చ గెలవాలని భావిస్తున్నారా?
అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ ఎన్నికల్లో ఘోర పరాజయం, ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్న వేళ కుటుంబంలో ఉన్న విభేదాలు పరిష్కరించుకోవాలని ఆత్మీయులు సూచించినట్లు తెలుస్తోంది. అందుకే సోదరి షర్మిలకు రాజీ ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. గత ఎన్నికలకు ముందు తనకు ఎవరి అవసరం లేదని.. ప్రజలకు అన్ని ఇచ్చాను కనుక తననే ఎన్నుకుంటారని భావించారు. కానీ ఆయన మాట చెల్లుబాటు కాలేదు. అనుకున్నట్టుగా గెలుపు సాధించలేదు. కుటుంబం లేనిదే గెలవడం కష్టమని జగన్ ఒక నిర్ణయానికి వచ్చారు. అందుకే చెల్లెలు షర్మిలకు రాయబారం పంపినట్లు సమాచారం.
ఆస్తి వివాదాలతోనే..వైయస్ రాజశేఖర్ రెడ్డి వారసత్వంగా వచ్చిన ఆస్తి విషయంలో తలెత్తిన విభేదాలే.. వారిద్దరి మధ్య వివాదానికి కారణం. ఈ విషయాన్ని షర్మిల చాలా సందర్భాల్లో చెప్పుకొచ్చారు. సోదరుడు జగన్ కోసం ఎన్నో చేశానని.. జైలులో ఉన్నప్పుడు పార్టీని బతికించానని.. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘ పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ బాధపడ్డారు. అటువంటి నన్నే అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం మానేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి వారసత్వంగా తనకు లభించాల్సిన ఆస్తిపాస్తులు ఇవ్వలేదని కూడా సంకేతాలు ఇచ్చారు. రాజకీయంగా తనను వాడుకుని వదిలేశారని.. పదవులు ఇవ్వకపోవడాన్ని పరోక్షంగా ప్రస్తావించారు.

**అందుకే రాజకీయ పోరాటం**

తండ్రి వారసత్వంగా రావాల్సిన ఆస్తిపాస్తులు రాకపోవడం, కుటుంబం ఎంత చెప్పినా జగన్ వినకపోవడంతో రాజకీయ పోరాటమే శరణ్యంగా షర్మిల భావించారు. తెలంగాణలో పార్టీ ఏర్పాటు చేసి.. అదే పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఏకంగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. తన ఉన్నతి కంటే జగన్ పతనాన్ని ఎక్కువగా కోరుకున్నారు. ఆ విషయంలో సక్సెస్

# ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి సీతక్క



**హైదరాబాద్-నవభూమి** రాష్ట్రంలోని కోటి మహిళలను కోటీశ్వరులుగా మార్చడానికి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు మహిళలు 17 రకాల వ్యాపారాలు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తున్నదని మంత్రి సీతక్క(అన్నారు. గురువారం ములుగు మండలం మల్లంపల్లి గ్రామంలోని ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ మహాలక్ష్మి మిల్క్ పార్లర్, కోమలి డిజిటల్ స్టూడియో, బుక్ స్టాల్, జిరాక్స్, ఇంటర్నెట్ సెట్ సెంటర్, సునిత ఎంబ్రాయిడరీ వర్క్స్, శ్రీ వెంకటేశ్వర కిరాణం జనరల్ స్టోర్‌లను ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో 20 ఎకరాల స్థలంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి మహిళలు ఒక అప్పగిస్తామన్నారు. వడ్డీ లేని రుణాలను తీసుకుంటున్న మహిళలు సకాలంలో అప్పు చెల్లించాలని, తిరిగి పెద్ద మొత్తంలో అప్పు కోరిన మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ములుగు జిల్లాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి అన్ని పార్టీల నాయకులు ముందుకు రావాలన్నారు.




## తెలంగాణ భవన్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు



**హైదరాబాద్-నవభూమి** తెలంగాణ భవన్( వద్ద భారీ పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో.. తెలంగాణ భవన్ వద్ద భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. కాగా, ఎమ్మెల్యే అరికపూడి గాంధీని కాంగ్రెస్ ప్రభుత్వం పీఏసీ చైర్మన్‌గా ప్రకటించినప్పటి నుంచి విమర్శల పర్వం మొదలైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి (నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఆయన ఇంటిపై కోడి గుడ్లు, టమాటాలు విసిరేశారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలపై కుర్చీలతో దాడికి దిగారు. ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. సవాళ్లు, ప్రతిసవాళ్ల నడుమ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. కొండాపూర్‌లోని కౌశిక్ రెడ్డి నివాసానికి తన అనుచరులతో కలిసి వెళ్లారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే గాంధీ అనుచరులు పోలీసులను తోసుకుంటూ ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో గేటు దూకి కౌశిక్ రెడ్డి ఇంట్లోకి చొచ్చుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు.. అక్కడే ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. కోడిగుడ్లు, టమాటాలు విసిరేశారు. ఇంటి అద్దాలను కుర్చీలతో ఇంటి అద్దాలను పగులగొట్టారు. పోలీసులపై చేయిచేసుకున్నారు. ఇంత జరుగుతున్నా గాంధీ అనుచరులు, కాంగ్రెస్ గూండాలను పోలీసులు నిలువరించలేకపోవడం గమనార్హం. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు క్యాంప్ ఆఫీస్‌పై దాడి ఘటన మరువక ముందే కౌశిక్ రెడ్డి ఇంట్లో కాంగ్రెస్ కార్యకర్తలు విధ్వంసం సృష్టించడం విశేషం.

## టీఎన్జీఓ కాలనీలో రేవ్‌పార్టీ..



**హైదరాబాద్-నవభూమి:** గచ్చిబౌలి టీఎన్‌జీఓ కాలనీలో రేవ్‌పార్టీ సంచలనం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో టీఎన్‌జీవో కాలనీ అలయ్‌బలయ్ చౌరస్తా పక్కన ఉన్న ఓ ఇంట్లో యువతీ యువకులు పెద్ద శబ్దాలతో మ్యూజిక్ పెట్టుకుని డ్యాన్స్ చేస్తున్నారు. గమనించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గచ్చిబౌలి పోలీసులుకాలనీలోని ప్లాట్ నెంబర్ 93లోని ఇంటిపై దాడి చేశారు. రేవ్‌పార్టీలో పాల్గొన్న కె. ఆదిత్య, పిన్నింటి రామకృష్ణ, పెద్దరెడ్డి గారి చరణ్, గొర్తి సాయి ప్రవీణ్, వీరపనేని వరుణ్, శివశంకర్‌రెడ్డి, వీర శివారెడ్డి, మద్దినేని హరికృష్ణ, కాటేపల్లి రమేష్, మండపూడి కోటేశ్వరరావు, అనపర్తి విజయ్‌కుమార్, కోట్ల అజయ్, డి. సంధ్య, కూకటి ఆశ, కూకటి రీతు, షేక్ సమ సుల్తానా, ఎం. కీర్తి, యశోధలను అదుపులోకి తీసుకున్నారు.

వారి నుంచి 40 గ్రాముల గంజాయి, పలు రకాల మద్యం బాటిళ్లు, 11 హుక్కా వినియోగించే పాట్స్, ఆరు ఓసీబీ పేపర్స్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వీరపనేని వరుణ్ ధూల్‌పేట్ నుంచి 50 గ్రాముల గంజాయి కొని తెచ్చినట్లు తెలిసింది. ఆదిత్య అతని మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఆ ఇంట్లో అద్దెకు ఉంటూ ఈ పార్టీ నిర్వహించినట్లు నిందితులు తెలిపారు. వారిలో ఇద్దరు సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టులుగా పనిచేస్తున్నారు. కాగా, పరీక్షలో కె.ఆదిత్య, వీరపనేని వరుణ్, గొర్తి సాయి ప్రవీణ్ గంజాయి తీసుకున్నట్లు తేలడంతో వారిపై ఎన్‌డీపీఎస యాక్టు కింద కేసు నమోదు చేసి, మిగతా వారిపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చివేతలా?



**హైదరాబాద్-నవభూమి:** ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చివేయడం రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును ఉల్లంఘించినట్లేనని సున్నం చెరువు బాధితులు వాపోతున్నారు. మాదాపూర్‌లో హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై బాధితులు ఢిల్లీలోని జాతీయ మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. మాదాపూర్ సరోజినినాయుడు నగర్‌లో దాదాపు 200 మంది పేదలు 15 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. గుడిసెల్లో నివసించేవారు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం నగరానికి వచ్చినవారే.ముందస్తు నోటీసులు ఇవ్వకుండా హైడ్రా అధికారులు సెప్టెంబర్ 8న ఆదివారం పోలీసులతో కలిసి కూల్చివేతలు చేపట్టారు. విధులకు అడ్డంకులు కల్పిస్తున్నారని కొంతమంది బాధితులపై కేసులు నమోదు చేశారు. కూల్చివేతల సమయంలో గుడిసెల్లో ఉన్న సామాన్లు, నిత్యావసరాలు, చివరికి పిల్లల పుస్తకాలు తీసుకునే సమయం కూడా హైడ్రా అధికారులు ఇవ్వలేదని ఆరోపించారు. కూల్చివేతల్లో నష్టపోయిన పేదలకు పరిహారం అందించాలని, పునరావాసం కోసం ఏర్పాట్లు చేయాలని, పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు

# మెడికల్ అడ్మిషన్లకు స్థానికతపై సుప్రీంకు తెలంగాణ సర్కార్




**హైదరాబాద్-నవభూమి:** మెడికల్ అడ్మిషన్లకు స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును (%ాబజుాతీవఎవ జశీబతీ%) ఆశ్రయించింది. తెలంగాణ శాశ్వత నివాసులు రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానిక రిజర్వేషన్ వర్తించదన్న ప్రభుత్వ నిబంధనను కొట్టివేస్తూ ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణలో చదువుకోలేదన్న కారణంతో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించరాదని హైకోర్టు ఆదేశాల్లో పేర్కొంది.ఈ క్రమంలో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరఫు న్యాయవాది మెన్షన్ చేశారు. త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం వెల్లడించింది.

తెలంగాణ హైకోర్టు తీర్పిదే...కాగా... తొమ్మిదో తరగతి నుంచి వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వాళ్లే.. రాష్ట్రంలో వైద్య విద్యకు స్థానిక కోటాలో అర్హులంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలపై హైకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చింది. తెలంగాణలో శాశ్వత నివాసితులకు ఈ నిబంధన వర్తించదని పేర్కొంటూ.. 'తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్-2017'కు జీవో 33 ద్వారా ప్రభుత్వం తెచ్చిన సవరణ, రూల్ 3(ఏ)ని పునర్నిర్వచించింది. శాశ్వత నివాసులు కేవలం రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటే.. స్థానికులు కాకుండా పోబోరని అభిప్రాయపడింది. శాశ్వత నివాసులైన విద్యార్థులను గుర్తించి, వారికి మెడిసిన్ కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. తెలంగాణలో వైద్యవిద్యలో అడ్మిషన్లకు ప్రభుత్వం 2017లో నిబంధనలను రూపొందించింది. అయితే.. విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగియడంతో.. ఆ నిబంధనలకు సవరణలను తీసుకొస్తూ.. సర్కారు జూలై 19న జీవో 33ని తీసుకువచ్చింది.దీని ప్రకారం.. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు వరుసగా తెలంగాణలో చదివిన వాళ్లే స్థానికులు అని రూల్ 3(ఏ)లో నిర్వచించింది. అయితే.. ఇంటర్‌తోపాటు నీట్ కోచింగ్, ఇతరత్రా కారణాల వల్ల వేరే రాష్ట్రాల్లో చదివిన తెలంగాణ శాశ్వత స్థానికులైన విద్యార్థుల పాలిట ఈ నిర్వచనం శరాఘాతంగా మారింది. సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోవడంపై 130 మందికి పైగా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. 53 వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు. "తెలంగాణ స్థానికులమే అయినా.. కేవలం ఒకట్రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కాంపిటెంట్ కోటాలో 85% సీట్లకు మమ్మల్ని అనర్హులుగా ప్రకటించడం చెల్లదు" అని కోర్టుకు వివరించారు.ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఎ.ప్రభాకర్‌రావు వాదనలను వినిపించారు. "ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ముగియడంతో.. తెలంగాణ లోకల్ ఏరియాగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ స్థానికులకు స్థానిక కోటా సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దాంతో రూల్స్ సవరించాం. తెలంగాణ శాశ్వత నివాసితులకే స్థానిక రిజర్వేషన్ దక్కడం రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయం" అని పేర్కొన్నారు.

# ఫ్యామిలీతో జగన్ రాజీ?

**(1వపేజీ తరువాయి)**అయ్యారు. షర్మిల వల్లే తాను ఓడిపోయానని జగన్ ఇప్పుడు భావిస్తున్నారు. అందుకే షర్మిల తో రాజీకి ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

**షర్మిలకే లోటస్ ఫండ్**

అవసరం ఎంత పని అయినా చేయిస్తుందం టారు. గతంలో వాటా ఇచ్చేందుకు జగన్ అంగీకరించలేదు. కానీ ఇప్పుడు షర్మిలకు ఆస్తుల్లో సగం వాటా ఇచ్చేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని లోటస్ పాండు మొత్తం ఇచ్చేయడంతో పాటు కొన్ని వ్యాపారాల్లో వాటా కూడా ఇచ్చేందుకు జగన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. కానీ షర్మిల పునరాలోచనలో పడినట్లు సమాచారం. ఒకవేళ ఆస్తులు ఇచ్చినా.. రాజకీయ పోరాటం ఆపే ప్రసక్తి లేదని ఆమె తేల్చి చెబుతున్నట్లు తెలుస్తోంది.

మొత్తానికి అయితే జగన్ ఫ్యామిలీకి భయపడుతున్నారు. కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని చూస్తున్నారు. మరి అందులో ఎంతవరకు సఫలీకృతులు అవుతారో చూడాలి.

# బీజేపీలో ఐక్యతా రాగం..

**(1వపేజీ తరువాయి)**చాంబర్‌లో పార్టీ శాసనసభాపక్ష విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీ హాజరు కావడం విశేషం. హాజరైన వారిలో ఎల్పీ నేత మహేశ్వరరెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర రెడ్డి, గోడం నగేశ్, ఎమ్మెల్యేలు రాకేశ్ రెడ్డి, హరీశ్ బాబు, పాయల్ శంకర్, ధన్ పాల్, రామారావు పాటిల్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఉన్నారు.

రాష్ట్ర సర్కారు సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవం పేరిట నిర్వహించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. దీనిపై చర్చించిన బీజేపీ నేతలు విమోచన దినోత్సవంగానే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రికి లేఖ రాయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో హడావుడి చేస్తున్నారని, 2003 లోనే అక్రమ నిర్మాణాలపై గుజరాత్ లో సీఎం గా మోడీ పక్షపాతం లేకుండా అందరివీ కూల్చివేశారని ఎంపీ అరవింద్ గుర్తు చేశారు. హైడ్రా మాత్రం ఒక వర్గాన్ని టార్గెట్ చేసినట్లు ఉందని.. తమకు సెక్యులర్ హైడ్రా కావాలని అరవింద్ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేసిందని.. అందరికి రుణమాఫీ చేయాలని సెప్టెంబర్ 20న ధర్నా చౌక్ లో దీక్ష చేయనున్నట్లు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి తెలిపారు. వరద బాధితులు ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని,.. ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం చేస్తుందని సర్కారును హెచ్చరించారు.

కమలం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అత్యవసర సమావేశం నిర్వహించడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువయ్యాయని.. లోక్ సభ ఎన్నికల తర్వాత పార్టీ గ్రాఫ్ పడిపోతుందన్న ప్రచారం వేళ ప్రజాప్రతినిధుల సమావేశం సఖ్యతను చాటుతోంది.

తొలుత ఎల్పీ మీటింగ్ పెట్టాలని అనుకున్నప్పటికీ ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఎంపీలను సైతం ఆహ్వానించి ఎల్పీనేత మహేశ్వర రెడ్డి పార్టీ అంతా కలిసి కట్టుగా ఉందనే సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇదే తరహాలో నేతలంతా కలిసి ప్రభుత్వ వైఫల్యాలను గ్రౌండ్ లెవల్ లోనూ నిలదీస్తే స్థానిక ఎన్నికల్లో మంచి ఫలితాలు ఉంటాయని కేడర్ భావిస్తోంది.

# సీతారాం ఏచూరి కన్నుమూత

**(1వపేజీ తరువాయి)**సీపీఐ (మార్క్సిస్ట్) పార్టీలో చేరారు. 1975 ఎమర్జెన్సీ సమయంలో ఆయన జేఎన్ యూ విద్యార్థిగా ఉన్నారు. ఆ సయయంలో ఆయనను కూడా అరెస్ట్ చేశారు. సీతారాం ఏచూరి వ్యక్తిగత జీవితం విషయానికొస్తే... మొదటి భార్య పేరు ఇంద్రాణి మజుందార్. ఆమె ప్రముఖ విద్యావేత్త, వామపక్ష కార్యకర్త, స్త్రీవాద ఉద్యమకారిణి వీణా మజుందార్ కుమార్తె.

ఇక, ప్రముఖ మహిళా జర్నలిస్టు సీమా చిస్తీని సీతారాం ఏచూరి రెండో వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం కాగా... ఒక కుమార్తె ఎడింబరో వర్సిటీలో ప్రొఫెసర్. ఓ కుమారుడు పాత్రికేయుడు కాగా, మరో కుమారుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఇక, ఉమ్మడి ఏపీకి సీఎస్ గా వ్యవహరించిన మోహన్ కందా... సీతారాం ఏచూరికి మేనమామ అవుతారు.

**ఏచూరి మృతిపట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సంతాపం**



కొత్తగూడెం సెప్టెంబర్ 12 నవభూమి ప్రతినిధి: సిపిఐ (ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి (72) మృతిపట్ల సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సంతాపాన్ని ప్రకటించారు. విద్యావేత్తగా ఉన్న ఏచూరి సిపిఎం పార్టీలో చేరి క్రియాశీలంగా నిలిచారని, అనేక ప్రజా, కార్మికోద్యమాలను నాయకత్వం వహించారని, దేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. సిపిఎం, అనుబంధ ప్రజా సంఘాల్లో ఎన్నో పదవులు చేపట్టి అంచెలంచెలుగా దేశ నాయకుడిగా ఎదిగాడని అన్నారు. బలమైన రాజకీయ నాయకున్ని దేశం కోల్పోయిందని, ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని అన్నారు.

# రేవంత్ సర్కార్‌కు హైకోర్టులో ఊరట

**(1వపేజీ తరువాయి)** కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. బకాయిలు చెల్లించకపోవడం తో విద్యుత్ కొనుగోలు బిడ్లో తెలంగాణ డిస్కమ్లు పాల్గొనకుండా నేషనల్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకుంది. రూ.261 కోట్ల బకాయిలు చెల్లించాలని పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. ఈరోజు ఉదయం నుంచి తెలంగాణ డిస్కంలను విద్యుత్తు కొనుగోలుకు బిడ్లు వేయకుండా పవర్ ఎక్ఛేంజీలు నిలిపివేశాయి.విద్యుత్ కొనుగోలు బిడ్లో పాల్గొనకుండా అడ్డుకున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ట్రాన్స్ కో-జెన్ కో సీఎండీ రోనాల్డ్ రాస్ వాదనల కోసం హైకోర్టుకు వెళ్లారు. విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నిర్ణయంపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వాన్ని విద్యుత్ బిడ్డింగ్కు అనుమతించాలని ఎన్ఎల్డీసీని ఆదేశించింది. దీంతో విద్యుత్ కొనుగోలు బిడ్డింగ్లో పాల్గొనేందుకు ప్రభుత్వానికి అడ్డంకి తొలగింది. ఛత్తీస్గఢ్ నుంచి విద్యుత్ను తెచ్చుకునేందుకు గత ప్రభుత్వం పవర్గ్రిడ్ కార్పొరేషన్తో విద్యుత్ సరఫరా కోసం కారిడార్ను బుక్ చేసింది. ఈ కారిడార్ వివాదం ఇప్పుడు తెలంగాణ డిస్కంల మెడకు చుట్టుకుందని అధికారులు చెబుతున్నా రు. గత ప్రభుత్వం కారిడార్లను ముందుగానే బుక్ చేసుకుందని, కేవలం 1000మెగా వాట్ల కారిడార్ సరిపోతుండగా.. అవసరం లేకపోయి నా మరో 1000 మెగావాట్ల అడ్వాన్స్ కారిడార్ల ను బుక్ చేసిందని చెబుతున్నారు. అయితే.. ఛత్తీస్గఢ్‌కు కరెంటు వచ్చే అవకాశం లేకపోవ డంతో ఈ కారిడార్ను ప్రభుత్వం సగంలోనే రద్దు చేసింది. అయితే ఈ లోపే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వాడినా వాడకున్నరూ. 261 కోట్లు పరిహారంగా చెల్లించాలని తెలంగాణ డిస్కమ్లకు పీజీసీఐఎల్ నోటీసులు జారీ చేసింది. అవగాహన లేకుండా చేసుకున్న కారిడార్ ఒప్పందం వల్లే ఈ సమస్య తలెత్తిందని అధికా రులు చెబుతున్నారు. ఈ వివాదంపై తెలంగాణ డిస్కమ్లు ఇప్పటికే సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ను ఆశ్రయించాయి. ఈ వివాదం సీఈఆర్సీ పరిధిలో ఉండగా.. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో వాదనలు వినిపించనుంది.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరెంటు కొనుగోలు చేయడంతో రాష్ట్రం భారీగా నష్టపోయిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. 2600 కోట్ల నష్టం వాటిల్లిందని జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఈ విషయమై విచారణ జరిపినప్పుడు అక్కడే ఉన్న విద్యుత్ జేసీ చైర్మన్ రఘు చెప్పిన విషయం తెలిసిందే. ఒప్పందం ప్రకారం ఛత్తీస్గఢ్ విద్యుత్ సరఫరా చేయలేదని రఘు తెలిపారు. అనంతరం మరో 1000 మెగావాట్లకు అగ్రిమెంట్ కుదుర్చుకున్నామని, తప్పు తెలిసి రద్దు చేసుకోవాలంటే కుదరలేదని పేర్కొన్నారు.

# పొలిటికల్ హీట్!

**(1వపేజీ తరువాయి)** తడాఖా చూపిస్తామన్నారు. ఇవాళ అరెకపూడి గాంధీ చేసిన చర్యకు రేపు ప్రతిచర్య ఉంటుందని కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. అరెకపూడి గాంధీ కృష్ణా జిల్లా నుంచి హైదరాబాద్‌కు వచ్చారని, తాను నిఖార్సైన తెలంగాణ బిడ్డను అని తెలిపారు.

**హరీష్ రావు అరెస్ట్**

బీఆర్ఎస్ సీనియర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావును అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరికొంతమంది బీఆర్ఎస్ నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారందరినీ శంషాబాద్ పీఎస్‌కు తరలించారు. కాగా తమ పార్టీ నేత కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ నేత అరికెపూడి గాంధీని వెంటనే అరెస్ట్ చేయాలని, లేకపోతే కోర్టుకు వెళ్తామంటూ హరీశ్ రావు సైబరాబాద్ సీపీ ఆఫీస్ ముందు ఆందోళనకు దిగారు.

అలాగే ఆయనపై హత్యాయత్నం కేసు పెట్టాలని డిమాండ్ చేస్తూ అనుచరులతో కలిసి నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే సీపీ ఆఫీస్ దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే పరిస్థితి చేయి దాటకూడదనే ఉద్దేశంతో పోలీసులు హరీశ్ రావును, ఆయన అనుచరులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## తెలంగాణభవన్ వద్ద ఉద్రిక్తత

**(1వపేజీ తరువాయి)**చేపట్టారు. కౌశిక్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ మహిళా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే ఫొటోలను దగ్ధం చేశారు. మహిళలపై కౌశిక్ రెడ్డి అసభ్యకరంగా మాట్లాడారని, ఆయనపై పార్టీ వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేటీఆర్ లాంటి వాళ్లనే వదల్లేదని, కౌశిక్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందేనంటూ వారు పట్టుబట్టారు.

ఇదిలా ఉంటే.. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని రాష్ట్ర ప్రభుత్వం పీఏసీ చైర్మన్ గా తాజాగా ప్రకటించింది. అప్పటి నుంచి ఇరు పార్టీల మధ్య విమర్శల పర్వం నెలకొన్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మధ్ సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కొండాపూర్ లోని కౌశిక్ రెడ్డి నివాసానికి తన అనుచరులతో కలిసి వెళ్లిన విషయం తెలిసిందే.

**ఎమ్మెల్యేకే రక్షణ లేకుంటే.. ఇక సామాన్యులకు ఏం రక్షణ ఉంటది?: హరీశ్‌రావు**

అయితే, అప్పటికే అక్కడ భారీగా మోహరించి ఉన్న పోలీసులు వారిని అడ్డుకోగా, గాంధీ అనుచరులు పోలీసులను తోసుకుంటూ కౌశిక్ రెడ్డి ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, ఎమ్మెల్యే అనుచరుల మధ్య పెనుగులాట జరిగింది. పలువురు కోడిగుడ్లు, టమాటాలు విసిరేశారు. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి.

ఈ విషయం తెలుసుకున్న సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుతోపాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొండాపూర్ లోని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. అనంతరం ఆయనను పరామర్శించారు. ఆ తరువాత అక్కడ నెలకొన్న పరిస్థితులను వారు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? హరీశ్ రావు మండిపడ్డారు.

## కౌశిక్ రెడ్డి అరెస్టుకు రంగం సిద్ధం

**(1వపేజీ తరువాయి)**చేయడం జరిగింది. గురువారం ఉదయమే కౌశిక్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే గాంధీ ఇంటిపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామంటూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి ముందు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్లి ఆయన తెలంగాణ భవన్ కు తీసుకువస్తానని కౌశిక్ రెడ్డి ప్రకటించారు. దీంతో పోలీసులు అలర్ట్ అయ్యి ఆయన నివాసం ముందు మోహరించారు. మరోవైపు అరికెపూడి గాంధీ నివాసం వద్ద కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అరికెపూడి గాంధీ సైతం కౌశిక్ రెడ్డికి రివర్స్ సవాల్ విసిరారు. '11 గంటలకు వస్తా అన్నావు.. రాకుంటే నేను నీ ఇంటికి 12 గంటలకు వస్తా.. నీ దమ్ము ఏంటో మా దమ్ము ఏంటో తేల్చుకుందాం' అని అరేకపూడి గాంధీ ఛాలెంజ్ చేశారు. దీంతో ఇరువురి ఇంటి వద్దా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే తన ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు ఏమీ అవసరం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారు.

## 'బీఆర్ఎస్ మైండ్‌గేమ్'

**(1వపేజీ తరువాయి)**చట్టం కఠినంగా ఉంటే మా ప్రభుత్వానికి మంచిదే. ఆ మాటలు కౌశిక్ రెడ్డి మాట్లాడితే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి. బీఆర్ఎస్ ముఖ్యులకు తెలిసే కౌశిక్ రెడ్డి అలా మాట్లాడితే బీఆర్ఎస్ నేతలు వెంటనే క్షమాపణలు చెప్పాలి' అంటూ రేవంత్ అన్నారు.

## బదిలీలపై నిషేధం ఎత్తివేత

**(1వపేజీ తరువాయి)**ప్రకారం ఈ నెల 22 వరకూ బదిలీల ప్రక్రియ కొనసాగనుంది. అనంతరం సెప్టెంబర్ 23 నుంచి తిరిగి బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. ఎక్సైజ్ శాఖకు మాత్రం ఈ నెల 30 వరకూ బదిలీల గడువు పొడిగించారు. వీరికి అక్టోబర్ 1 నుంచి బదిలీపై నిషేధం అమల్లోకి వస్తుంది.

## జగన్ కోర్టుకు రావాల్సిందే

**(1వపేజీ తరువాయి)** పెండింగ్‌లోనే ఉంది. ఈ కేసు విచారణలో సహ నిందితుడు పాల్గొంటూనే ఉన్నారు. అదే విధంగా జగన్ కూడా పాల్గొంటారని భావించడం సహజం. కానీ అలా జరగలేదు. అప్పటి నుంచి ఈ కేసు పెండింగ్‌లోనే ఉంటూ వచ్చింది. ఇప్పుడు తాజాగా పాస్‌పోర్ట్ రిన్యూవ ల్‌కు విజయవాడ కోర్టు జగన్ ఆశించి నట్లు ఐదేళ్లకు కాకుండా ఏడాదికే ఇవ్వడం వల్లే హైకోర్టును ఆశ్రయించారు. ప్రత్యేక కోర్టు షరతు పెట్టడంతోనే పాస్‌పోర్ట్ ఎన్ఓసీ కోసం జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని బట్టి చూస్తే జగన్ కేవలం తనకు అవస రం అయినప్పుడు మాత్రమే న్యాయవిచారణకు హాజరవుతున్నట్లు ఉంది" అని హైకోర్టు ఆక్షేపించింది.

**సమన్లు సమాచారం మాత్రమే ఇస్తాయి..**

"పరువు నష్టం కేసులో సమన్లు అందకపోవడంతో తనను పూచీకత్తు సమర్పించలని ప్రత్యేక కోర్టు ఆదేశించలేదనే జగన్ వాదన సరికాదు. సమన్లు కేవలం సదరు కేసులో పెండింగ్‌లో ఉందని, విచారణ ప్రక్రియలో పాల్గొనాలని సమాచారాన్ని మాత్రమే తెలియజేసే పత్రాలు. పరువు నష్టం కేసులో న్యాయవాది సహాయంతో జగన్ తనకు సానుకూల ఉత్తర్వులు కూడా పొందారు. కోర్టు విచారణకు సహకరిస్తానని, దానికి లోబడి ఉన్నా చెప్తూనే పూచీకత్తు సమర్పించాలని ఇచ్చిన ఆదేశాలను జగన్ ప్రశ్నిస్తున్నారు. అది సరైన పద్ధతి కాదు" అని న్యాయస్థానం తెలిపింది.



## వైద్యులను చర్చలకు పిలిచిన బెంగాల్ సర్కారు..



**న్యూఢిల్లీ- నవభూమి:**జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో నిరసన తెలుపుతున్న వైద్యులను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ పంపారు. సాయంత్రం 5 గంటలకు చర్చలకు రావాలని లేఖలో ఆహ్వానించారు. 15 మంది వైద్యుల ప్రతినిధి బృందంతో చర్చలకు రావాలని కోరారు. చర్చలకు సీఎం మమతా బెనర్జీ సైతం హాజరుకానున్నారు. అయితే, ఆందోళన చేస్తున్న వైద్యులతో జరిగే చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయాలన్న వైద్యుల విజ్ఞప్తిని ప్రభుత్వం తిరస్కరించింది. చర్చల పారదర్శకత కోసం రికార్డు చేసేందుకు అంగీకారం తెలిపింది. గత రెండురోజుల నుంచి ప్రభుత్వం మూడుసార్లు చర్చలకు పిలిచింది.ఇంతకు ముందు ప్రభుత్వ ప్రతిపాదనలు వైద్యులు తిరస్కరించారు. ప్రభుత్వం చర్చలకు పలు నిర్దిష్ట షరతులను విధించారు. ప్రభుత్వ ఆహ్వానంపై ఇప్పటి వరకు వైద్యులు స్పందించలేదు. అయితే, చర్చలకు 15 మంది ప్రతినిధులకు బదులుగా కనీసం 30 మంది ప్రతినిధులను అనుమతించాలని వైద్యులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను మమతా బెనర్జీ సమక్షంలోనే చర్చించాలని, ప్రత్యక్ష ప్రసారం చేయాలని స్పష్టం చేశారు. అయితే, ఆరోగ్యమంత్రి చంద్రిమా భట్టాచార్య డిమాండ్లను తిరస్కరించారు. వైద్యులతో చర్చలకు సంబంధించిన షరతులను అంగీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. వైద్యులు షరతులు విధించారని.. ఓపెన్ మైండ్‌తో సమావేశం నిర్వహించేందుకు సిద్ధంగా లేరన్నారు.

## కార్లతోనే కోటీశ్వరురాలు వినేశ్.. నామినేషన్‌లో పేర్కొన్న ఆస్తులివే



**న్యూఢిల్లీ- నవభూమి:**ఏడాదిన్నర కిందటే ఆమె ఉద్యమించిన సమయంలో సంచలనం.. సరిగ్గా నెల కిందట పారిస్ ఒలింపిక్స్ లో ఆమె పతకాన్ని అనూహ్యంగా కోల్పోయిన వేళ పెద్ద వివాదం.. రెండు వారాల కిందట రైతులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చిన సందర్భంలో ఆసక్తికరం.. ఇప్పుడు ఆమె రాజకీయాల్లోకి వచ్చి మరింత చర్చ లేపారు. ఆమె హరియాణాకు చెందిన ఒలింపియన్ వినేశ్ ఫొగాట్. ఇటీవల కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సమక్షంలో ఆ పార్టీలో చేరిన వినేశ్ నేరుగా ఎన్నికల రణక్షేత్రంలోకి దూకారు. రింగ్ నుంచి ఎన్నికల రణంలోకి రెజ్లింగ్ రింగ్ నుంచి ఎన్నికల రణంలోకి దూకిన వినేశ్ ఫొగాట్ కు జులానా టికెట్ ను కేటాయించింది కాంగ్రెస్. ఇక్కడ ఆమె బీజేపీ అభ్యర్థితో, జన నాయక్ జనతా పార్టీ అభ్యర్థితో తలపడాల్సి ఉంటుంది. కాగా, జులానాలో వినేశ్ గురువారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా అఫిడవిట్ లో ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఆస్తులు 4 కోట్లు.. కార్లు అరకోటిపైనే.. జులానా వినేశ్ సొంత నియోజకవర్గం. దీంతోపాటు జాట్లు అధికంగా ఉండే నియోజకవర్గం. ఇక్కడ బీజేపీ తరపున యోగేశ్ బైరాగి పోటీ చేస్తున్నారు. అయితే, హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తు కుదరని ఆమ్ ఆద్మీ పార్టీ కూడా డబ్ల్యూడబ్ల్యూఈ మహిళా రెజ్లర్ కవితా దలాల్ ను నిలబెట్టింది. నామినేషన్ సందర్భంగా రూ.4 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులు ఉన్నట్లు వినేశ్ అఫిడవిట్ లో చూపారు. ఇందులో సోనిపత్ లో రూ.2 కోట్లు విలువ చేసే స్థిరాస్తి ఉన్నట్లు తెలిపారు. రూ.35 లక్షల వోల్వో ఎక్స్ సీ 60, రూ.12 లక్షల హ్యుందాయ్ క్రెటా, రూ.17 లక్షల విలువైన టొయోటా ఇన్నోవా కార్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇన్నోవాపై రూ.13 లక్షలు రుణం ఉందని చూపారు. వినేశ్ భర్త సోమ్ వీర్ రాఠీ పేరిట రూ.19 లక్షల మహీంద్రా స్కార్పియో కారు ఉన్నట్లు అఫిడవిట్ లో పేర్కొన్నారు. వినేశ్ వద్ద రూ.1.95 లక్షల నగదు ఉంది. 3 బ్యాంకుల్లో రూ.39 లక్షల డిపాజిట్లు, సోమ్ వీర్ కు రూ.30 లక్షల వరకు బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. వినేశ్ కు ఉన్న 35 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాల విలువ రూ.2.74 లక్షలు. సోమ్ వీర్ వద్ద 28 గ్రాముల బంగారం.. 100 గ్రాముల వెండి ఉంది. హరియాణాలో పుట్టి.. మద్రాస్ లో డిగ్రీ 30 ఏళ్ల వినేశ్ సొంత రాష్ట్రం హరియాణ. ఇక్కడినుంచే పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. అలాంటి వినేశ్ ఆశ్చర్యంగా మద్రాస్ లో డిగ్రీ చదివిందట.

## స్పేస్‌వాక్ చేసిన బిలియనీర్ జేర్డ్ ఇజాక్‌మాన్



**న్యూఢిల్లీ-నవభూమి:** బిలియనీర్ జేర్డ్ ఇజాక్ మాన్..తొలిసారి స్పేస్‌వాక్ చేశారు. స్పేస్ఎక్స్ సంస్థ కు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో ఆయన నింగి లోకి వెళ్లారు. నాన్ ప్రొఫెషనల్ ఆస్ట్రోనాట్ ఇజాక్‌మాన్.. ఇవాళ అంతరిక్షంలో స్పేస్‌వాక్ చేశారు. భూమి నుంచి స్పేస్ స్టేషన్ ఉండే దూరానికి మూడు రెట్లు అధిక దూరంలో డ్రాగన్ వ్యోమనౌక ఉన్నది. స్పేస్‌క్రాఫ్ట్‌కు చెందిన కిటికీ ఓపెన్ కాగానే, స్పేస్ఎక్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో సంబరాలు మొదలయ్యాయి. ఇజాక్మాన్ వాక్ తర్వాత సారా గిల్స్ కూడా స్పేస్‌వాక్‌లో పాల్గొన్నది.వ్యోమనౌకలో మొత్తం నలుగురు నాన్ ప్రొఫెషనల్ వ్యోమగాములు వెళ్లారు. బిలియనీర్ ఇజాక్‌మాన్ ఈ ట్రిప్ కోసం ఎలన్ మస్క్ కంపెనీకి భారీగా డబ్బులు చెల్లించారు. ఈ వ్యాపారం ద్వారా బాగా ఆర్జించాలని మస్క్ ప్లానేశారు. భూమికి 435 మైళ్ల దూరంలో ఇజాక్‌మాన్ తో మరో ముగ్గురు స్పేస్‌వాక్‌లో పాల్గొన్నారు. అంతరిక్షం నుంచి భూమిని చూసిన అతను.. భూమి అద్భుతంగా ఉన్నట్లు ఇజాక్‌మాన్ పేర్కొన్నారు.

## అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్న జేడీయూ నేత అరెస్ట్.. పార్టీ నుంచి బహిష్కరణ



**న్యూఢిల్లీ- నవభూమి:**అక్రమ మద్యం వ్యాపారంతోపాటు జూదం వ్యవహారంతో సంబంధం ఉన్న జేడీయూ నేతతో సహా 14 మందిని బీహార్ పోలీసులు అరెస్ట్ చేశారు.దీంతో సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వం, ఆయన పార్టీపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ నేతను పార్టీ నుంచి జేడీయూ బహిష్కరించింది. బీహార్‌లో మద్యాన్ని నిషేధించారు. అయితే నలంద జిల్లాలో మద్యం అక్రమ వ్యాపారంతోపాటు జూదం జోరుగా సాగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అంబర్ ప్రాంతంలో రైడ్ చేశారు. జేడీయూ నేత సీతారాం ప్రసాద్‌తో సహా 14 మందిని పోలీసులు అరెస్టు చేశారు. 292 లీటర్ల విదేశీ మద్యం, 10 డెక్ కార్డులు, 9 ద్విచక్ర వాహనాలు, 14 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.కాగా, ఈ సంఘటనపై బీహార్‌లోని ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. ప్రభుత్వ రక్షణలో 'లిక్కర్ మాఫియా' కొనసాగుతున్నదని ఆర్జేడీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో జేడీయూ స్పందించింది. అస్తవాన్ బ్లాక్ జేడీయూ అధ్యక్షుడు సీతారాం ప్రసాద్‌ను పార్టీ నుంచి బహిష్కరించింది. అన్ని పార్టీ పదవుల నుంచి ఆయనను తొలగించినట్లు జేడీయూ ప్రకటించింది.మరోవైపు ఈ అరెస్టులు బీహార్ ప్రభుత్వం విశ్వసనీయతను తెలియజేస్తోందని ఆ రాష్ట్ర మంత్రి, జేడీయూ నలంద జిల్లా ఇన్‌చార్జి విజయ్ చౌదరి తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సొంత పార్టీ వారు కూడా చట్టపరంగా చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు.

## లాలూ ప్రసాద్ యాదవ్‌కు యాంజియోప్లాస్టీ చేసిన ముంబయి వైద్యులు..



**న్యూఢిల్లీ- నవభూమి:**బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. లాలూ గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చేరారు. యాంజియోప్లాస్టీ చేయించుకోవాలని కార్డియాలజిస్టులు మాజీ సీఎంకు సూచించగా ఆయన అంగీకరించారు. ఈ క్రమంలో గురువారం వైద్యులు యాంజియోప్లాస్టీ చేశారు. లాలూ గత కొంతకాలంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. గతంలో ఆయన సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్న విషయం తెలిసిందే. ఆయన కుమార్తె కిడ్నీ దానం చేసిన విషయం తెలిసిందే. లాలూ ప్రసాద్ యాదవ్ ల్యాండ్ ఫర్ స్కామ్, దాణా కుంభకోణం కేసుల్లో బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆ తర్వాత ఆరోగ్య సమస్యలతో ఆయన నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.ఈ నెల 10న ఆయన ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైద్య పరీక్షల తర్వాత ఒకటి, రెండురోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని ఆసుపత్రివర్గాలు తెలిపాయి. 2014లో లాలూకు ఇదే ఆస్పత్రిలో అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ జరిగింది. 2018, 2023 అదే ఆసుపత్రిలో పరీక్షల కోసం వచ్చారు. సతోష్ దొరా నేతృత్వంలోని వైద్యబృందం చికిత్స అందిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. నవంబర్ 2022లో లాలూ కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. ఆయనకు కూతురు రోహిణి కిడ్నీ దానం చేశారు. రోహిణి సింగపూర్‌లో నివాసం ఉంటున్నారు. చాలాకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో పోరాడుతుండగా.. నిపుణుల సూచన మేరకు కిడ్నీ మార్పిడికి ఆయన అంగీకరించారు. కూతురు రోహిణి కిడ్నీ సరిపోలడంతో సింగపూర్‌లోనే కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు.

## ఆర్జీ కర్ హాస్పిటల్ ఆవరణలో బ్యాగ్ కలకలం.. డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు

**కోల్‌కతా: - నవభూమి:**జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్ ఆవరణలో అనుమానిత బ్యాగ్ కలకలం రేపింది. ఈ నేపథ్యంలో డాగ్, బాంబ్ స్క్వాడ్‌లను రప్పించి తనిఖీ చేశారు. ఆగస్ట్ 9న రాత్రి విధుల్లో ఉన్న ట్రైనీ లేడీ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి హత్య చేశారు. ఈ దారుణంపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. నాటి నుంచి జూనియర్ డాక్టర్లు ఆ హాస్పిటల్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నారు.కాగా, గురువారం ఉదయం ఆర్జీ కర్ హాస్పిటల్ ఆవరణలోని డాక్టర్ల నిరసన ప్రాంతం వద్ద అనుమానాస్పద బ్యాగ్‌ను కొందరు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో డాగ్, బాంబ్ స్క్వాడ్‌లను అక్కడకు రప్పించారు. డాక్టర్ల నిరసన ప్రాంతం వద్ద ఉన్న బ్యాగ్‌ను చెక్ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు ధృవీకరించారు.

## నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య వందే భారత్.. 14న గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్న ప్రధాని మోదీ..



**న్యూఢిల్లీ- నవభూమి:** భారతీయ రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం రాష్ట్రాల మధ్య సెమీ హైస్పీడ్ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. ప్రస్తుతం సికింద్రాబాద్‌కు రైల్వేశాఖ రెండు కేటాయించింది. ఇందులో సికింద్రా బాద్-తిరుపతి-సికింద్రాబాద్, కాచిగూడ-యశ్వంత్‌పూర్-కాచిగూడ మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే, విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు సైతం మరో రైలు నడుస్తున్న విషయం తెలిసిందే. త్వరలో సికింద్రాబాద్‌కు మరో రైలు రానున్నది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు ఈ రైలు నడవనున్నది. ఈ నెల 14న ప్రధాని నరేంద్ర మోదీ రైలుకు ప్రారంభోత్సవం చేయనున్నారు. దీంతో పాటు తొమ్మిది రైళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. నాగ్‌పూర్-సికింద్రాబాద్ రైలుతో పాటు టాటానగర్-పట్నా, బర్హంపూర్-టాటా నగర్, రూర్కెలా-హౌరా, డియోఘర్-వారణాసి, ఆగ్రా క్యాంట్ - బెనారస్, రాయ్‌పూర్-విశాఖపట్నం, గయా-హౌరా, భగల్‌పూర్-హౌరా, వారణాసి-డియోఘర్ మార్గాల్లో కొత్తగా రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి.

## లేడీస్ హాస్టల్‌లో పేలిన ఫ్రిడ్జ్ కంప్రెసర్.. ఇద్దరు మహిళలు మృతి




**చెన్నై: నవభూమి:** లేడీస్ హాస్టల్‌లో ఫ్రిడ్జ్ కంప్రెసర్ పేలింది. ఈ సంఘటనలో ఇద్దరు మహిళలు మరణించారు. మరో ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. హాస్టల్‌లో ఉంటున్న 24 మంది మహిళలను పోలీసులు కాపాడారు. తమిళనాడులోని మదురైలో ఈ సంఘటన జరిగింది. పెరియార్ బస్టాండ్ సమీపంలో ఉన్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో గురువారం తెల్లవారుజామున 5.30 గంటలకు ఫ్రిడ్జ్ కంప్రెసర్ పేలింది. ఆ హాస్టల్‌లో ఉన్న చెక్కలకు మంటలు వ్యాపించాయి. దీంతో పొగలు దట్టంగా అలముకున్నాయి. ఈ నేపథ్యంలో ఊపిరాడక ఇద్దరు మహిళలు మరణించారు. మరో ముగ్గురు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు.కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రభుత్వ మిడిల్ స్కూల్ ఉపాధ్యాయురాలైన 50 ఏళ్ల పరిమళ సౌందర్య, ప్రైవేట్ క్యాటరింగ్ ఇనిస్టిట్యూట్‌లో టీచర్ అయిన శరణ్యను మృతులుగా గుర్తించారు. ఉమెన్స్ హాస్టల్‌లోని 24 మంది మహిళలను రక్షించారు. హాస్టల్ నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు లేడీస్ హాస్టల్ నిర్వహిస్తున్న భవనానికి సంబంధించిన ఆస్తిపై వివాదం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో దాని లైసెన్స్‌ను పునరుద్ధరించలేదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు చేపడతామని అధికారులు వెల్లడించారు.

## సమోసాలో కప్ప కాలు దర్శనం.. షాకైన కస్టమర్..!



**న్యూఢిల్లీ- నవభూమి:**సాధారణంగా బయట దొరికే ఆహార పదార్థాలను తీసుకోవద్దంటారు. ఎందుకంటే బయటి ఆహారాల తయారీకి నాసిరకం నూనెలు, పదార్థాలు వాడుతారని.. వాటి కారణంగా అనారోగ్యాలు దాపురిస్తాయని చెబుతుంటారు. బయటి ఆహారాల్లో కల్తీ మాత్రమే కాదు, శుభ్రత కూడా ఇప్పుడు ప్రధాన సమస్యగా మారింది. ఎందుకంటే ప్యాక్ చేసిన ఆహార పదార్థాల్లో పిన్నులు, సూదులు, క్రిములు, కీటకాలు బయటపడుతున్న సంఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.మొన్నటికి మొన్న ముంబైకి చెందిన వైద్యుడు కోన్ ఐస్‌క్రీమ్ బుక్ చేస్తే అందులో మనిషికి సంబంధించిన తెగిపోయిన వేలు దర్శనమిచ్చింది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్ నోయిడా సిటీలోని సెక్టార్-12 కు చెందిన ఓ మహిళ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్ ద్వారా అమూల్ ఐస్‌క్రీమ్ బుక్ చేయగా అందులో జెర్రి దర్శనమిచ్చింది. దాంతో షాకవడం ఆమె వంతైంది. ఇప్పుడు తాజాగా అలాంటి అనుభవమే మరో కస్టమర్‌కు ఎదురైంది.ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి స్థానికంగా ఉన్న బికనీర్ స్వీట్స్ షాప్‌లో సమోసా కొనుక్కున్నాడు. ఎంతో ఆత్రుతగా దాన్ని తినడం మొదలు పెట్టాడు. ఇంతలో అతడికి ఊహించని షాక్ తగిలింది. సమోసా మధ్యలో కప్ప కాలు దర్శనమిచ్చింది. దాంతో కంగుతినడం అతని వంతైంది. వెంటనే దుకాణంలో ఉన్న వారిని ఈ ఘటనపై ప్రశ్నించాడు. వారిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడే ఉన్న వారు ఈ తతంగాన్నంతా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. ప్రస్తుతం అది వైరల్‌గా మారింది.

## సీజేఐ ఇంట ప్రధాని మోదీ.. రేగిన వివాదం



**న్యూఢిల్లీ- నవభూమి:** న్యూఢిల్లీలోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి. వై. చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణపతి వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. దీనిపై మహారాష్ట్రకు చెందిన శివసేన పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ స్పందించారు. సీజేఐ ఇంటికి ప్రధాని మోదీ వెళ్లడంతో న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమయ్యే అవకాశముందని ఆయన వ్యాఖ్యానించారు.
రాజకీయ నాయకుడితో రాజ్యాంగ సంరక్షకుడు సమావేశం కావడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ వ్యాఖ్యలతో సీజేఐ నివాసానికి ప్రదాని మోదీ వెళ్లడం వివాదాస్పదంగా మారింది. శివసేన ఎంపీ వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. గణపతి పూజా వేడుకల్లో మాత్రమే ప్రధాని మోదీ పాల్గొన్నారని స్పష్టం చేసింది. ఇది మన సంస్కృతిలో భాగమని ఈ సందర్భంగా వివరించింది.
ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని నిజమైన శివసేన పార్టీగా గుర్తిస్తూ మహారాష్ట్ర స్పీకర్ నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే శిబిరం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారణకు వచ్చే సమయంలో సుప్రీంకోర్టు ధర్మాసనం నుంచి తప్పుకోవాలని సీజేఐకి ఎంపి ఏకనాథ్ షిండే సూచించారు.అంతేకాదు.. ప్రతిపక్షాలను వ్యతిరేకంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల జాబితాను తన ఎక్స్ ఖాతాలో ఆయన పోస్ట్ చేశారు. అందులో కోల్‌కతాలోని ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం, మద్యం కుంభకోణం మనీల్యాండరింగ్ వ్యవహారంలో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అంశాలను సైతం పొందు పరిచారు. ఈ కేసులన్నీ వరుస క్రమంలో ఓ పద్ధతి ప్రకారం అర్థం చేసుకుంటే అన్ని అర్థమవుతాయన్నారు. ఇదే అంశంపై శివసేన ఎంపీలు ప్రియాంక చతుర్వేది, మిలింద్ దేవరలు సైతం కాస్తా ఘాటు్గా స్పందించారు.

## రాహుల్ గాంధీ ఏ సమయంలో ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదు : ప్రశాంత్ కిషోర్





**న్యూఢిల్లీ- నవభూమి:**అమెరికా పర్యటనలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటనపై జన్ సురాజ్ చీఫ్, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఏ సమయంలో ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదని అన్నారు. కొద్ది నెలల కిందట కుల గణనకు అనుకూలంగా మాట్లాడిన రాహుల్ రిజర్వేషన్లను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారని గుర్తుచేశారు. అయితే అమెరికా పర్యటనలో రాహుల్ ప్రస్తుతం రిజర్వేషన్లు తొలగించడం గురించి మాట్లాడుతున్నారని అన్నారు.లోక్‌సభ ఎన్నికలు ముగిసేవరకూ రాహుల్ నిత్యం కుల గణన చేపట్టాలని, అవసరమైతే కోటా పరిమితిని పెంచాలని అన్నారని, ఇప్పుడాయన ఎందుకు రిజర్వేషన్లు తొలగించాలని మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ప్రశాంత్ కిషోర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రకటనపై కాంగ్రెస్ నేతలు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ దినేష్ శర్మ గురువారం స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భారత్ ఎకానమీ ప్రపంచంలో 11వ స్థానంలో ఉండగా ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద 5వ ఎకానమీగా ఎదిగిందని అన్నారు.త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని పేర్కొన్నారు. రక్షణ రంగంలో భారత్ ప్రస్తుతం ఆయుధాలు తయారుచేస్తోందని, భారత్ ఎడ్యుకేషన్ హబ్‌గా ఎదిగిందని, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల విద్యార్థులు ఇక్కడికి చదువుకునేందుకు వస్తున్నారని శర్మ వివరించారు. మనం సొంతంగా కొవిడ్ వ్యాక్సిన్‌ను తయారుచేశామని ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ వ్యాక్సిన్‌లను సరఫరా చేశామని గుర్తుచేశారు. భారత్ పలు రంగాల్లో మెరుగైన సామర్థ్యం కనబరుస్తుంటే రాహుల్ గాంధీ మాత్రం విదేశీ పర్యటనల సందర్భంగా తన అసహనం వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు.

## మాండ్యలో గణేష్ ప్రదర్శనపై రాళ్ల దాడి : కేంద్ర మంత్రి కుమారస్వామి కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ- నవభూమి:**కర్నాటకలోని మాండ్యలో గణేష్ చతుర్థి సందర్భంగా జరిగిన ఊరేగింపుపై రాళ్ల దాడి కలకలం రేపింది. ఈ ఘటనపై కేంద్ర మంత్రి, కర్నాటక మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి గురువారం స్పందించారు. మాండ్యలో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, అయితే ఇప్పటికే అల్లరి మూకల దాడిలో విధ్వంసం జరిగిందని అన్నారు. తాను శుక్రవారం ఘటనా స్థలాన్ని సందర్శిస్తానని చెప్పారు. ఈ ఘటనపై తాను ఇప్పటికే సమాచారం సేకరించానని తెలిపారు. గణేష్ ఊరేగింపును భగ్నం చేయాలని కొందరు దుండగులు ప్రయత్నించారని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై సరైన రీతిలో స్పందించలేదని ఆరోపించారు. కర్నాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరిన అనంతరం ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఓ వర్గం ప్రజల కోసమే పనిచేస్తున్నామనే సంకేతాలు పంపాలని కాంగ్రెస్ పాలకులు కోరుకుంటున్నారని ఆరోపించారు. అందుకే కర్నాటకలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు.కర్నాటక శాంతియుత రాష్ట్రమని, కన్నడిగులు ఇలాంటి మత ఘర్షణలకు మద్దతు ఇవ్వరని స్పష్టం చేశారు. ప్రభుత్వ అసమర్థత వల్లే ఇలాంటి ఘర్షణలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బుజ్జగింపు రాజకీయాలు మంచిదికాదని సిద్ధరామయ్య సర్కార్‌కు హితవు పలికారు. తాను కూడా రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించానని, తాను అన్ని వర్గాలకు భద్రత కల్పించానని గుర్తుచేశారు. సమాజంలో ప్రతిఒక్కరి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ప్రభుత్వం అందరికీ సరైన ప్రాధాన్యత ఇవ్వడం కీలకమని హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు.

### షాకింగ్ ఘటన.. ఆవుదూడను సజీవంగా మింగేసిన కొండచిలువ



**న్యూఢిల్లీ- నవభూమి:**అటవీ ప్రాంతంలో ఓ చోట కొండచిలువను గొర్రెల కాపరులు గుర్తించారు. 16 అడుగుల ఈ పైతాన్‌ఆవు దూడ సగ భాగాన్ని మింగేసి.. మిగతా సగభాగాన్ని చుట్టేసుకుని కనిపించింది. స్థానికులు వెంటనే దూడను కాపాడే ప్రయత్నం చేశారు. కర్నల సాయంతో కొండచిలువ శరీరం నుంచి దూడను బయటకు నెట్టేందుకు ప్రయత్నించారు. అయితే, వారి ప్రయత్నాలు ఫలించలేదు. పైతాన్ పొట్ట నుంచి ఆవును బయటకు తీసినప్పటికీ.. అది ఊరిరాడక అప్పటికే ప్రాణాలు కోల్పోయింది.

## చెన్నై ఎంఐటీ క్యాంపస్‌కు బాంబు బెదిరింపులు.. పోలీసులు అలర్ట్




**చెన్నై-నవభూమి:** దేశంలో గత కొన్ని రోజులుగా బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, విమానాశ్రయాలు, వ్యక్తులకు వరుస బెదిరింపులు వస్తున్నాయి. తాజాగా చెన్నై ఎంఐటీ క్యాంపస్‌కు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. క్రోంపేట లోని అన్నా యూనివర్సిటీ ఎంఐటీ క్యాంపస్‌కు గురువారం బాంబు బెదిరింపులు వచ్చాయి. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కార్యాలయ ఈమెయిల్‌కు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపు మెయిల్ పంపారు. వెంటనే అప్రమత్తమైన వర్సిటీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఎంఐటీ క్యాంపస్‌లో తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, జాగిలాలతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మున్నేరు బీభత్సానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందా?

ఖమ్మం నగరాన్ని ముంచెత్తిన మున్నేరు వరద అటు పాలకులకు, ఇటు ప్రజలకు ఎన్నో పాఠాలను చెప్పింది. ఒక్క రోజులో 20 వేల మందిని నిరాశ్రయులను చేసి, రూ.200 కోట్ల నష్టాన్ని మిగిల్చింది. వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు నిలువెల్లా వణికించింది. దిద్దుబాటు చర్యలు తీసుకోకుంటే ఖమ్మం నగర మనుగడకు ముప్పు తప్పదనే హెచ్చరికను జారీ చేసింది. మున్నేరు వరద బీభత్సం కేవలం ప్రకృతి విపత్తు మాత్రమే కాదు, అది స్వయంకృతం కూడా. చెరువులు, కుంటలు, ఏర్లను కబ్జా చేసి వాటిల్లో ఇండ్లు కట్టుకోవడం, ఆనక వర్షాకాలంలో అవి మునకకు గురైన తర్వాత గగ్గోలు పెట్టడం, సహాయక చర్యల పేరుతో ప్రభుత్వాలు కోట్లు వెదజల్లడం కొన్నేళ్లుగా రొటీన్ ప్రక్రియగా మారిపోయింది. హైదరాబాద్‌లో 'హైడ్రా' ఏర్పాటైన తర్వాత జలవనరుల ఆక్రమణల బాగోతాలు ఇంకా స్పష్టంగా బయటపడుతున్నాయి.ఖమ్మంలో మున్నేరుదీ ఇదే పరిస్థితి. ఇది నదిని పోలిన వాగు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 16 మండలాల్లో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6 మండలాల్లో ఇది విస్తరించి ఉంది. ఖమ్మంలో చినుకు పడకున్నా, ఎగువన ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురిస్తే.. ఖమ్మంలో మున్నేరు ఉప్పొంగుతుంది. ఖమ్మం నగరానికి దక్షిణ భాగంలో దాదాపు 13 కి.మీ. ప్రయాణం సాగించి చింతకాని, ముదిగొండ మండలాల మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. కీసర వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. ఖమ్మం నగరంలో మున్నేరు నదికి ఇరువైపులా అనేక కాలనీలు విస్తరించి వున్నాయి. వర్షాకాలంలో ఉప్పొంగే మున్నేరు.. మిగతా కాలాల్లో పిల్ల కాలువలా ప్రవహిస్తుంది.గత 25 ఏళ్ల ప్రవాహ ఉధృతి లెక్కలను పరిశీలించినప్పుడు మున్నేరు ఖమ్మం వద్ద ఏటా సగటున 33 అడుగుల ఎత్తులో ప్రవహిస్తుంది. అయితే ఈ ఏడాది ఎగువన కురిసిన భారీ వర్షాలతో అనూహ్యంగా 36 అడుగుల ఎత్తులో పోటెత్తడం, అదే సమయంలో ఖమ్మం నగరంలో 15 సెం.మీ. వర్షం కురవడంతో వరద సునామీలా విరుచుకుపడింది. నదికి ఇరువైపులా కిలోమీటరు మేర వరదనీరు నగరంలోకి చొచ్చుకువెళ్లింది. మునుపెన్నడూ ఎరుగని ప్రాంతాలు కూడా వరద తాకిడికి లోనయ్యాయి. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో 18 డివిజన్లు పూర్తిగా వరద తాకిడికి గురయ్యాయి. మరో 5 డివిజన్లు పాక్షికంగా వరదపోటుకు లోనయ్యాయి. దాదాపు 24 కాలనీల్లో జనం కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 6వేల ఇండ్లు మునకకు గురయ్యాయి. 20వేల మంది నిరాశ్రయులయ్యారు. విలువైన వస్తువులు వరదపాలు కాగా, వేలాదిమంది బడుగుల ఆవాసాలు ధ్వంసమయ్యాయి. కాలనీల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు పూర్తిగా పాడైపోయాయి. వరద తాకిడికి గురైన ఒక్కో ఇంటికి సగటున రూ.2లక్షల వరకు నష్టం జరిగినట్టు అంచనా.ఖమ్మం నగరంలోని మున్నేరు నదీ తీరాన్ని పరిశీలించినప్పుడు ఇరువైపులా పేదల ఇళ్లు పెద్దసంఖ్యలో కనిపిస్తాయి. మున్నేరు పొంగినప్పుడల్లా వరద నీరు ఇంట్లోకి రావడం వీరికి దశాబ్దాలుగా అనుభవమే. ఆర్థిక స్థోమత లేక వీరు అక్కడే జీవించడానికి అలవాటుపడ్డారు. వాస్తవానికి మున్నేరుకు ఇరువైపులా వున్న బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. నది మధ్య భాగం నుంచి 50 మీటర్ల వరకు నిర్మాణాలు నిషిద్ధం. కానీ అనేక సంవత్సరాల క్రితమే బఫర్‌జోన్‌లో వేలాది ఇండ్లు వెలిశాయి. వీటిలో అత్యధికం పేద, దిగువ మధ్య తరగతి వర్గాలకు చెందినవే. ఎలాంటి అనుమతులు లేకుండా చేసిన ఈ నిర్మాణాలకు అనంతర కాలంలో మునిసిపల్ కార్పొరేషన్ వారు ఇళ్ల నెంబర్లు కేటాయించారు. ఆయా వీధుల్లో డ్రెయినేజీలు, రోడ్లు నిర్మించారు. కరెంటు సరఫరాను అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఇండ్లల్లో జీవిస్తున్నవారు అక్కడి నుంచి కదలడానికి సుముఖంగా లేరు. ఇదే అదనుగా ఆర్థిక స్థితిమంతులు కూడా భారీ భవనాలు నిర్మించుకున్నారు. ఇలా కిలోమీటర్ల పొడవునా నదికి ఇరువైపులా నిర్మాణాలు చోటుచేసుకోవడంతో మున్నేరు వరద తాకిడి అనివార్యమైంది.ప్రకృతి విపత్తులు ఊహించని స్థాయిలో ఉంటాయని చెప్పడానికి ఖమ్మం మున్నేరు వరద విలయమే సాక్ష్యం. ప్రవాహ స్థాయిని అధికారులు ఒక విధంగా అంచనా వేయగా, ఇప్పుడది అంచనాను మించిపోయింది. ఈ వరదల నుంచి ఖమ్మం నగరాన్ని రక్షించడానికి నిర్మించతలపెట్టిన రక్షణగోడలను తాజా విలయం ప్రశ్నార్థకం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.690 కోట్ల అంచనా వ్యయంతో 8 కి.మీ. పొడవునా నదికి ఇరువైపులా 33 అడుగుల ఎత్తు, 3.3 మీటర్ల వెడల్పుతో గోడ నిర్మించడానికి నిర్ణయించి ఆర్నెల్ల క్రితం పనులు కూడా ప్రారంభించారు. మున్నేరు ప్రవాహం సగటున 30 అడుగుల మేర ఉంటోందన్న అంచనాతో రక్షణ గోడలకు శ్రీకారం చుట్టారు. అయితే మొన్నటి ప్రవాహం 36 అడుగుల పైనే ఉండటంతో అధికారులు నివ్వెరపోయారు. ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. రక్షణ గోడల రీడిజైన్‌పై అధ్యయనం చేసే బాధ్యతను నిపుణుల కమిటీకి అప్పగించారు. తాజా వరద పోటుతో రక్షణగోడలు ఏ మేరకు ఖమ్మం నగరాన్ని రక్షిస్తాయనేది ప్రశ్నగా మారింది. ఒకవేళ రక్షణ గోడలు నిర్మించినా.. వరదతో మున్నేరు ఉప్పొంగుతుంటే ఖమ్మం నగరంలోని వర్షపు నీరు మున్నేరులో ఎలా కలుస్తుందని, బ్యాక్‌వాటర్ సమస్యతో నగరంలోని కాలనీలు జలమయం కావా.. అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాలను నిపుణులు సూచిస్తున్నా అవి ఏ మేరకు ఆచరణలో ఫలితాలను ఇస్తాయో తెలియదు. వరదల సమయంలో తీవ్రంగా చర్చకు వచ్చే మున్నేరు రెస్క్యూ అంశాలు ఆ తర్వాత మరుగున పడిపోవడం రివాజుగా మారింది.మున్నేరు వరదల విలయంలో చిక్కుకోవడం ఖమ్మం నగరానికి తరుచూ అలవాటుగా మారినా, శాశ్వత పరిష్కారాలు మాత్రం ఇప్పుడప్పుడే కనిపించే పరిస్థితులు లేవు. ఈ నదీతీరం నుంచి ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించి శాశ్వత పునరావాస చర్యలు చేపట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ అది అంత సులభం కాదు.


# బౌద్ధ విశ్వవిద్యాలయాలకు నెలవు భారతదేశం



సనాతన వాదుల చేతిలో ధ్వంసమైన చరిత్ర

మనిషి మనుగడకు జ్ఞానం ఒకటే మార్గం

ప్రపంచ దేశాలు అన్నిటికంటే మత విశ్వాసాలు ఆచారాలు మత ద్వేషాలు అధికంగా పాటించే దేశంగా భారతదేశ ఉంటుందని చరిత్రకారులు చెప్తున్నారు . ఒక మతం ఆచారం ఒక యుగంలో గొప్పదని ఆచరిస్తే ఆ తర్వాత కాలంలో అది కనుమరుగైపోయి కొత్త కొత్త ధర్మాలు కొత్త ఆచారాలు పుట్టుక వస్తున్నాయి . భారతదేశంలో అట్లా చాలా మార్పులు జరిగాయి జరుగుతూ వస్తున్నాయి . హిందూ సనాతన ధర్మమనేది అధికారికంగా లేకపోయినా చారిత్రక ఆధారాలు లేకపోయినా మనో సిద్ధాంతం పైన కొనసాగుతూ వస్తుంది. నేటి ఆధునిక ప్రపంచంలో అందులో ఉన్న లోపాలను ఎత్తిచూపుతో అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి . ప్రపంచ చరిత్ర లో దేశంలోనే అతి పురాతనమైన నలంద యూనివర్సిటీని తిరిగి పునర్జీవం పోయడానికి ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల పనులు ప్రారంభించిన సంగతి అందరికీ తెలిసిందే . చాతుర్వర్ణం పేరు మీద మనిషికి మనిషి మధ్యలో కుల ఆచారాల పేరుమీద నిచ్చెన మెట్ల వ్యవస్థను సృష్టించి అణగారిన వర్గాలను సృష్టించి ఆచారాలను కొనసాగిస్తున్నారు . దానిపైన అనేక విభేదాలు ఉన్నాయి . మరోవైపు మన ప్రధానంగా చెప్పుకునేది జైనం మతం దాన్ని కూడా ఉత్తర దక్షిణ భారత దేశంలో ప్రధానంగా ఆచరిస్తూ వస్తున్నారు అందులో లోపాలను కూడా చర్చించి తర్కి కిస్తున్నారు . మరో ప్రధాన ఆచారం బౌద్ధం భారతదేశంలో పుట్టి నేడు ప్రపంచవ్యాప్తంగా కీర్తించబడి ఎక్కువ దేశాలు ఆచరిస్తున్న మతంగా చర్చల్లో ఉంది . దీనికి సంబంధించి అనేక శాసనాలు అనేక బోధన విశ్వవిద్యాలయాలు చరిత్రలో మనకున్నాయి . పరాయి పాలకులు భారతదేశానికి రాకముందు ఈ మూడింటి పైన చర్చ జరిగేది . ప్రధానంగా బౌద్ధం గురించి ఆచరించేవారు అధికంగా ఉన్నాయి భారతదేశంలో ని భూమి శిథిలాల కింద అనేక బౌద్ధ ఆరామాలు ఉన్నాయి . ఇందులో కూడా మహాయాన , ఈన యానా లు గా విడిపోయినాయి .




ఇదే తరుణంలో ఆదిశంకరాచార్యుడు భక్తి ఉద్యమం పేరు మీద , శివ భక్తులను, శైవ భక్తులను కలుపుతూ హిందువులకు ఏకం చేశారు ఇది చారిత్రక సత్యం. మరోవైపు అణగారిన ప్రజలను ఆకర్షించడం కోసం బ్రహ్మ సమాజం , ఆర్య సమాజ్ లాంటి హిందూ మత అనుబంధ సంస్థలు వచ్చాయి . అయితే వీటికి ఎక్కడ కూడా జ్ఞానం బోధించే విధంగా విశ్వవిద్యాలయాలు లేవు. 19 వ సెంచరీలో ఇందుకు సంబంధించిన కొన్ని విశ్వవిద్యాలయాలు వచ్చాయి . మతం మానవాళికి మనుగడకు ముందుకు సాగే విధంగా ఉండాలని మతం మనిషి అభివృద్ధి నిరోధక శక్తిగా అడుగడుగున ఆచారాలు వ్యవహారాలు ఎవరికి నచ్చిన మార్గంలో వాళ్ళ అడ్డుకట్ట వేయరాదని అన్ని మతాచారాలు చెప్తున్నాయి . భారతదేశంలోని అణగారిన ప్రజలు వేదాలు చదివినా విన్నా చెవులలో సీసం పోసి చదువుకు వేదాలకు వారిని దూరం చేశారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి . నాటి నుండి నేటి వరకు సమాజంలో గుడి, దేవుడు , మతం, చుట్టూ తిరుగుతుంది.

చరిత్ర పరంగా ఎంత సత్యాన్ని, నిజాన్ని చెప్పిన కాలానుగుణంగా మారే ప్రకృతి ధర్మం చెప్పే తీర్పే అంతిమ నిర్ణయం. మన ఉద్దేశ్యం చరిత్రని,ఈ దేశ మూల జ్ఞాన సంపద,ఈ దేశం కోల్పోయిన ఆత్మ స్వధర్మం బుద్ధుడు బౌద్ధాన్ని గురించి తెలుసుకునే ప్రయత్నంలో భాగమే

మాది బౌద్ధం కంటే గొప్ప ధర్మం అనే బ్రాహ్మణిజం చరిత్రకు,వారి మాటలకు,వారి బ్రాహ్మణ మతానికి సంబంధించిన బౌద్ధం కంటే ముందు ఉన్న బ్రాహ్మణ మతం విశ్వవిద్యాలయాలు ఎన్ని !? ఉంటే ఏ భాషలో చదువు చెప్పారు !? ఏ వ్యక్తి ఆ విశ్వవిద్యాలయాలను నిర్మించారు !? ఏ ప్రదేశంలో నెలకొల్పారు అనే అంశాలు ఎక్కడ చరిత్ర ఆధారాలు లేవు.ఈ దేశ మూలనివాసులు పరాయి ఎడారి మతస్థుల చేతిలో కీలు బొమ్మలు కాకుండా మనకంటూ పక్క 84 వేల శాసనాలు,84 వేల గ్రంథాలు,84 వేల స్థూపాలు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.శత్రువు ఎవడో తెలిసిన జ్ఞాన యుద్ధం చెయ్యకుండా ఉండటం వల్ల ఎన్నో తరాలు ఎన్నో బాధలకు,అవమానాలకు, అవకాశాలకు,రాజ్యాధికార కాంక్షకు దూరం అవుతున్నాం.

అబద్ధాన్ని,కల్పితాలను గుడ్డిగా,తర్కం లేకుండా,శాస్త్రీయ దృక్పథం లేకుండా నమ్ముతూ,ఈ దేశంలోకి ఇస్లాం, క్రైస్తవం రాకముందు ఏం జరిగిందో చరిత్ర తెలియకుండా మాటల,రాతల,భౌతిక దాడులకు దిగడం మూర?త్వం అవుతుంది. ఈ సందర్భంగా

భారతదేశంలోని కొన్ని బౌద్ధ పురాతన విశ్వవిద్యాలయాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం మనకు ఉన్నది .

- తక్షశిల విశ్వవిద్యాలయం 6వ శతాబ్దం ఆధునిక పాకిస్తాన్‌లో ఉంది, కానీ చారిత్రకంగా ప్రాచీన భారతదేశంలో భాగం.
- నలంద విశ్వవిద్యాలయం 5వ శతాబ్దం భారతదేశంలోని బీహార్‌లో ఉంది.
- వల్లభి విశ్వవిద్యాలయం 5 వ శతాబ్దం భారతదేశంలోని గుజరాత్‌లో ఉంది.
- విక్రమశిల విశ్వవిద్యాలయం 8వ శతాబ్దం భారతదేశంలోని బీహార్‌లో ఉంది.
- జగద్దాల విశ్వవిద్యాలయం 11వ శతాబ్దం భారతదేశంలోని పశ్చిమ బెంగాల్‌లో ఉంది.
- ఒడంతపురి విశ్వవిద్యాలయం 11వ శతాబ్దం భారతదేశంలోని బీహార్‌లో ఉంది.

?సోమపుర విశ్వవిద్యాలయం 11వ శతాబ్దం భారతదేశంలోని బీహార్‌లో ఉంది.

- పుష్పగిరి విశ్వవిద్యాలయం 11వ శతాబ్దం భారతదేశంలోని ఒడిషాలో ఉంది.
- రత్నగిరి విశ్వవిద్యాలయం 12వ శతాబ్దం భారతదేశంలోని ఒడిషాలో ఉంది.ఇవి బౌద్ధ యూనివర్సిటీ లు.ఇంకా ఉన్నాయి.

ఈ పురాతన విశ్వవిద్యాలయాలు నేర్చుకునే కేంద్రాలు, ప్రపంచం నలుమూలల నుండి విద్యార్థులను పండితులను ఆకర్షించాయి తత్వశాస్త్రం, సైన్స్, కళ, గణితం సాహిత్యంతో సహా వివిధ రంగాల అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషించాయి.

కాని వైదిక సనాథుల సంస్కృత విశ్వవిద్యాలయాలు ఇక్కడ

- గురుకుల్ కాంగ్రీ: స్వామి శ్రద్ధానంద్ 1902 సి ఇ లో స్థాపించారు, ఇది హిందూ విశ్వవిద్యాలయం, కానీ పురాతనమైనది కాదు.
- కంచి: కంచి పీఠం హిందూ సంస్థ, కానీ అది విశ్వవిద్యాలయం కాదు. దీనిని 8వ శతాబ్దం సి ఇ లో ఆదిశంకరాచార్య స్థాపించారు.
- వారణాసి: బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం అని కూడా పిలువబడే వారణాసి విశ్వవిద్యాలయం 1916 లో పండిట్ మదన్ మోహన్ మాలవీయచే స్థాపించబడింది. ఇది హిందూ విశ్వవిద్యాలయం, కానీ పురాతనమైనది కాదు.

-మిథిలా: బీహార్‌లోని మిథిలా విశ్వవిద్యాలయం 1972 లో స్థాపించబడింది ఇది పురాతన విశ్వవిద్యాలయాలు కాదు. పురాతన విశ్వవిద్యాలయాలు వివిధ పాలకులు బౌద్ధ సన్యాసులచే స్థాపించబడ్డాయి

అవి.. -నలంద: గుప్త చక్రవర్తి- %×% కుమారగుప్తుడు స్థాపించాడు

-విక్రమశిల: పాల చక్రవర్తి ధర్మపాలచే స్థాపించబడింది

?తక్షశిల: మౌర్య చక్రవర్తి చంద్రగుప్త మౌర్యచే స్థాపించబడింది ఉన్నాయి.

నేటి ఆధునిక ప్రపంచంలో ఇంకా ఇంకా మతం కులాల అంతరాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి . అభివృద్ధి చెందే దేశాలకు ఇవి గొడ్డలి పెట్టు లాంటివి. మానవ మనుగడకు సాంకేతిక విజ్ఞానానికి అనేక పరిశోధనలకు నేటితరం ముందుకు రావడానికి సహకరించవలసిన బాధ్యత మనందరి పైన ఉంది. ఇంకా కులం మతం ఆధారంగా ప్రజలను రెచ్చగొడితే అభివృద్ధి నిరోధకులుగా మారిపోయే ప్రమాదం ఉంది . ( కొంత సమాచారాన్ని సోషల్ మీడియా ఆధారంగా సేకరించాను )

**-అన శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**9440037196**

# విప్లవ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కొల్లా వెంకయ్య



అమరులు
కా॥ కొల్లా వెంకయ్య

విప్లవ రైతాంగ సాయుధ పోరాట యోధుడు,సమ సమాజ స్వాప్నికుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొల్లా వెంకయ్య

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొల్లా వెంకయ్య సెప్టెంబర్ 17వ తేదీకి చనిపోయి 26 సంవత్సరాలు పూర్తికావస్తున్నది. ఒక మానవుణ్ణి మరొక మానవుడు దోచుకోవటానికి వీలు లేని న్యాయ సమ్మతమైన సాంఘిక ఆర్థిక, రాజకీయ ,వ్యవస్థ కోసం ఉరికంబాన్ని ముద్దాడిని ఎందరో భారతమాత బిడ్డలు తమ ప్రాణాన్ని సైతం తృణపాయంగా అర్పించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఈదేశం నుంచి తరిమి కొట్టటానికి జాతిపిత మహాత్మా గాంధీ నాయకత్వంలో జాతీయ ఉద్యమం నడిచింది . జాతీయ కాంగ్రెస్కు బ్రిటిష్ వారు అధికారాన్ని బదలాయించి వెళ్లారు. మనకు ఎన్ని రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, జాతిపిత మహాత్మా గాంధీ పట్ల ఎన్ని పరిమితులు ఉన్నప్పటికీ ఆయన ప్రభావం స్వదేశీ ఉద్యమంలో కానీ, ఉప్పు సత్యాగ్రహంలో కానీ, క్విట్ ఇండియా ఉద్యమంలో కానీ, అంటరానితనానికి వ్యతిరేకంగా గాంధీ ప్రభావం భారతదేశంలో ఎంతైనా ఉన్నది. గాంధీ ప్రభావంతో జాతీయోద్యమంలో ప్రవేశించి అనేకమంది కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ గానూ, ఆ తదనంతరం కమ్యూనిస్టు గానూ మారారు. యావజ్జీవిత పర్యంతం సమ సమాజం కోసం పోరాడారు. అటువంటి వారిలో కామ్రేడ్ కొల్లా వెంకయ్య ఒకరు. మహాత్మా గాంధీ హిందూ ముస్లిం సమైక్యతను కాపాడుట కొరకు ఆయన తన ప్రాణాన్ని ఆర్ఎస్ఎస్ మూకల చేతుల్లో బలి పెట్టారు. హిందూ ముస్లిం సమైక్యతను సెక్యులర్ భారతదేశాన్ని గాంధీ గారు కోరుకున్నారు. కానీ గాంధీ హంతకుల వారసులు నేడు ఈ దేశాన్ని పరిపాలిస్తున్నారు. గాడ్సే గొప్ప దేశభక్తుడని చెప్పేటువంటి నీచ సంస్కృతి నేడు తయారైంది. మూడవసారి ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోడీ హిందూ ఫాసిజాన్ని రెచ్చగొడుతూ , అంబానీ ఆధానీ లాంటి ఆశ్రిత పెట్టుబడిదారులకు జాతి సంపదను అప్పచెప్పుతున్నారు. కానీ సమ సమాజ నిర్మాణం కోసం యావజ్జీవితం సమ సమాజ నిర్మాణం కోసం పోరాడుతూ అమరులైన కామ్రేడ్ కొల్లా వెంకయ్య 26 వర్ధంతి సెప్టెంబర్ 17వ తేదీన జరుగుతున్నది.

బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో పన్నుల నిరాకరణోద్యమానికి కేంద్రమైన పెదనందిపాడు లో 1910 వ సంవత్సరంలో ధనిక భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. కొల్లా కృష్ణయ్య రత్నమ్మ దంపతులకు ఆరుగురు సంతానంలో కొల్లా వెంకయ్య పెద్ద కుమారుడు. 19 21 -22లో ఆంధ్ర శివాజీ పర్వతనేని వీరయ్య నాయకత్వంలో జరిగిన పన్నుల నిరాకరణోద్యమ ప్రభావంతో జాతీయోద్యమంలోకి ఆకర్షించబడ్డానని వెంకయ్యగారు చెప్పారు. 12 సంవత్సరాల వయస్సులో వెంకయ్య గారి పెదనాన్న కొడుకు గోవిందు, ఆయన కుమారుడు పాపయ్య శాంతి సేనలో చేరారు. పెదనందిపాడు గ్రామంలో ఆజానుబాహుడు దాసరి సుబ్బయ్య శెట్టి, లావు వెంకటసుబ్బయ్యలు శాంతి సేనకు ముందు నిలిచేవారు. శాంతి సేన సభ్యులందరూ తలకు గాంధీ టోపీ, భుజాన సంచి, కాంగ్రెస్ జెండా ధరించేవారు. 1921లో శాంతి సేన ఆధ్వర్యంలో పుసులూరులో పెదనందిపాడు పరిసర ప్రాంత గ్రామ అధికారులు సభ జరిపి తమ పదవులకు రాజీనామా చేశారు. పెదనందిపాడు గ్రామకరణం సరికా సీతారామయ్య రాజీనామా చేయగా గ్రామస్తులు ఆయనను పల్లకీలో ఊరేగించారు. ఆ సభకు 10-11 సంవత్సరాల వయస్సు ఉన్న వెంకయ్య వెళ్లారు. పెదనందిపాడు ఫిర్కా రెవిన్యూ ఇన్స్పెక్టర్ ను గ్రామస్తులు సాంఘిక బహిష్కరణ చేశారు . ఈ ఉద్యమ సమయంలో రైతులే మాల మాదిగలను ప్రోత్సహించి చెరువులో నీరు ముంచుకునేటట్లు చేశారు. అప్పటినుండి ఈ ప్రాంతంలో మార్పు కొనసాగింది. గ్రామ చివర లో ఉన్న ఒక సారా దుకాణాన్ని మూయించారు. వారు మహాత్మా గాంధీ ప్రబోధించిన అంటరానితనానికి, మద్యపానానికి వ్యతిరేకంగా హిందూ- ముస్లిం ఐక్యత కొరకు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. జాతీయోద్యమంలో ప్రముఖ కాంగ్రెస్ వాది..లావు అంకమ్మ గారితో పెరిగిన పరిచయం వలన 1928 లో గ్రామంలోనికి మహాత్మా గాంధీ పెదనందిపాడువచ్చినప్పుడు ఆ సభ నిర్వహణలో వెంకయ్య గారు ప్రముఖ పాత్ర నిర్వహించారు. 19 29 డిసెంబర్ లో తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో ప్రముఖ కాంగ్రెస్ వాది బ్రహ్మ జోష్యుల సుబ్రహ్మణ్యం గారు, ఖాది బాండారు అధినేత శేషగిరి రావు గారు ప్రత్యక్ష బాధ్యత వహిస్తున్న హిందుస్థాన్ సేవాదళం తరపున వాలంటరీ శిబిరంలో వాలంటరీగా చేరారు. వాలంటరీ శిబిరాన్ని మధ్యలోనే ప్రభుత్వం నిషేధించింది. 1930-1931 సంవత్సరాల్లో ఉప్పు సత్యాగ్రహం విషయమే గ్రామ గ్రామాన ప్రచారం చేశారు. 1931 వ సంవత్సరం క్రిస్టమస్ నాడు గ్రామ గ్రామాన తిరిగి అంటరానితనానికి వ్యతిరేకంగా బాపట్ల తాలూకా, వివిధ గ్రామాల్లో ప్రచారం గావించారు.1933 మహాత్మా గాంధీ కావూరు వినాయాశ్రమమునకు వచ్చినప్పుడు తుమ్మల సీతారామమూర్తి గారితో కలిసి వెళ్లి ఆ సభలో పాల్గొన్నారు.1934 అక్టోబర్లో బొంబాయి లో జరిగినటువంటి కాంగ్రెస్ మహాసభకు వెళ్లారు.19 43వ సంవత్సరంలో జాతీయోద్యమ విషయమై పోస్టర్ల వేస్తున్నందుకు వెంకయ్య గారిని గుంటూరులో అరెస్టు చేసి మొట్టమొదటి సారిగా అరెస్టు చేశారు.

1934వ సంవత్సరంలో కాంగ్రెస్ అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్, 1935 లో పండిట్ జవహర్లాల్ నెహ్రూ, గుంటూరు వచ్చినప్పుడు గుంటూరు గాంధీ పార్కులో గొప్ప బహిరంగ సభలు జరిగాయి. ఆ సభలో కొల్లా వెంకయ్య గారు పాల్గొన్నారు. 1934వ సంవత్సరంలో గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో కొల్లా వెంకయ్య గారు ఇంటర్మీడియట్లో చేరారు. అక్కడ పులుపుల వెంకట శివయ్య, నందూరి ప్రసాదరావు, పోలే పెద్ది నరసింహమూర్తి, మాకినేని బసవపున్నయ్య తదితరుల సహచర్యంతో కమ్యూనిస్టుగా మారారు. సామ్రాజ్యవాదం వ్యతిరేక దృక్పథంతో జాతీయ వాది - అంతర్జాతీయ వాదిగా మారారు. ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో డీటెన్ష్ కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. 1936వ సంవత్సరంలో కోటి రామ్మూర్తి మొదలగు వారితో కలిసి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. అదే సంవత్సరం నరసాయపాలెం వాస్తవ్యులు వీరమ్మ గారితో వివాహం జరిగింది. 1937 మేలో కొత్తపట్నంలోజరిగిన కమ్యూనిస్టు రాజకీయ పాఠశాల కు హాజరయ్యారు. ఆ రాజకీయ పాఠశాలకు అఖిల భారత రైతు సంఘం నాయకుడు,ఇందులాల్ యాగ్నిక్ గారు కూడా వచ్చారు. రాష్ట్ర అపద్ధర్మ ప్రభుత్వం ఆ రాజకీయ పాఠశాలను రద్దుచేసింది. పాఠశాలలో పాల్గొన్న విద్యార్థులపై తీవ్రమైనటువంటి లాఠీచార్జి జరిపింది. 1937 వ సంవత్సరంలో బాపట్ల తాలూకా ఆర్గనైజర్ పెండ్యాల లోకనాథం గారితో కలిసి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘానికి రూపం ఇవ్వాలని నిర్ణయించబడింది. 1938వ సంవత్సరములో కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావు గారు నాయకత్వం ఇచ్చాపురం నుండి మద్రాసు వరకు రైతు పాదయాత్ర సాగించారు. ఆ రైతు యాత్రలో పచ్చలతాడిపర్రు నుండి ఒంగోలు దాకా ఆయన పాల్గొన్నారు. ఆ రైతు యాత్ర గురించి ఈ ప్రాంతమంతా గ్రామ గ్రామాన ప్రచారం చేశారు. గుంటూరు జిల్లా అప్పాపురం ప్రాజెక్టు రైతు సమస్యలపై పని చేశారు.1939 లో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకయ్య గారు విజయవాడలో ఇరిగేషన్ సూపరింటెంట్ ఇంజనీర్ తో చర్చించిన మూలమున 1940లో మద్రాసు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శొంఠి రామ్మూర్తి గారు ఈ విషయాన్ని పరిశీలించుటకు బాపట్ల వచ్చారు. 1940లో పల్లె కోనలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్లీనంలో మాకినేని బసవ పున్నయ్య కార్యదర్శిగా, కొల్లా వెంకయ్య జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికైనారు. 1946 వ సంవత్సరంలోరాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. వర్జీనియా పంట పొగాకు రైతులను బ్రిటిష్ వ్యాపారస్తులు, ఐటీసీ కంపెనీ వారు తీవ్రంగా వేధిస్తూ ఉండేవారు. ఆ రోజుల్లో పొగాకు రైతాంగాన్ని కూడగట్టారు.1944 నుండి48 వరకు గుంటూరు జిల్లా పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య మార్కెట్ యార్డ్ చైర్మన్ గా రైతులచే ఎన్నుకోబడి బాధ్యతలు నిర్వహించారు.

1948 నుండి 51 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మైదాన ప్రాంతం నుంచి ఆ ఉద్యమానికి సహాయ సహకారాలు అందించుటకు ఏర్పడిన కమిటీకి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లాలో కామ్రేడ్స్ చివుకుల శేషశాస్త్రి, దండా నారాయణస్వామి కొనికి లక్ష్మీనారాయణ మొదలగు రైతు నాయకులను కాల్చి చంపుతున్న రోజులవి. ఆ కాలమంతా అజ్ఞాత జీవితం గడిపారు. అప్పటికే కొల్లా వెంకయ్య గారు జిల్లాలో గుర్తింపు పొందిన నాయకుడు. రహస్య జీవితమంతా చాలా గడ్డుగా నడిచింది. రాత్రిపూట రైతుల కొష్టాల్లోనూ, పగలు పొలాల్లోనూ గడిపారు. ఆ రోజుల్లో కమ్యూనిస్టులకు రక్షణ ఇవ్వటం ప్రాణకంతకంగా ఉండేది. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కొరకు కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారు గ్రామ గ్రామాన కాలినడకన నడిచి ఉద్యమాన్ని నిర్మించారు.

కమ్యూనిస్టు పార్టీలో రాష్ట్ర నాయకుడుగా వివిధ హోదాలలో పనిచేశారు. సిపిఐ నుండి సిపిఐ(ఎం) వైపు వచ్చారు . భారత కమ్యూనిస్టు పార్టీ మూడవ, నాలుగవ జాతీయ కాంగ్రెస్ లలో ఆయన కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా ఎన్నికకాబడ్డారు. సిపిఐ(ఎం) నుండి తరిమెల నాగిరెడ్డి , చంద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావులతో కలిసి సిపిఐ( ఎం) కి వ్యతిరేకంగా పాలకొల్లు లోనూ, భరద్వాన్ లోనూ సిద్ధాంత పోరాటం నిర్వహించారు. కొంతకాలం చారు ముజుందారు నాయకత్వంలోని సిపిఐ( ఎం.ఎల్) లో కొనసాగారు. పార్వతీపురం కుట్ర కేసులో ఇరికించబడ్డ ఆయన ఏడు సంవత్సరాలకు పైగా జైలు జీవితం అనుభవించారు. నక్సల్ బరి, శ్రీకాకుళ పోరాటాలు గాడి తప్పాయని చైనా వారు సలహాలు ఇచ్చారు. దళ చర్యల ద్వారా సాగించే అది వ్యక్తిగత సంహారమని జైలు నుండి కొల్లా వెంకయ్య , కాను సన్యాలు,చౌదరి తేజేశ్వరరావు భువనమోహన్ పట్నాయక్ ,నాగభూషణ పట్నాయక్, సౌరన్ బోస్ తదితరులు చారు ముజుందారుకు లేఖ ద్వారా తెలియజేశారు. ఆరుగురు లేఖగా అది చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందినది. మార్క్సిజం లెనినిజం మావో ఆలోచన విధానం మా మౌలిక సిద్ధాంతం అని ఆయన పార్వతీపురం కుట్ర కేసులో వాదించారు. జిల్లా కోర్టు ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష వేయగా హైకోర్టు కొట్టి వేసింది.

1952 లో జరిగినటువంటి శాసనసభ ఎన్నికల్లో పొన్నూరు నుండి ఎన్నికయ్యారు. 1957 శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. 1962వ సంవత్సరం తెనాలి పార్లమెంట్ నియోజకవర్గ నుండి లోక్ సభకు ఎన్నికయ్యారు.1962వ సంవత్సరంలో భారత చైనా సరిహద్దు ఘర్షణ సమయంలో జైలునిర్బంధానికి గురయ్యారు. 1975లో అత్యవసర పరిస్థితి కాలంలో జైల్లో నిర్బంధించబడ్డారు. ఆయన అనేక సిద్ధాంత రచనలు చేశారు. సంస్కృతం ,హిందీ ,ఇంగ్లీషు తెలుగు భాషల్లో ఆయనకు విశేషమైనటువంటి పరిచయం ఉన్నది.ఆయన నిరంతరం మార్క్సిస్టు అధ్యయనశీలి. కుల సమస్య పట్ల ఆయనకు స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నవి. కుల సమస్య వర్గ సమస్యతో ముడిపడి ఉన్నది అనేది ఆయన నిశ్చితాభిప్రాయం. 1955లో అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన ఒక "కీ" నోటు కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలోపెట్టారు.1977లో జైలు నుండి విడుదలైన తరువాత, నల్లమడ ముంపు నివారణ కొరకు గొప్ప ఉద్యమం నిర్మించారు. 1973 భూగరిష్ట పరిమితి చట్టం అమలు కోసం గుంటూరు ప్రకాశం జిల్లాలో 1980 లో గ్రామీణ పేదల సంఘాన్ని స్థాపించి భూ సంస్కరణల కోసం పోరాడారు. గ్రామీణ పేదలను భూములు పై నిలబెట్టి వేలాది ఎకరాలు సాధించేటట్లుగా చేశారు. 1986లో భూ సంస్కరణల చట్టం అమలు కోసం సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. 1991లోతీర్పు సాధించగా దాని అమలు కోసం జీవిత పర్యంతం పోరాడారు. ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ రెండు విషయాల్లో తప్పు చేసిందనేది ఆయన నిశ్చితాభిప్రాయం. ఒకటి ఎన్నికల్లో భూస్వామ్య పార్టీలతో పొత్తు కట్టటం, రెండు సాయుధపోరాటం కొరకు పంథాను రూపొందించడం విషయంలో, పంథాను అమలుపరచటంలోనూ!. భారతదేశం అర్ధ వలస, భూస్వామ్య దేశం అని పార్లమెంటరీ పంథాను ఆయన తిరస్కరించాడు.ఈ దేశంలో సోషలిజం స్థాపన జరగాలంటే కమ్యూనిస్టు ఉద్యమం సూత్రబద్ధంగా ఐక్యం కావాలని అందు కొరకు ఆయన సుదీర్ఘ కృషి చేశారు. కడదాకా పేదరిక నిర్మూలన కోసం, సమ సమాజం కోసం , ఎన్నో ఆటుపోట్లను, నిర్బంధాలను తట్టుకొని దోపిడీ రహిత సమాజం కోసం పోరాడిన కొల్లా వెంకయ్య నేటి తరానికి ఆదర్శం.

*-కొల్లిపర వెంకటేశ్వరరావులి కేంద్ర కమిటీ సభ్యుడు*
*-సిపిఐ (ఎమ్.ఎల్ )రెడ్‌స్టార్, 939232 5652 vkol-lipara75 @ gmail.com*
*12-09-2024*

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 | హైదరాబాద్
శుక్రవారం
13। సెప్టెంబర్। 2024






## సరైన నిద్ర లేకపోతే, నిద్రమాత్రల జోలికిపోకుండా ఇలా చేయండి..!

ప్రశాంతమైన నిద్ర రోజును ఉత్సాహంగా మారుస్తుంది. రాత్రి నిద్రపోవడం కష్టంగా మారడం, తరచుగా నిద్ర నుంచి మేల్కొవడం నిద్రపోవడాన్ని కష్టంగా మారుస్తుంది. నిద్ర గురించి నిద్రమాత్రలు వాడుతుంటారు. నిద్ర సరిగా పట్టకపోవడం అనేది చిన్న సమస్య కాదు. బలవంతంగా నిద్రపోవడం మరిన్ని ఆరోగ్య సమస్యలను తెస్తుంది. ఒక్కరోజు సరిగా నిద్రలేకపోతే రోజంతా డల్‌గా అనిపిస్తుంది. నిద్రలేమి సమస్య వరుసగా ఉన్నట్లయితే మందులు కాకుండా వేరే మార్గాలను తెలుసుకుందాం.నిద్రలేమికి కారణమయ్యే కారణాలు దాని రకాలను బట్టి మారుతూ ఉంటుంది.తాత్కాలిక నిద్రలేమి.. ఒక నెల కంటే తక్కువ ఉంటుంది.తీవ్రమైన నిద్రలేమి.. ఒకటి నుంచి ఆరు నెలల మధ్య ఉంటుంది.

దీర్ఘకాలిక నిద్రలేమి.. ఆరునెలల కంటే ఎక్కువ ఉంటుంది.నిద్రలేమికి కారణాలు ఏమిటి?

1. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. నిద్రలేమికి కారణం అవుతాయి.
2. సరైన నిద్ర కోసం షెడ్యూల్ వేసుకోవాలి. ఆలస్యంగా నిద్రపోవడం, దిన చర్య సరిగా ఉండకపోవడం, పగటి పూట అతిగా నిద్రపోవడం నిద్ర చక్రానికి భంగం కలిగిస్తాయి.
3. దీర్ఘకాలిక నొప్పి, ఆస్తమా, కీళ్లనొప్పులు, అలర్జీలు, జీర్ణకోశ సమస్యలు, నరాల సంబంధిత రుగ్మతలు, హార్మోన్ల అసమతుల్యత వంటివి నిద్రకు అంతరాయం కలిగిస్తాయి.
4. అలర్జీలు, ఉబ్బసం, అధిక రక్తపోటు, నిరాశ, వంటి పరిస్థితులు, కొన్ని ప్రిస్క్రిప్షన్ మందులు నిద్రకు భంగం కలిగిస్తాయి.

# ఆమెకు పుస్తకాలే పిల్లలు

***ప్రొఫెసర్‌గా తరగతి గదిలో పాఠాలే కాదు...***
***చక్కని రచనలతో గ్రంథకర్తగానూ పేరు గడిచారు.***
***పుస్తకాలే తన పిల్లలుగా... సాహిత్యమే తన లోకంగా జీవిస్తున్న డాక్టర్ కవితా భట్ కథ ఇది.***





"జీవితం ఎప్పుడూ మనం అనుకున్నట్టు సాగదు. ఎత్తుపల్లాలు... ఆటుపోట్లు... అన్నిటినీ తట్టుకొని ముందుకు సాగితేనే అనుకున్నది సాధించగలం. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. ఉత్తరాఖండ్ తెహ్రీ గఢవాల్ జిల్లాలోని బౌన్సారా గ్రామం మాది. మా నాన్న బంకేలాల్ రతూరీ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేసేవారు. ఆయన జీతంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉండేది. ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ పరిస్థితులూ అంతంతమాత్రమే. సంతానంలో నేనే పెద్ద. మా కోసం నాన్న పడుతున్న ఆవేదన, ఆందోళన నాకు అర్థమయ్యేది. నేనూ ఆయన కష్టాన్ని పంచుకోగలిగితే బాగుండని చిన్నప్పుడు ఎన్నో సందర్భాల్లో అనుకునేదాన్ని. వీటి నుంచి గట్టెక్కాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించాను. బీఎస్సీ పూర్తయిన తరువాత ఫిలాసఫీ, యోగా, ఇంగ్లీష్, సోషల్‌వర్క్ సబ్జెక్టుల్లో మొత్తం నాలుగు మాస్టర్స్ డిగ్రీలు సాధించాను. లక్ష్యం వైపు పయనించాలంటే బలమైన పునాదులు ఉండాలి కదా. అందుకే ఇవన్నీ చదివాను. అంతేకాదు... సామాజిక అంశాలపై మరింత లోతైన అవగాహన కోసం ఉమెన్ ఎంపవర్‌మెంట్ తదితర డిప్లమో కోర్సులతోపాటు పీహెచ్‌డీ కూడా చేశాను.

**కఠిన పరీక్షలకు నిలిచి...**

ఫిలాసఫీ, యోగా సబ్జెక్టుల్లో యూజీసీ-నెట్ పరీక్ష రాస్తే, అందులో అర్హత సాధించాను. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసఫికల్ రీసెర్చ్' నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, జనరల్ రీసెర్చ్ ఫెలోషిప్. దాంతోపాటు యూజీసీ నుంచి పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ అందుకున్నాను. మా కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో... వేరొకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగిన ఒక మహిళగా నాలాంటివారికి ఆదర్శంగా నిలవాలనుకున్నాను. అందుకే ఎన్ని కఠిన పరీక్షలు ఎదురైనా తట్టుకొని చదువు కొనసాగించాను. ఆత్మస్థైర్యంతో అడుగులు వేసి ఇక్కడి వరకు రాగలిగాను. ప్రస్తుతం ఉత్తరాఖండ్ 'హేమవతీ నందన్ బహుగుణ గఢవాల్ సెంట్రల్ యూనివర్సిటీ' ఫిలాసఫీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా.

**ఎన్నో రచనలు...**

ఒక పక్క విద్యా బోధన... మరోవైపు పుస్తక రచన చేస్తున్నా. సాహిత్య ప్రపంచంలో నాకంటూ కొన్ని పేజీలు ఉండాలనే తపన. ఇప్పటికి 27 పుస్తకాలు రాశాను. యోగిక్ స్టడీస్, సత్కర్మాస్, భారతీయ సాహిత్యం తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందులో ఉన్నాయి. అయితే నాకు బాగా పేరు తెచ్చిన రచనలు 'గీతా దర్శన్', 'భారతీయ సాహిత్య మే జీవన్ మూల్య'. వీటికి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి పురస్కారాలు, సత్కారాలు అందుకున్నాను. యూపీలోని 'పటేల్ ప్రతినిధి సభ' వారు 'శైల్‌పుత్రి' బిరుదుతో గౌరవించారు. 2019లో మధ్యప్రదేశ్ సాహిత్య అకాడమీ 'అఖిల్ భారతీయ ఆచార్య రామచంద్ర శుక్లా' పురస్కారంతో కలిపి ఇప్పటికి ముప్పైకి పైగా అవార్డులు అందుకున్నాను. ఇవి సాహిత్యం, సంస్కృతికి అందించిన సేవలకు నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

**అక్షరంపై ప్రేమతో...**

కొన్ని కారణాల వల్ల నేను తల్లిని కాలేకపోయాను. మాతృత్వపు మాధుర్యానికి నోచుకోనందుకు కొన్నాళ్లు బాధపడ్డాను. కానీ త్వరగానే దాని నుంచి కోలుకున్నాను. సాహిత్య లోకంలో విహరించడం ప్రారంభించాను. ఇప్పుడు నాకు పిల్లలు లేరన్న బాధ లేదు. ఎందుకంటే నా పుస్తకాలే నా పిల్లలు. నవ మాసాలు మోసి, బిడ్డను ప్రసవించడానికి ఎంత వేదన పడుతుందో... ఒక అంశాన్ని ఎంచుకొని, దానికి అక్షర రూపం ఇచ్చి, పుస్తకంగా బయటకు తేవడానికి నేనూ అంతగా శ్రమిస్తాను. రచనలో మునిగిపోతాను. అంతే ప్రేమతో ప్రతి పుస్తకానికీ రూపం ఇస్తాను. ఎవరైనా నా రచనలను ప్రశంసిస్తే... అది నా బిడ్డకు దక్కిన అభినందన. ఒక తల్లిగా సంతోషిస్తాను.

**సమాజం కోసం...**

బోధన, సాహిత్యంలో ఎంతగా మునిగినా... ఈ సమాజంలో ఒక వ్యక్తిగా నావంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వారానికి రెండు రోజులు దీనికి కేటాయించాను. అలాగే అణగారిన వర్గాల పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నాను. మధ్యలో చదువు మానేసిన చిన్నారులను బడి బాట పట్టించేందుకు కృషి చేస్తున్నాను. ఎందుకంటే వారి జీవితాలను మార్చగలిగేది చదువు మాత్రమే. దానికి నన్నే ప్రత్యక్ష ఉదాహరణగా చూపిస్తూ, వారిలో స్ఫూర్తి నింపుతున్నాను."

# అఫ్ఘాన్ శరణార్థుల కోసం..!



"సరిగ్గా ఏడున్నరేళ్ల కిందట... నేను, నా భర్త బిశ్వదీప్ మొయిత్రా ఢిల్లీలోని అఫ్ఘానిస్థాన్ శరణార్థుల శిబిరానికి వెళ్లాం. అక్కడ మహిళల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది.

అఫ్ఘాన్ శరణార్థుల కోసం..!
స్వదేశం ఫ్రాన్స్. కళపై మక్కువతో
ఓ ప్రాజెక్ట్ పనిపై భారత్ వచ్చిన ఆమె...
ఆ తరువాత ఇక్కడే స్థిరపడ్డారు.
ఔత్సాహికులను కళాకారులుగా తీర్చిదిద్దడమే కాదు...
ఎంతోమంది అఫ్ఘానిస్థాన్ మహిళా శరణార్థులకు
ఉపాధి మార్గం చూపారు. భర్తతో కలిసి వారి
అభ్యున్నతికి బాటలు వేసిన ఐరిస్ స్ట్రిల్ జర్నీ ఇది.

"సరిగ్గా ఏడున్నరేళ్ల కిందట... నేను, నా భర్త బిశ్వదీప్ మొయిత్రా ఢిల్లీలోని అఫ్ఘానిస్థాన్ శరణార్థుల శిబిరానికి వెళ్లాం. అక్కడ మహిళల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. చేతిలో డబ్బు లేక, సంపాదన మార్గాలు దొరక్క అవస్థలు పడుతున్నారు. ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టడం, అమెరికా తన బలగాలను ఉపసంహరించుకోవడం తదనంతర పరిణామల నేపథ్యంలో అఫ్ఘాన్ మహిళలు భారత్‌కు వలస వచ్చారు. ఢిల్లీలో వారిని కలిసినప్పుడు తమ బాధలు చెప్పుకున్నారు. బతకడానికి వేరే దారి లేక స్వదేశం నుంచి వెంట తెచ్చుకున్న తమ వస్తువులన్నిటినీ అమ్ముకోవాల్సి వచ్చింది. ఏ పూటకాపూట కష్టం నెట్టుకొస్తున్నారు. వారి బాధలు విని మా గుండె బరువెక్కింది. దీనికి పరిష్కారం ఏమిటి? ఏదో తోచిన సాయం చేసి చేతులు దులుపుకొంటే సరిపోదు. ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే వారికి మనుగడ. అందుకు మేం ఏం చేయగలం? నేను, బిశ్వదీప్ తీవ్రంగా ఆలోచించాం.

**సాధికారత వైపు అడుగులు...**

అఫ్ఘాన్ శరణార్థ మహిళలకు శాశ్వత జీవనోపాధి కల్పించాలంటే... వారికి వృత్తి విద్యల్లో నైపుణ్యం కావాలి. అటు వైపు వారిని ప్రోత్సహించాం. తద్వారా ఆర్థిక సాధికారత సాధించవచ్చని చెప్పాం. తొలుత ఒకరిద్దరు మహిళలు మాత్రమే



మమ్మల్ని నమ్మి ముందుకు వచ్చారు. ఒక ఏడాది తరువాత మరికొంతమంది జత కలిశారు. వీరందరి అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని 2018లో నేను, మావారు కలిసి 'సిలైవాలీ' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ నెలకొల్పాం. దీని ద్వారా క్లాత్ బొమ్మలు, పౌచ్‌లు, పర్సులు, వాల్ ఆర్ట్స్, వాల్ హ్యాంగింగ్స్ తయారు చేసి, విక్రయిస్తాం. రెడీమేడ్ దుస్తుల తయారీ పరిశ్రమల్లో వ్యర్థంగా పడేసే వస్త్రాన్ని సేకరించి, వాటితో ఈ ఉత్పత్తులు రూపొందిస్తాం.

**పర్యావరణ పరిరక్షణ కూడా...**

ఒకరిద్దరితో మొదలైన మా సంస్థలో ఇప్పుడు డెబ్బై మంది అఫ్ఘాన్ మహిళలు ఉన్నారు. వారందరికీ బొమ్మలు, ఇతర వస్తువుల తయారీలో పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చాం. అనంతరం సంస్థ ద్వారా జీవనోపాధి కల్పించాం. ఇప్పుడు ఆ మహిళలందరూ తమ కాళ్లపై తాము నిలబడ్డారు. సంతోషంగా జీవనం సాగించగలుగుతున్నారు. నెలకు పన్నెండు వేల నుంచి పధ్నాలుగు వేల రూపాయల వరకు సంపాదిస్తున్నారు. డిమాండ్ అధికంగా ఉండే నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో మరింత ఆదాయం లభిస్తుంది. అంతేకాదు... ఇప్పటివరకు 15 వేల కేజీల ఫ్యాబ్రిక్ వేస్ట్ చెత్త కుప్పల్లో చేరి, భూమికి భారం కాకుండా చూడగలిగాం. తద్వారా పర్యావరణ పరిరక్షణకు కొంతవరకు దోహదపడగలిగాం.

**అలా భారత్‌కు వచ్చి...**

నాకు మొదటి నుంచి కళలంటే మక్కువ. అందుకే ఆర్ట్ అండ్ డిజైన్ డిప్లమాలో చేరాను. ఫైనల్ ఇయర్ అసైన్‌మెంట్‌లో భాగంగా 1990లో తొలిసారి భారత్‌కు వచ్చాను. ఈ దేశం నాకు ఎంతో నచ్చింది. కళపై ఉన్న ఇష్టంతో ఇక్కడి పలు స్వచ్ఛంద సంస్థలో కలిసి ఔత్సాహిక కళాకారులకు శిక్షణ ఇచ్చేదాన్ని. వారికి విభిన్న కళాకృతుల తయారీ నేర్పించేదాన్ని. అలా తరచూ భారత్‌కు వచ్చిపోతున్న నేను... 2006లో బిశ్వదీప్‌తో పెళ్లి తరువాత ఇక్కడే స్థిరపడిపోయాను. బిశ్వదీప్ ఒకప్పుడు పాత్రికేయుడు. ఒక యోగా కేంద్రంలో తనతో పరిచయం అయింది. పెళ్లి తరువాత అంతర్జాతీయ వస్త్ర బ్రాండ్లకు డిజైన్ కన్సల్టెంట్‌గా పని చేసేదాన్ని. ఆ క్రమంలోనే నా దృష్టి భారత ఫ్యాషన్ పరిశ్రమలో టన్నులకు టన్నులు పేరుకుపోతున్న ఫ్యాబ్రిక్ వేస్ట్‌పై పడింది.


**వ్యర్థంతో ఆకర్షణీయ ఉత్పత్తులు...**

ఎన్నో అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్లకు కేంద్రం ఢిల్లీ. ఇక్కడ రోజుకు వందల కిలోల వస్త్ర వ్యర్థాలు చెత్తకుప్పలను ముంచెత్తుతున్నాయి. ఈ వ్యర్థాన్ని పనికొచ్చే ఉత్పత్తులుగా మలిస్తే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. అలాగే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు అది ఒక ఉపాధి మార్గం అవుతుందని భావించాను. అందులో భాగంగానే అఫ్ఘాన్ మహిళలకు కళాకృతుల తయారీలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాను. దీనికి బిశ్వదీప్ కూడా మద్దతునిచ్చారు. పూర్తి సమయం కేటాయించాలనే ఉద్దేశంతో ఒక ప్రముఖ ఆంగ్ల వారపత్రికలో ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఉన్న ఆయన, తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఒక మంచి లక్ష్యం కోసం ఇద్దరం కలిసి పని చేయడం ప్రారంభించాం. అందులో భాగంగానే ఫ్యాబ్రిక్ వేస్ట్‌ను అప్‌సైక్లింగ్ చేసి, కళాకృతులు రూపొందించాలని నిర్ణయించాం. అది సత్ఫలితాలను ఇచ్చింది. దానివల్ల అఫ్ఘాన్ మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. వారి జీవితానికి ఒక భరోసా లభించింది.

**ప్రపంచవ్యాప్తంగా...**


మా సంస్థలో అఫ్ఘాన్ కళాకారులు రూపొందించిన బొమ్మలు, అల్లికలు, ఇంటి అలంకరణ వస్తువులు దేశవిదేశాల్లోని 150 నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. శరణార్థులు తయారు చేసే బొమ్మల్లో అద్భుతమైన సృజన మాత్రమే కాదు... వారి కథలు, వ్యక్తిత్వాలకు ప్రతిరూపాలుగా కనిపిస్తాయి. భారత్‌తో పాటు అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, కొరియా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ఈ బొమ్మలకు మంచి డిమాండ్ ఉంది. 'సిలైవాలీ' కళాకృతుల ధరలు రూ.280 నుంచి రూ.5,400 వకు ఉన్నాయి. ఏడాదికి రెండు లక్షల డాలర్ల ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నాం. ఇప్పటివరకు మొత్తం నాలుగువందల మంది అఫ్ఘాన్ శరణార్థ మహిళలకు శిక్షణ ఇచ్చాం. వలస విధానాల వల్ల వీరిలో చాలామంది కెనడాకు వెళ్లి స్థిరపడ్డారు. ఏదిఏమైనా నేను, మావారు తీసుకున్న నిర్ణయంవల్ల వారి బతుకుల్లో వెలుగులు నింపగలిగాం. దీనికి మించిన సంతృప్తి, సంతోషం మాకు మరెందులోనూ లభించదు."

## కనుబొమలకూ మర్దన!



కనుబొమలు తీరైన ఆకృతిలోకి రావాలంటే పార్లర్‌కు వెళ్లి థ్రెడింగ్ చేయించుకుంటాం. ఇంట్లో అప్పుడప్పుడూ ప్లక్కర్‌తో అవాంఛితంగా పెరిగిన వాటిని తీసేస్తాం. ఏది చేసినా కొద్దిగా నొప్పి, అక్కడి చర్మం ఎర్రగా కందిపోవడం వంటి సమస్యలు మామూలే. ఇలాంటివేవీ లేకుండా ఇప్పుడు కొత్త పద్ధతి అందుబాటులోకి వచ్చిందట. అదే ఐబ్రో పిన్చింగ్. అంటే కనుబొమలను నొక్కినట్లు చేయడం. లండన్, న్యూయార్క్‌లోని ఓ ప్రముఖ బ్యూటీపార్లర్ తన శాఖలన్నింట్లో దీన్ని ప్రవేశపెట్టడంతో ఇప్పుడు ఇది అంతర్జాలంలో హల్‌చల్ చేస్తోంది. కనుబొమలను సున్నితంగా నొక్కుతూ, వాటికి మర్దన చేస్తూనే అవి సరైన ఆకృతిలో వచ్చేలా చూస్తారు. దీనివల్ల ఆ భాగంలో రక్తప్రసరణా సజావుగా సాగుతుందట. ఇది బొటాక్స్ కంటే మెరుగైందని చెబుతున్నారు సౌందర్య నిపుణులు. కనుబొమలు షేప్ చేయించునేటప్పుడు వచ్చే వాపూ తగ్గుతుందని, ఆ భాగంలో గీతలు, ముడతలు లాంటివి పడవని అంటున్నారు. ఈ చికిత్స మూలాలు ఆయుర్వేదంలో ఉన్నాయని అంటున్నారు కొందరు వైద్యులు. ఆయుర్వేదం ప్రకారం శరీరంలో కొన్ని ప్రదేశాల్లో ఒత్తిడి పెంచడం ద్వారా మిగతా భాగాలకు సాంత్వన చేకూరుతుంది. ఇదీ అలాంటిదేనని అంటున్నారు. సాధారణంగా కంటి చుట్టూ ఉండే కణజాలం వదులవడం వల్ల ఆ ప్రాంతంలో వాపు కనిపిస్తుంది. మ ృదువుగా మర్దనా చేస్తే ఆ సమస్య అదుపులో ఉంటుంది. కళ్లూ ఆరోగ్యంగా ఉంటాయి. దీనికోసం నిపుణుల దగ్గరకే వెళ్లాలని లేదు. ఇంట్లోనూ ప్రయత్నించొచ్చు. ఎలాగంటే... చల్లటి ఐసు ముక్క లేదా వస్త్రాన్ని ఆ ప్రాంతంలో అద్దినట్లు చేసినా చాలు. షేపింగ్, ఫేషియల్స్ తరువాత దీన్ని చేయడం వల్ల హాయిగా అనిపిస్తుంది.

## గదులకు సరికొత్త నగిషీలు!




గదిలో ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవటానికి 'లాఫ్టెడ్ డిజైన్' ఒక చక్కని మార్గం. దీనివల్ల గదులు ఆధునికంగా కనిపించటమే కాదు.. ఇంట్లోని ఖాళీ ప్రదేశాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవటానికి, గదిలో ఆహ్లాదాన్ని స ృష్టించటానికి పలు మార్గాలను చూపుతుంది.

గదులకు విలాసవంతమైన డిజైనింగ్ చేయటంలో గోడలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఫ్యాబ్రిక్, త్రీడీ బోర్డ్, రకరకాల చిత్రాలతోనూ లేదా మెటల్, మార్బుల్ పలకలతోనూ గోడల ఉపరితలాన్ని కవర్ చేయటం ద్వారా విలాసవంతంగా కనిపిస్తాయి.గదిలో ఉండే స్థలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలంటే వివిధ రకాల ఆక ృతులు, ఫీచర్లతో ఉండే వస్తువులను ఉపయోగించుకోవాలి. దీనికి అలమరాలు చక్కగా ఉపయోగపడతాయి. వాడటం సులభం. శు భ్రంగా ఉంచితే గదికి కొత్త అందాల్ని అద్దుతాయి.

సాధారణంగా లైట్లు అనగానే కాంతికోసం అనే ద ృష్టితో చూస్తారు కానీ, గది వాతావరణానికి వీటితో లగ్జరీ లుక్ తీసుకురావొచ్చు. రకరకాల లైట్లను వాడటం ద్వారా గదిలో రకరకాల వేరియంట్స్‌ను స ృష్టించొచ్చు.గోడలకు ఎక్కువ సంఖ్యలో అద్దాలు అమర్చటం ద్వారా గది విశాలంగా కనిపిస్తుంది. గదిని బట్టి కూడా అద్దాలను ఏర్పాటు చేసుకోవచ్చు. చేంజింగ్ రూమ్ అయితే హ ృదయాకారం, నక్షత్రాల ఆకారంలో ఉండే అద్దాలను ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల ఆ గది అందం రెట్టింపు అవుతుంది.వాల్‌పేపర్లు గదిలో ఉండే స్థలానికి మంచి లుక్‌ను తెస్తాయి. మీకు బాగా ఇష్టమైన డిజైన్‌ను ఎంచుకోండి. గదిని చూడగానే కలిగే ఫీల్‌పై బ్యాగ్రౌండ్ కలర్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. బెడ్‌రూమ్ కోసం లేత తేలికపాటి రంగులు ఎంచుకోవటం వల్ల ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉంటుంది.ఉల్లాసపరిచే లగ్జరీ లుక్ కోసం గదుల్లో ఫర్నిచర్‌ను వాడొచ్చు. రోజువారీ ఫర్నిచర్‌తోనే గదిలో ప్రదేశానికి కొత్త రంగులు అద్దొచ్చు. సరైన విధానంలో చేయాలేగానీ బెడ్ లేదా దివాన్‌కు ఉండే దిండు, పరుపులతోనే విలాసవంతమైన లుక్‌ను తేవొచ్చు.

అవకాశాన్ని బట్టి కొన్ని ప్రయోగాలూ చేయవచ్చు. పోర్షన్‌లో కొంత భాగానికి ఎల్‌సీడీ రూఫ్ ప్యానెల్‌ను పైకప్పుగా వాడొచ్చు. ఇది చూడటానికి అందంగా ఉండటమే కాదు పగలు గదిలో చక్కగా వెలుతురు పరుచుకుంటుంది. రాత్రిళ్లు నక్షత్రాలు కనువిందు చేస్తాయి.

మీ వస్తువుల కోసం కొంచెం స్థలాన్ని ప్రత్యేకంగా అట్టిపెట్టుకోవాలి. అవసరమైతే




# ఎంజీ కొత్త కారు విండ్సర్



**న్యూఢిల్లీ- నవభూమి:** జేఎసడబ్ల్యూ ఎంజీ మోటార్.. 'విండ్సర్ ఈవీ' పేరుతో సరికొత్త ఎలక్ట్రిక్ కారును బుధవారం మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఇది హ్యాచ్‌బాక్, మల్టీ యుటిలిటీ వెహికల్ (ఎంయూవీ) ఫీచర్లతో కూడిన తొలి ఎలక్ట్రిక్ 'క్రాసోవర్ యుటిలిటీ వెహికల్' (ఈ-సీయూవీ) అని కంపెనీ తెలిపింది. మొత్తం మూడు వేరియంట్లలో (ఎక్సైట్, ఎక్స్‌క్లూజివ్, ఎస్సెన్స్) లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.9.99 లక్షలు. అయితే, ఇది బ్యాటరీ రహిత ధర. వాహన ఇండస్ట్రీలో తొలిసారిగా కంపెనీ ఈ కారు బ్యాటరీని అద్దెకు (బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్) ఇస్తోంది. ఈ బ్యాటరీ ప్యాక్‌కు కిలోమీటరుకు రూ.3.5 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఎంజీ యాప్ ఈ-హబ్ ద్వారా ఏడాదిపాటు పబ్లిక్ చార్జర్ల వద్ద ఉచితంగా చార్జింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తోంది. అంతేకాదు, కారు మొదటి యజమానికి జీవితకాలం బ్యాటరీ వారంటీని అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. మూడేళ్లు లేదా 45,000 కి.మీ తర్వాత 60 శాతం బైబ్యాక్ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. విండ్సర్ ప్రీ-బుకింగ్‌లు తక్షణమే ప్రారంభయ్యాయి. ఈనెల 25 నుంచి టెస్ట్ డ్రైవ్ కోసం ఈ వాహనాన్ని షోరూముల్లో అందుబాటులో ఉంచనున్నారు. వచ్చేనెల 3 నుంచి అధికారిక బుకింగ్ ప్రారంభం కానుంది. దసరా నుంచి డెలివరీని ప్రారంభించే అవకాశం ఉంది. 38 కిలోవాట్ లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఈ కారు పూర్తి చార్జింగ్‌తో 331 కి.మీ వరకు ప్రయాణించగలదని కంపెనీ వెల్లడించింది. ఏదైనా డీసీ ఫాస్ట్ చార్జర్‌తో 40 నిమిషాల్లో బ్యాటరీని పూర్తిగా చార్జ్ చేయవచ్చు.

## తీవ్రమైన వరదల నేపథ్యంలో ఐసిఐసిఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలకి దన్నుగా నిలుస్తోంది

**న్యూఢిల్లీ- నవభూమి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వినాశకరంగా వరదలు వచ్చినపడిన నేపథ్యంలో, ప్రముఖ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఒకటైన ఐసిఐసిఐ లాంబార్డ్, బాధిత కుటుంబాలకు మనఃపూర్వక సంతాపాన్ని తెలుపుతూ, సవాలుగా నిలిచిన ఈ కాలంలో ఈ రాష్ట్రాల ప్రజలకి మద్దత్తుగా నిలుస్తోంది. ఈ కష్టకాలంలో, తన ఖాతాదారులు, విస్తృత సమాజ శ్రేయస్సుకు ఐసిఐసిఐ మొక్కవోని దీక్షతో కట్టుబడి వుందని ప్రకటిస్తోంది. స్థానిక అధికారులు, అత్యవసర సేవల వారికి సమాచారం అందిస్తూ భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తమ తక్షణ అవసరాలని తీర్చుకోడానికి కీలకమైన సరఫరాలు సిద్ధంగా అందుబాటులో వుండేలా చూసుకోవాలని ప్రభావిత ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలని మేం కోరుకుంటున్నాం. ఇలాటి ప్రకృతి విపత్తులు ఊహించని నష్టాలకి, నాశనాలకి దారితీస్తాయని ఐసిఐసిఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ గ్రహించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో, వరదల వల్ల ప్రభావితమైన పాలసీదారులకి తక్షణ మద్దతు, సహాయం అందించేందుకుగాను, మేం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గడ్డు కాలంలో, దిశానిర్దేశం చేసి, క్లెయిములు ఇబ్బందులు లేకుండా పరిష్కరించుకునేలా సాయపడేందుకు మా బృందం 24ని7 అందుబాటులో వుంటుంది.


తక్షణ మద్దత్తు, మార్గదర్శనం కోసం, ఈ క్రింది చానెల్స్ ద్వారా దయచేసి ఐసిఐసిఐ లాంబార్డ్ ని సంప్రదించగలరు:

టోల్-ఫ్రీ కాంటాక్ట్ నెం: 1800-2666

ఇమెయిల్: %customersupport@icicilombard.com


ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ల్లో మా పాలసీదార్లకి, సమాజాలకి మద్దతుగా నిలిచేందుకు ఐసిఐసిఐ లాంబార్డ్ కట్టుబడి వుంది. మేం పరిస్థితిని సన్నిహితంగా పర్యవేక్షిస్తూ, అవసరమైన మేరకు మా మద్దతుని అనుగుణంగా మార్చుకుంటాం.

## పీడబ్ల్యూసీ మాస్ లేఆఫ్స్ : 1800 మంది ఉద్యోగులపై వేటు




**న్యూఢిల్లీ- నవభూమి:** 2009 తర్వాత ఆర్థిక సేవల దిగ్గజం ప్రైస్‌వాటర్‌హౌస్‌కూపర్స్ మాస్ లేఆఫ్స్‌కు తెగబడింది. అమెరికాలో దాదాపు 1800 మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించేందుకు పీడబ్ల్యూసీ సన్నద్ధమైంది. లేఆఫ్స్‌తో అసోసియేట్స్, మేనేజింగ్ డైరెక్టర్లు, బిజినెస్ సర్వీసులు, ఆడిట్, పన్ను విభాగాల్లో పనిచేసే ఉద్యోగులపై ప్రభావం పడనుంది. ప్రధానంగా పీడబ్ల్యూసీ అడ్వైజరీ, ప్రొడక్ట్స్, టెక్నాలజీ ఆపరేషన్స్ విభాగాలపై పెనుప్రభావం పడనుంది. లేఆఫ్స్ బాధితుల్లో సగం మంది అమెరికా వెలుపల పనిచేసే ఉద్యోగులేనని తెలిసింది. విస్తృత పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునే క్రమంలో భవిష్యత్‌లో పటిష్టంగా ఎదిగే క్రమంలో ఈ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలు చేపట్టామని ఉద్యోగులకు మెమోలో వివరించామని పీడబ్ల్యూసీ యూఎస్ లీడర్ పాల్ గ్రిగ్స్ తెలిపారు. ఎర్నెస్ట్ అండ్ యంగ్, కేపీఎంజీ, డెలాయిట్ వంటి ప్రత్యర్థి కంపెనీలు లేఆఫ్స్‌కు తెగబడినా 2009 నుంచి మాస్ లేఆఫ్స్‌ను నివారించిన పీడబ్ల్యూసీ అనూహ్యంగా పెద్దసంఖ్యలో లేఆఫ్స్ ప్రకటించడం ఉద్యోగుల్లో గుబులు రేగుతోంది. మరోవైపు పీడబ్ల్యూసీ చైనా కూడా సమస్యల్లో కూరుకుపోయింది. ప్రధాన క్లైంట్ కంట్రీ గార్డెన్ హోల్డింగ్స్‌ను చేజార్చుకోవడం పీడబ్ల్యూసీ చైనాకు ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

## ఆల్‌టైమ్ హైకి సూచీలు.. 83వేల పాయింట్లు దాటిన సెన్సెక్స్..



**న్యూఢిల్లీ- నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు తొలిసారిగా జీవితకాల గరిష్ఠాన్ని తాకాయి. సెన్సెక్స్ తొలిసారిగా 83వేల మార్క్‌ను దాటింది. నిఫ్టీ 25,433.35 పాయింట్ల మార్క్‌ను అందుకున్నది. సెన్సెక్స్, నిఫ్టీ రెండు గరిష్ఠ స్థాయిలో ముగిశాయి. దేశీయ మార్కెట్‌లో పెట్టుబడులు పెరిగాయి. ఈ క్రమంలో మార్కెట్లు ఒక్కసారిగా కొత్త ఊపునిచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ షేర్లు మద్దతు ఇచ్చాయి. ఉదయం సెన్సెక్స్ 81,930.18 పాయింట్ల వద్ద మొదలైంది. పొద్దంతా ఊగిసలాడిన మార్కెట్లు చివరి సెషన్‌లో ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగిశాయి. ఇంట్రాడేలో ఒక దశలో 81,534.29 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 83,116.19 పాయింట్లకు చేరి సరికొత్త రికార్డును సృష్టించింది.

చివరకు 1,439.55 పాయింట్ల లాభంతో 82,962.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 470.45 పాయింట్లు పెరిగి 25,388.90 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,228 షేర్లు పురోగమించగా.. 1,564 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో హిందాల్కో, భారతీయ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, శ్రీరామ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐచర్ మోటార్స్, ఓఎన్‌జీసీ, విప్రో, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లాభాలను నమోదు చేశాయి. గ్రాన్యూల్స్ ఇండియా, ప్రిసం జాన్సన్, రేమాండ్స్, బయోకాన్, ఆర్‌ఆర్ కబెల్ నష్టాల్లో ముగిశాయి. మెటల్స్, ఆటోమొబైల్స్, క్యాపిటల్ గూడ్స్, టెక్నాలజీ, పవర్ రంగాలు 2-4 శాతం పెరిగాయి. ఇక బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల విలువ రూ.7 లక్షల కోట్లు పెరిగి.. రూ.466 లక్షల కోట్లకు పెరిగింది.

# పీబీ పార్ట్‌నర్స్‌తో చేసిన ప్రయాణంలో శివలో వచ్చిన మార్పు: ఆర్థికావృద్ధి, సాధికారత కథనం

pbpartners.com
#EK RISHTA BHAROSE KA

**న్యూఢిల్లీ- నవభూమి:** దిశివా ప్రయాణం విజయం, పీబీ పార్ట్‌నర్స్ సహకార వాతావరణం ఆయనకు మద్దతు ఇచ్చిందిది

పాలసీబజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ కింద ఉన్న బ్రాండ్ పీబీ పార్ట్‌నర్స్, స్థానిక సముదాయాలకు చెందిన వ్యక్తులను పాయింట్ ఆఫ్ సెల్లింగ్ పర్సన్స్ గా మార్చడం ద్వారా బీమా పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. ఈ పాయింట్ ఆఫ్ సెల్లింగ్ పర్సన్స్ సహాయంతో, పీబీ పార్ట్‌నర్స్ వినియోగదారుల అన్ని అవసరాలకు ఫిజిటల్ పరస్పర చర్యలతో సమగ్ర పరిష్కారాలను అందించడం ద్వారా మెట్రో నగరాలకు ధీటుగా అన్ని ప్రాంతాలలో బీమాను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. చిన్న పట్టణాలు, నగరాలలో (టైర్-2 టైర్-3) పెరుగుతున్న బీమా వ్యాప్తితో, వారు దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా ఏజెంట్ భాగస్వాములను ఆర్థికంగా బలోపేతం చేశారు. అలాంటి స్ఫూర్తిదాయకమైన కథనాల్లో తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన శివ ఉన్నారు.

**పీబీ పార్ట్‌నర్స్‌తో చేరడం: మార్పుకు బీజం**

పరిశ్రమలో తన 7 ఏళ్లకు పైగా అనుభవాన్ని కలిగిన శివ ఏడాదిన్నర క్రితం సంవత్సరాల క్రితం పీబీ పార్ట్‌నర్స్‌లో చేరారు. అప్పటి నుంచి ఆయన కెరీర్, ఆదాయం అభివృద్ధి చెందడాన్ని ఆయన చూశారు. పలు సంవత్సరాలుగా, బీమా రంగంలో శివ అపారమైన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పొందారు. పీబీ పార్ట్‌నర్స్‌లో చేరడానికి ముందు, ఆయన పలు అనేక విభిన్న కంపెనీలతో పనిచేశారు. పీబీ పార్ట్‌నర్స్‌లో చేరిన తర్వాత, ఆయన వృత్తి జీవితంలో ఒక మలుపు వచ్చింది. అన్ని రకాల బీమాలను నిర్వహించేందుకు ఆయనకు ఒకే వేదికను అందించింది.

**సహాయక - సహకార పర్యావరణం**

పీబీ పార్ట్‌నర్స్ వద్ద సహాయక బృందాన్ని శివ హైలైట్ చేశారు. ఇది ప్రతి దశలో వారి ఏజెంట్ భాగస్వాములకు సహాయం చేయడానికి పైన అంతకు మించి ఉంటుంది. దీని గురించి శివ వివరిస్తూ, "పీబీ పార్ట్‌నర్స్ తన ఏజెంట్ భాగస్వాములను పోటీతత్వ బీమా మార్కెట్‌లో విజయానికి అవసరమైన సాధనాలు, వనరులతో సన్నద్ధం చేయడానికి సమగ్ర శిక్షణ, అంకితమైన రిలేషన్షిప్ మేనేజర్ మద్దతు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలను అందిస్తోంది. అనుభవజ్ఞులైన ఏజెంట్ భాగస్వాములు కొత్తవారికి మెంటార్, వారి జ్ఞానాన్ని పంచుకోవడంతో పాటు సహాయాన్ని అందించే సహకార వాతావరణాన్ని సంస్థ కలిగి ఉంది. ఈ కమ్యూనిటీ-సెంట్రిక్ విధానం ఏజెంట్ భాగస్వాముల కోసం ఔట్ రీచ్ ప్రయత్నాలను మెరుగుపరచడమే కాకుండా నమ్మకాన్ని పెంచుతుంది స్థానిక సంఘంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది" అని వివరించారు.

ఆదాయం -పార్ట్-టైమ్ ఫ్లెక్సిబిలిటీలో 10%ఇ% పెరుగుదలశివ తన ఆదాయం, వ్యాపారంలో గణనీయమైన వృద్ధిని సాధించారు. తన ఆదాయంలో వృద్ధి గురించి పెరుగుదల గురించి మాట్లాడుతూ, "పీబీ పార్ట్‌నర్స్‌లో చేరిన అనంతరం నా సంపాదన దాదాపు 10 రెట్లు పెరిగింది. పీబీ పార్ట్‌నర్స్‌లో నా అంకితభావం, కృషి ద్వారా, నేను వృత్తిపరమైన విజయాన్ని సాధించి, నా సంఘంలో విశ్వసనీయ సలహాదారుని అయ్యాను" అని తెలిపారు.

శివ దీని గురించి మరింత వివరిస్తూ, "పీబీ పార్ట్‌నర్స్‌లో ఏజెంట్ భాగస్వామిగా ఉండటం పలు ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధాన ప్రయోజనాలలో వారి సౌలభ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం, ఏజెంట్లు ఎప్పుడైనా, ఎక్కడైనా పని చేయడానికి, తమకు తామే బాస్‌లుగా ఉండేందుకు వీలు కల్పిస్తుంది. పీబీ పార్ట్‌నర్స్‌తో పార్ట్‌టైమ్ పని చేయడం వలన నేను ఇతర ఆసక్తులను కొనసాగించేందుకు అవకాశం కలిగింది. పీబీ పార్ట్‌నర్స్ నా వ్యాపారం కోసం ఆర్థిక పెట్టుబడిని సురక్షితంగా ఉంచడంలో నాకు సహాయం చేయడం ద్వారా ఈ కొత్త సాధనలో కీలక పాత్ర పోషించారు" అని వివరించారు.

**మంచి చెల్లింపులు**

పీబీ పార్ట్‌నర్స్‌తో శివ అనుభవించిన అద్భుతమైన ప్రయోజనాల్లో ఒకటి కంపెనీ వారి ఆన్ డిమాండ్ పేఅవుట్ ఫీచర్‌తో అందించే ఆదాయాలపై ఫ్లెక్సిబిలిటీ నియంత్రణ ఉన్నాయి.

శివ తన అనుభవాన్ని ఇలా పంచుకున్నారు, "పీబీ పార్ట్‌నర్స్ ఆన్ డిమాండ్ పేఅవుట్" ఫీచర్ నాకు గేమ్ ఛేంజర్‌గా ఉంది. ఇది నా సంపాదనపై పూర్తి నియంత్రణను కలిగి ఉండటానికి వీలు కల్పించింది. నా కెరీర్‌లో ఎదగడానికి అవసరమైన ఆర్థిక సౌలభ్యాన్ని నేను కలిగి ఉన్నాను. నాలాంటి ఏజెంట్ భాగస్వాములు, వారు పాలసీ విక్రయాన్ని ముగించినప్పుడల్లా చెల్లింపును అభ్యర్థించడానికి వీలు కల్పిస్తుంది. ఫండ్‌లు సాధారణంగా అదే రోజు లేదా మరుసటి రోజు ప్రాసెస్ చేయబడతాయి.

పీబీ పార్ట్‌నర్స్‌తో శివ ప్రయాణం సంస్థలోని సహాయక వాతావరణం, అద్భుతమైన ఆర్థిక ప్రయోజనాలు దాని ఏజెంట్ భాగస్వాములకు సహకార సంస్కృతి సానుకూల ప్రభావాన్ని చూపుతుంది.

# 'జనరేషన్ గ్రీన్' ప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా కళాశాలల్లో ఈ-వేస్ట్ జాగృతి కార్యక్రమం ప్రారంభం




**న్యూఢిల్లీ- నవభూమి:** ఆల్-India కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఒప్పో ఇండియా, నేడు జాతీయ స్థాయిలో ఎలక్ట్రానిక్-వ్యర్థాలపై అవగాహన డ్రైవ్ (ఇ-వేస్ట్)తో 'జనరేషన్ గ్రీన్' క్యాంపెయిన్ రెండవ విడతను ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్‌జాస్ కళాశాలలో ప్రారంభించాయి. దీనితో, ఈ కళాశాల మొదటి 'ఎకో-కాన్షియస్ ఛాంపియన్ ఇన్‌టిట్యూట్'గా నిలిచింది. మొదటి దశలో భాగంగా, ఒప్పో ఇండియా భారతదేశంలోని కళాశాలల్లో ఇంటర్న్‌షిప్‌లను అందించడం ద్వారా యువతలో హరిత నైపుణ్యాలను ప్రోత్సహించాయి. ఈ ఇంటర్న్‌షిప్‌ల కోసం 1,400 సంస్థల నుంచి 9,000 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 5,000 మంది ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు ఇప్పుడు అవగాహన సెషన్‌లు, ఇ-సర్వేలు, గ్రీన్ డే వేడుకలు మొదలైన సుస్థిరత కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారు. రెండవ దశలో విస్మరించిన వైర్లు, మొబైల్ ఫోన్‌లు, ఛార్జర్‌లు, బ్యాటరీలు తదితర ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణలో పెరుగుతున్న సవాళ్లు, స్థిరమైన భవిష్యత్తు కోసం సమర్థవంతంగా వ్యర్థాల నిర్వహణ గురించి యువతకు అవగాహన కల్పిస్తుంది. నేషనల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఫోరమ్ చైర్‌పర్సన్ డాక్టర్ అనిల్ సహస్రబుధే ముఖ్య అతిథిగా ప్రారంభోత్సవ వేడుకకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఒప్పో ఇండియాపబ్లిక్ అఫైర్స్ హెడ్ రాకేష్ భరద్వాజ్, ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్‌జాస్ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ అజయ్ కుమార్ అరోరా, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో, లిటరరీ సొసైటీ, డ్యాన్సింగ్ సొసైటీ, మ్యూజిక్ సొసైటీ, ఫోటోగ్రఫీ సొసైటీ, క్విజ్ సొసైటీ, ఫైన్ ఆర్ట్స్ సొసైటీ తదితర సంఘాల నుంచి పాల్గొన్ విద్యార్థులు విభిన్న కార్యకలాపాలలో పాల్గొననున్నారు. "మన పర్యావరణం, ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు బాధ్యతాయుతమైన ఇ-వ్యర్థాల నిర్వహణ, తొలగింపు కీలకంగా ఉంటుంది" అని అని నేషనల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఫోరమ్ చైర్‌పర్సన్ డాక్టర్ అనిల్ సహస్రబుధే పేర్కొన్నారు. "విస్తృత సామాజిక మార్పును ప్రభావితం చేసేలా తరంగ ప్రభావాన్ని సృష్టించేందుకు విద్యా రంగంలో సుస్థిరతను తీసుకురావలసిన అవసరం చాలా ఉంది. 'జనరేషన్ గ్రీన్' క్యాంపెయిన్ వంటి కార్యక్రమాలు ఈ సమస్యను పరిష్కరించడంలో చురుకైన పాత్ర పోషించేందుకు యువతకు మద్దతుగా నిలుస్తాయి. యువకులకు అవగాహన కల్పించడం ద్వారా బాధ్యతాయుతంగా, మేము స్థిరమైన పద్ధతులకు ప్రాధాన్యతనిచ్చే తరాన్ని వృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇది సరైన ఇ-వ్యర్థాల నిర్వహణను నిర్ధారిస్తూ, అందరికీ పచ్చదనం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిస్తుంది" అని వివరించారు.

కేవలం ఒక నెలలోనే, పాఠశాలలు, కళాశాలల నుంచి 1 లక్ష మంది విద్యార్థులు ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు, ఇ-వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు కట్టుబడి, మరింత స్థిరమైన జీవనశైలికి తమ సహకారాన్ని అందించారు. అలాగే 2024 చివరికి భారతదేశంలో కనీసం 10 లక్షల మంది విద్యార్థులను చేరుకోవాలనే లక్ష్యాన్ని ఈ కార్యక్రమం కలిగి ఉంది. ఇండియాలో, మేము భారత ప్రభుత్వం నెట్-జీరో దృష్టికి కట్టుబడి ఉన్నాము. యువత శక్తితో నడిచే స్థిరమైన భవిష్యత్తు వైపు జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నాము" అని ఒప్పో ఇండియాపబ్లిక్ అఫైర్స్ హెడ్ రాకేష్ భరద్వాజ్ పేర్కొన్నారు. "క్యాంపెయిన్‌కు వారు తీసుకువచ్చే ఉత్సాహం, ఎంగేజ్‌మెంట్ ద్వారా వారి క్రియాశీల ఎంగేజ్‌మెంట్ స్పష్టంగా కనిపిస్తుంది. దీన్ని ప్రారంభించిన కొన్ని వారాల్లోనే 1 లక్షకు పైగా గ్రీన్ ప్లెడ్జ్‌ల స్థాయికి ఈ కార్యక్రమం చేరుకుంది. పర్యావరణ పట్ల బాధ్యతతో కూడిన జీవనశైలిని అవలంబించడంలో యువత ముందుంటూ, బాధ్యత తీసుకుంటున్నారు. మొదటి దశలో, మేము 20కు పైగా రాష్ట్రాలు 3 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 5,000 మంది సుస్థిరత ఛాంపియన్‌లను చేర్చుకున్నాము. వారు ఇప్పుడు పరిశుభ్రమైన, స్థిరమైన భవిష్యత్తు కోసం పని చేసేందుకు ఇతరులను ప్రేరేపిస్తున్నారు. మేము రెండవ దశలోకి ప్రవేశిస్తున్నప్పుడు, ఈ యువ నాయకులు భారతదేశంలోని కళాశాలల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా ఇ-వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారిస్తారు. అభివృద్ధి చెందుతున్న హరిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన గ్రీన్ మైండ్‌సెట్‌ను మరింతగా నిర్మించేందుకు సహకారాన్ని అందిస్తారు" అని వివరించారు. ఐక్యరాజ్యసమితి ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ report ప్రకారం, 2010 2022 మధ్యకాలంలో స్క్రీన్‌లు, కంప్యూటర్లు చిన్న ఐటీ, టెలికమ్యూనికేషన్ పరికరాల (నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేయడంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా, 163 శాతం వృద్ధిని సాధించింది. ఇది ముఖ్యమైన సవాలును, సమర్థవంతమైన ఇ-వ్యర్థాల నిర్వహణ అవసరాన్ని చాటిచెబుతోంది. "రామ్‌జాస్ కళాశాల జనరేషన్ గ్రీన్' క్యాంపెయిన్ రెండవ దశను ప్రారంభించడానికి ఎంపిక చేయడం ద్వారా మేము గౌరవాన్ని అందుకున్నాము. స్థిరత్వానికి లోతుగా కట్టుబడి ఉన్న సంస్థగా, మా క్యాంపస్ సంస్కృతిలో పర్యావరణ అనుకూల పద్ధతులను ఏకీకృతం చేయడానికి మేము నిరంతరం కృషి చేస్తున్నాము. ఈ సహకారం సంపూర్ణంగా ఉంది. యువతలో పర్యావరణ బాధ్యతను పెంపొందించాలన్న మా దృక్కోణానికి అనుగుణంగా, ఇ-వ్యర్థాల ముఖ్యమైన సమస్యను పరిష్కరించేందుకు మా విద్యార్థులకు, యువతకు సాధికారత కల్పించి, మేము పరిశుభ్రమైన, పచ్చని భవిష్యత్తును రూపొందించడానికి ఒక ముఖ్యమైన అడుగు వేస్తున్నాము.

ఈ చొరవ దేశవ్యాప్తంగా నిర్వహించే మొదటి ఎకో-కాన్షియస్

## ఈ ఆరు దేశాల్లో వాట్సాప్‌పై నిషేధం.. దీని వెనుక ఉన్న కారణాలు ఏంటో తెలుసా..?




**న్యూఢిల్లీ- నవభూమి:** వాట్సాప్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా మూడు బిలియన్ల మంది వినియోగిస్తున్నారు. భారత్‌లోనూ 53కోట్ల మంది యూజర్లు ఉన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన అవసరాల కోసం వాట్సాప్‌ను ఉపయోగించుకుంటున్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఆరు దేశాల్లోని ప్రభుత్వాలు మెటా యాజమాన్యంలోని వాట్సాప్‌ని నిషేధించాయనే విషయం చాలా మందికి తెలియదు. ఆయా దేశాలు ఎందుకు వాట్సాప్‌ని బ్యాన్ చేశాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఇందులో భారత్‌కు పొరుగుదేశమైన చైనాతో పాటు ఇరాన్, యూఏఈ, ఖతార్, సిరియా, ఉత్తర కొరియా ఉన్నాయి. ఈ దేశాలు తమ దేశాల్లో వాట్సాప్ వాడకాన్ని నిషేధించాయి. బ్యాన్ వెనుక కారణాలు ఒక్కో దేశంలో ఒక్కో రకంగా ఉన్నాయి. అయితే, ఆయా దేశాలు ఎందుకు వాట్సాప్‌ని బ్యాన్ చేశాయో తెలుసుకుందాం.

**ఉత్తర కొరియా..**

వాట్సాప్‌ని బ్యాన్ చేసిన దేశాల్లో ఉత్తర కొరియా ఒక్కటి. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ అన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ఇంటర్నెట్ విధానాలు ఇక్కడ అమలులో ఉన్నాయి. ఉత్తర కొరియాలో సాధారణ ప్రజలకు ఇంటర్‌నెట్ వినియోగం పరిమితంగా అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ప్రభుత్వం కమ్యూనికేషన్‌పై నియంత్రణను కొనసాగిస్తుంది. ఈ క్రమంలో వాట్సాప్ సహా పలు యాప్‌ని వినియోగించకుండా నిషేధం విధించారు. తద్వారా స్థానిక సమాచారాన్ని బయటకు వెల్లడికాకుండా సమాచార వ్యాప్తిని అడ్డుకట్ట వేసేలా కిమ్ వాట్సాప్‌ని బ్యాన్ చేశారు.

**చైనాలో..**

భారత్‌కు పొరుగుదేశం చైనాలో దాదాపు పరిస్థితి కాస్త ఉత్తర కొరియా తరహాలోనే ఉంటుంది. ఇక్కడ ఇంటర్‌నెట్ వినియోగంపై ప్రభుత్వానికే నియంత్రణ ఉంటుంది. చైనీస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోని గ్రేట్ ఫైర్‌వాల్ పొరులు బయటి ప్రపంచానికి సంబంధించిన అనేక విదేశీ యాప్‌లు, వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేయకుండా నిరోధిస్తుంది. విదేశీ యాప్‌లకు బదులుగా వుయ్‌చాట్ తదితర స్వదేశీ యాప్‌లను ప్రోత్సహించేందుకు చైనా ప్రభుత్వం సమగ్ర వ్యూహంపై పని చేస్తుంది. కమ్యూనికేషన్ నియంత్రించడంలో భాగంగా వాట్సాప్‌ని నిషేధించింది.

**సిరియాలో..**

వాట్సాప్‌ను సిరియాలోనూ నిషేధించారు. సిరియా చాలా కాలంగా అంతర్యుద్ధంతో పోరాడుతోంది. పైగా సిరియాపై అనేక ఆంక్షలు విధించారు. దీని కారణంగా సిరియాలో వాట్సాప్ నిషేధించబడింది. దేశంలో జరిగే విషయాలు బయటికి చేరడం ఇక్కడి ప్రభుత్వానికి సైతం ఇష్టం లేదు. అదే సమయంలో సమగ్ర ఇంటర్నెట్ సెన్సార్‌షిప్ విధానంలో ఓ భాగంగా వాట్సాప్ నిషేధం కూడా భాగమే.

ఇరాన్‌లో..

ఇరాన్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక ఆంక్షలను ఎదుర్కొంటోంది. అణుబాంబు విషయంలో ఇరాన్, అమెరికాల మధ్య వివాదం నడుస్తోంది. దీని కారణంగా వాట్సాప్ ఇరాన్‌లో ఎప్పటికప్పుడు ఆంక్షలను ఎదుర్కోవాల్సి వచ్చింది. రాజకీయ అశాంతి దృష్ట్యా కమ్యూనికేషన్, సమాచార వ్యాప్తిని నియంత్రించడానికి అక్కడి ప్రభుత్వం వాట్సాప్‌ను కూడా నిషేధించింది.

**ఖతార్‌లో..**

ఖతార్ ప్రభుత్వం వాట్సాప్ వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్స్‌ని బ్లాక్ చేసింది. కేవలం టెక్స్‌ట్ సందేశాలు పంపుకునేందుకు మాత్రమే అవకాశం ఉన్నది. ఖతార్ ప్రభుత్వం తన టెలికాం కంపెనీలకు మద్దతు ఇచ్చేందుకు కాల్స్‌పై నిషేధం విధించింది.

**యునైటెడ్‌ అరబ్ ఎమిరేట్స్..**

ఇటీవలి కాలంలో యూఏఈలో చాలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అయినప్పటికీ, అక్కడి ప్రభుత్వం ఖతార్ ప్రభుత్వం తరహాలోనే వాట్సాప్ వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్స్‌ను బ్లాక్ చేసింది. యూఏఈలో టెక్స్‌ట్ మెసేజింగ్‌పై ఎలాంటి నిషేధాజ్ఞలు లేవు.

# హైదరాబాద్, విశాఖల్లో కొత్త దవాఖానలు.. మేకిన్ ఇండియా, ప్రణాం హాస్పిటల్స్ మధ్య ఎంఓయూ



**న్యూఢిల్లీ- నవభూమి:** మేకిన్ ఇండియా హాస్పిటల్స్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదిరిందని ప్రణాం హాస్పిటల్స్ ప్రకటించింది. హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లో ప్రాజెక్టుల ను ప్రారంభించడానికి మేకిన్ ఇండియా హాస్పిటల్స్‌తో భాగస్వామ్యం గర్వంగా ఉందని ప్రణాం హాస్పిటల్స్ తెలిపింది. కరుణ, శ్రేష్ఠమైన వారసత్వంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన హెల్త్‌కేర్ సేవలందించాలన్న విజన్‌తో పని చేస్తున్నట్లు ప్రణాం హాస్పిటల్స్ పేర్కొంది. అధునాతన మెడికల్ టెక్నాలజీతో ఏండ్ల తరబడి రోగులకు వైద్య సేవలందించడంలో వైద్య రంగంలో విశ్వసనీయ సంస్థగా ఎదిగాం అని వెల్లడించింది. ప్రణాం హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మనీష్ గౌర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేకిన్ ఇండియా హాస్పిటల్స్‌తో సహకార ఒప్పందంతో మా ప్రయాణంలో పరివర్తన దశ. మరింత మందికి హెల్త్ కేర్ సేవలు అందుబాటులోకి తేవాలన్న మా మిషన్‌ను శక్తిమంతం చేస్తుంది. తక్కువ ధరకే వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న మా నిబద్ధతను బలోపేతం చేస్తుంది అని వ్యాఖ్యానించారు. ప్రణాం హాస్పిటల్స్ గ్రూప్ సీఈఓ డాక్టర్ అన్నీ ఠాకూర్ స్పందిస్తూ.. మేకిన్ ఇండియా హాస్పిటల్స్‌తో భాగస్వామ్యం మా హాస్పిటల్స్‌లో కొత్త అధ్యాయం నెలకొల్పుతుంది. హైదరాబాద్, విశాఖపట్నం నగరాలకు మా సేవలను విసర్తించడం ద్వారా విస్తృత ప్రజానీకానికి ఉత్తమ టెక్నాలజీతో హెల్త్‌కేర్ సేవలు అందించడానికి మార్గం సుగమం అవుతుంది- అని పేర్కొన్నారు. ఏఎంటీజడ్ ఫౌండర్ అండ్ సీఈఓ డాక్టర్ జితేంద్ర శర్మ మాట్లాడుతూ.. -సృజనాత్మకతతో హెల్త్‌కేర్ సేవలను అందుబాటులోకి తేవడానికి మేకిన్ ఇండియా హాస్పిటల్స్-ప్రణాం హాస్పిటల్స్ సహకారం ఒప్పందం నిజమైన నిదర్శనం. దేశంలోని ప్రతి మారు మూల ప్రాంతానికి తక్కువ ధరలోనే నాణ్యతతో కూడిన ఆరోగ్య సేవలు తేవడమే మా లక్ష్యం%-% అని చెప్పారు. డాక్టర్ జితేంద్ర శర్మ అంకిత భావం, వ్యూహాత్మక విధానంతో రెండు హాస్పిటల్స్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. మేకిన్ ఇండియా హాస్పిటల్స్ ఇన్షియేటివ్‌లో భాగంగా ఏఎంటీజడ్ క్యాంపస్‌లో మెడ్ టెక్ సొసైటీతో అవగాహనా ఒప్పందంపై ప్రణాం హాస్పిటల్స్, మేకిన్ ఇండియా హాస్పిటల్స్ ప్రతినిధులు సంతకాలు చేశారు.



# చైనాలో అమృత్‌సర్ కుల్చా హల్చల్




**అమృత్‌సర్-నవభూమి:** ఘన సాంస్కృతిక వారసత్వం కలిగిన అమృత్‌సర్ నగరం తన విలక్షణ వంటకాలతోనూ విశ్వవ్యాప్తంగా ఫుడ్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. మక్కీ రోటీతో సర్సన్ దా సాగ్ అయినా, ఛోలే భటూరే, దాల్ మఖానీ వంటి క్లాసిక్స్‌తో అయినా అమృత్‌సర్ టేస్ట్ క్యాపిటల్ అంటూ భోజన ప్రియులు కితాబిస్తున్నారు. ఇక తన ఐకానిక్ డిష్‌ల్లో అమృత్‌సరి కుల్చా కూడా ఎందరికో ఫేవరెట్ డిష్‌గా మారిపోయింది. పొటాటో, పనీర్, వెజిటబుల్ మిక్స్ స్టఫ్ చేసి నోరూరించే ఈ కుల్చాను అందరూ లొట్టలేస్తూ ఆరగిస్తారు. భారత్‌లో ఈ డిష్ భాషలు, ప్రాంతాలకు అతీతంగా ఫేమస్ అయింది. ఇక చైనాలో ఓ వైరల్ వీడియోలోనూ అమృత్‌సర్ కుల్చా సందడి చేసింది. ఇన్‌స్టాగ్రాంలో ప్రస్తుతం చక్కర్లు కొడుతున్న ఈ వీడియోలో చైనాకు చెందిన ఓ వీధి వ్యాపారి షెంజెన్‌లో ఈ డిష్‌ను ప్రిపేర్ చేసి కస్టమర్లకు సర్వ్ చేయడం కనిపిస్తుంది.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



## సైకిల్‌పై అత్యంత వేగంగా ప్రపంచాన్ని చుట్టేసిన మహిళ.. ఎన్ని రోజుల్లో ఆమె ఆ ట్రిప్ చేసిందంటే?



**చికాగో-నవభూమి:** అమెరికాకు చెందిన లాయిల్ విల్‌కాక్స్ అనే మహిళ ప్రపంచ రికార్డు సృష్టించింది. సైకిల్‌పై అతి తక్కువ సమయంలో ప్రపంచాన్ని చుట్టిన మహిళగా ఘనతను సొంతం చేసుకున్నది. 108 రోజులు, 12 గంటలు, 12 నిమిషాల్లో ఆమె ప్రపంచాన్ని చుట్టేసింది. సైక్లిస్ట్ విల్‌కాక్స్ ఆ సమయంలో 29,169 కిలోమీటర్లు(18,125 మైళ్లు) దూరాన్ని కవర్ చేసింది. గతంలో జెన్నీ గ్రహం అనే స్కాట్‌లాండ్ మహిళ 2018లో 124 రోజుల్లో ఆ రికార్డును నెలకొల్పింది. 38 ఏళ్ల విల్‌కాక్స్ చికాగో నుంచి మొదలుపెట్టి తన జర్నీని మళ్లీ అక్కడే ముగించింది. మే 28వ తేదీన ఆమె తన జర్నీ ప్రారంభించింది. 4 ఖండాల్లోని 21 దేశాల్లో ఆమె టూర్ చేసింది. ప్రతి రోజు 14 గంటల పాటు ఆమె సైకిల్ తొక్కేది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆమె రికార్డును వెరిఫై చేయనున్నది. అమెరికాలో జరిగే 4 వేల మైళ్ల ట్రాన్స్ ఆమ్ అనే రేస్‌ను గెలిచిన తొలి మహిళగా విల్‌కాక్స్ రికార్డుకెక్కింది. కొండల మధ్య సాగే టూర్ డివైడ్ రేస్‌లోనూ రికార్డు సృష్టించింది.

సైక్లిస్టులు తమ జర్నీలో భాగంగా కనీసం 28,970 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. చికాగో నుంచి మొదలుపెట్టిన విల్‌కాక్స్ మొదట న్యూయార్క్ చేరుకున్నది. అక్కడ నుంచి పోర్చుగల్‌కు విమానంలో వెళ్లింది. ఆ తర్వాత కొన్ని వారాల పాటు ఆమ్‌స్టర్‌డ్యామ్, జర్మనీ, ఆల్ప్స్ పర్వతాల్లో తిరిగింది. టర్కీ నుంచి జార్జియాకు వెళ్లింది. అక్కడ నుంచి ఆస్ట్రేలియాకు విమానంలో వెళ్లింది. పెర్త్ నుంచి సైకిల్‌పై బ్రిస్‌బేన్‌కు వెళ్లింది. అక్కడ న్యూజిలాండ్‌కు ఫ్లయిట్ ఎక్కింది. పసిఫిక్ తీరం వెంట పెడలింగ్ చేసింది. లాస్ ఏంజిల్స్ వరకు ఆమె వెళ్లింది. ఆ తర్వాత 66 రూట్‌లో చికాగో చేరుకున్నది. భారతీయ సైక్లిస్టు వేదాంగి కులకర్ణి.. కొత్త రికార్డును సృష్టించే ప్రయత్నం చేస్తున్నది. 25 ఏళ్ల ఆ సైక్లిస్టు ఇప్పటికే 65 రోజుల్లో 7700 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. 110 రోజుల్లోనే ప్రపంచాన్ని చుట్టేయాలని ఆమె ప్రయత్నిస్తున్నది.

## తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.. టేలర్ స్విఫ్ట్‌పై డొనాల్డ్ ట్రంప్




**న్యూఢిల్లీ- నవభూమి:** పాప్ స్టార్ టేలర్ స్విఫ్ట్‌పై అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ( తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ప్రత్యర్థి కమలా హారిస్ ()కు టేలర్ స్విఫ్ట్ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. తాను కమలాకే ఓటు వేస్తానని వెల్లడించారు.

అయితే, టేలర్ ప్రకటనను ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె ప్రకటనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టేలర్ కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 'నేను టేలర్ అభిమానిని కాదు. ఆమె ఎప్పుడూ డెమోక్రాట్లనే సమర్థిస్తున్నట్లు అనిపిస్తోంది. అందుకు ఆమె భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా, ఈ ఎన్నికల్లో తాను కమలా హారిస్‌కే మద్దతు ఇస్తానని టేలర్ బుధవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 'అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్, టిమ్ వాజ్‌కు ఓటు వేస్తాను. దేశ ప్రజల హక్కుల కోసం కమలా పోరాడుతున్నారు. మన హక్కులు మనకు కావాలంటే ఒక వారియర్ అవసరమని భావిస్తున్నాను. గందరగోళంతో కాకుండా ప్రశాంతంగా దేశం కోసం ఏదైనా సాధించొచ్చని నమ్ముతున్నాను. అందుకే నేను కమలా హారిస్‌కే మద్దతు ఇస్తున్నాను. ఎంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను' అని తన సోషల్ మీడియా పోస్టులో టేలర్ వెల్లడించారు.

## అదానీ.. గో బ్యాక్.. మోదీ ఆప్తమిత్రుడిపై కెన్యాలో పెద్ద ఎత్తున నిరసనలు

**నైరోబి-నవభూమి:** దేశంలోని అనేక నౌకాశ్రయాలు, విమానాశ్రయాలను హస్తగతం చేసుకున్న ఆదానీ సంస్థ విదేశాలకు విస్తరించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు తీవ్ర అడ్డంకులు ఎదురవుతున్నాయి. కెన్యాలో అదానీ సంస్థకు వ్యతిరేకంగా వందలాది మంది ఎయిర్‌పోర్టు కార్మికులు ఆందోళనకు దిగారు. రాజధాని నైరోబిలోని జోమో కెన్యట్ట అంతర్జాతీయ విమానాశ్రయాన్ని(జేకేఐఏ) అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు లీజుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం రాత్రి కెన్యా ఏవియేషన్ అథారిటీ(కేఏఏ) కార్మికులు సమ్మెకు దిగారు. అదానీ.. గోబ్యాక్', 'వీ రిజెక్ట్ అదానీ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అదానీతో ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని ప్రభుత్వాన్ని కార్మికులు డిమాండ్ చేశారు. ఎయిర్‌పోర్టును అదానీకి అప్పగించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. కార్మికుల సమ్మెతో ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు స్తంభించిపోయాయి. విమానాల రాకపోకలు ఆలస్యం అవుతున్నాయి. టెర్మినల్ బయట ప్రయాణికులు బారులు తీరుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, ఈ ఒప్పందంపై అభ్యంతరాల నేపథ్యంలో కెన్యా హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది.

**ఏమిటీ ఒప్పందం?..** జోమో కెన్యట్ట అంతర్జాతీయ విమానాశ్రయం కెన్యాలో ప్రధానమైనది. దాదాపు 185 కోట్ల డాలర్లకు ఈ ఎయిర్‌పోర్టును 30 ఏండ్ల పాటు అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ సంస్థకు లీజుకు ఇచ్చేందుకు కెన్యా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సామర్థ్యానికి మించి ఎయిర్‌పోర్టుకు ప్రయాణికులు వస్తున్నందున ఆధునీకరించేందుకు ఈ ఒప్పందం చేసుకున్నట్టు కెన్యా ప్రభుత్వం చెప్పింది. ఒప్పందంలో భాగంగా అదానీ సంస్థ రెండో రన్‌వేను నిర్మించడంతో పాటు ప్రయాణికుల టెర్మినల్‌ను ఆధునీకరించాలి.

# జంధ్యం పట్టిన చేతితోనే వామపక్ష జెండా ఎత్తి...!



**న్యూఢిల్లీ- నవభూమి:** సీతారాం ఏచూరి ఇక లేరు అన్న వార్త ఆయన అభిమానులతో పాటు మొత్తం తెలుగు వారిని కలచివేసింది. తెలుగు నాట నుంచి జాతీయ స్థాయి లోకి వెళ్ళి ప్రభావవంతమైన రాజకీయాన్ని చేసిన వారిలో సీతారాం ఏచూరి ఒకరు. ఒక పార్టీకి సుదీర్ఘ కాలం జాతీయ స్థాయిలో నాయకత్వం వహించడంతో పాటు తనదైన అద్భుతమైన వాగ్దాటితో అటు పార్లమెంట్ లోపలా ఇటు జన బాహుళ్యంలోకి పేరు తెచ్చుకున్న నేతలలో అరుదైన వారిగా సీతారాం ఏచూరిని చెప్పుకోవాలి. ఆయనది మద్రాసులో స్థిరపడిన తెలుగు కుటుంబం. ఈయన తండ్రి ఏచూరి సర్వేశ్వర సోమయాజి, తల్లి ఏచూరి కల్పకం. అంతే కాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మోహన్ కందాకు సీతారాం ఏచూరి మేనల్లుడు. పదకొండవ ఏటే ఉపనయయం చేసుకుని మూడు కాలాలలో సంధ్యా వందనం చేసిన సీతారాం ఏచూరి 15 ఏళ్లకే మార్క్సిస్టు భావజాలానికి ఆకర్షితులు అయ్యారు. అమిత్ షా వ్యాఖ్యలపై కేటీఆర్ ఫైర్ అలా చదువులో నంబర్ వన్ స్టూడెంట్ ఐఏఎస్ కావాల్సిన ఆయన పీడిత తాడిత ప్రజల కోసం కమ్యూనిస్టు జెండా ఎత్తారు. ఆయనది సనాతన సంప్రదాయ కుటుంబం. రామాయణ భారత భాగవతాలు భగవద్గీత అన్నీ చదివిన వాడైన సీతారాం ఏచూరి వామపక్ష ఉద్యమం వైపు మళ్ళడం సంచలన పరిణామం. ఆయన జీవిత పర్యంతం ఆ పురాణాలను జ్ఞాపకం ఉంచుకుంటూనే మత తత్వం అంటూ బీజేపీకి వ్యతిరేకంగా ముందు వరసలో నిలిచి పోరాడారు. ఆయన వామపక్ష ఉద్యమాల వెంట తిరగడం చూసిన తండ్రి ప్యాకెట్ మనీ ఇవ్వను అని హెచ్చరించారు. అయినా తన దారి మార్చుకోలేదు. ఎరుపులోనే మెరుపు ఉందని నమ్మారు. తుదికంటా అదే అనుసరించారు. 15 ఏళ్ళ వరకూ గుడులూ గోపురాలు తిరిగిన ఆయన దానికి బద్ధ వ్యతిరేకమైన పార్టీలో చేరి అగ్ర శ్రేణి నేతగా మారడం నిజంగా వింతే. అయితే దానికి ఆయన సమాధానం ఏంటి అంటే మనిషిగా తాను చైతన్యం అయ్యాను అని. అందుకే తాను తన దారి ఎంచుకున్నాను అని. తెలుగు నాట దిగ్గజ కమ్యూనిస్టు నేతగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్యకు ప్రియ శిష్యుడిగా సీతారాం ఏచూరి మెలిగారు. ఆయన వామపక్ష ఉద్యమాలలో తిరగడం నచ్చని ఆయన అమ్మమ్మ విజయవాడలోని పుచ్చలపల్లి వారి ఇంటికి వెళ్ళి తన మనవడిని ఉద్యమ బాట నుంచి మళ్ళించమని కోరారట. దానికి ఆయన చెప్పిన సమాధానం నీ మనవడి లాంటి వాడిని నాకు చూపిస్తే వదిలేస్తాను. అని అంతలా అంకితభావంతో వమాపక్ష ఉద్యమాన్ని అర్థం చేసుకున్నారు కాబట్టే దిగ్గజ నేతగా సీతారాం ఏచూరి ఎదిగారు. ఇక సీతారాం ఏచూరిలో విప్లవ భావాలకు బీజం పడింది హైదరాబాద్ లోనే. 1960లలో ఉస్మానియాలో జార్జిరెడ్డి చేసిన ఉద్యమాలు పోరాటాలు ఆయన మీద తీవ్ర ప్రభావం చూపించాయి. సీతారాం ఏచూరి ఇక లేరు.. జాతీయ రాజకీయాల్లో విషాదం దేశంలో ఈ రోజున వామపక్ష ఉద్యమాల ప్రభావం చాలా అవసరం అని వాదించే సీతారాం ఏచూరి మంచి రోజులు తమ పార్టీకి వస్తాయని ఆశాభావంతో ఉండేవారు. విద్యార్థి దశ నుంచే సీతారాం ఏచూరి చదువులో మిన్నగా రాణించ్గారు. విద్యాభ్యాసమంతా ఢిల్లీలోనే సాగింది. ఢిల్లీ ఎస్టేట్ స్కూల్లో పాఠశాల విద్య అభ్యసించారు. సీబీఎస్ఈ పరీక్షలో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. సెయింట్ స్టీఫెన్ కళాశాలలో బీఏ (ఆనర్స్) ఆర్థికశాస్త్రం, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఎంఏ ఆర్థికశాస్త్రంలో పట్టా పొందారు. డిగ్రీ, పీజీ రెండింటిలోనూ ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణులయ్యారు. ఆయన సీపీఎంలో ఎదిగిరిన తీరు చాలా గొప్పగా ఉంటుంది. 1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) లో సభ్యుడిగా ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని చెప్పాలి ఆ తరువాత ఏడాదే అంటే 1975లోనే ఆయన సీపీఎం సభ్యుడు అయ్యారు. అలా అర్ధ శతాబ్దం పైగా ఆయనకు వామపక్ష పోరాటాల విషయంలో అనుబంధం ఉంది. ఇక పదవుల విషయానికి వస్తే జేఎన్‌యూ విద్యార్థి నాయకునిగా సీతారాం ఏచూరి మూడుసార్లు ఎన్నికయ్యారు. 1978లో అఖిల భారత ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, సీపీఎం ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1985లో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో, 1988లో కేంద్ర కార్యవర్గంలో, 1999లో పొలిట్ బ్యూరోలో ఏచూరికి చోటు దక్కింది. 2005లో బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అలా 2 సార్లు అంటే 12 ఏళ్ల పాటు ఆయన ఆ పదవిలో ఉన్నారు. ఆ సమయంలో ఆయన ఎన్నో సమస్యలను కేంద్రం దృష్టికి తెచ్చారు. ఆయన సగటు ప్రజానీకం గొంతుకగా గుర్తింపు పొందారు. తెలుగు వారు అయినా సీతారాం ఏచూరి ఎక్కువగా జాతీయ స్థాయిలోనే తన ప్రభావం చూపించారు. ఆయన బెంగాలీ, మలయాళం, తమిళం, పంజాబీ, ఉర్దూ, హిందీ, ఆంగ్లాలను అనర్గళంగా మాట్లాడే దిట్టగా పేరు సంపాదించారు. ఆయన నాయకత్వ దక్షతకు నిదర్శనం ఇప్పటికి తొమ్మిదేళ్ళుగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగడం.

## ప్రొ. సందీప్ ఘోష్ నివాసంలో ఈడీ సోదాలు



**న్యూఢిల్లీ- నవభూమి:** ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో మాజీ ప్రిన్సిపాల్ ప్రొ. సందీప్ ఘోష్ నివాసంతోపాటు మరో రెండు ప్రదేశాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం సోదాలు నిర్వహించింది. ప్రొ. సందీప్ ఘోష్‌కు చెందిన రెండు ఫ్లాట్లలో ఈడీ తనిఖీలు చేపట్టింది. ప్రొ. సందీప్ ఘోష్ నివాసంలో ఈడీ సోదాలు

కోల్‌కతా, సెప్టెంబర్ 12: ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చోటు చేసుకున్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ ప్రొ. సందీప్ ఘోష్ నివాసంతోపాటు మరో రెండు ప్రదేశాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం సోదాలు నిర్వహించింది. ప్రొ. సందీప్ ఘోష్‌కు చెందిన రెండు ఫ్లాట్లలో ఈడీ తనిఖీలు చేపట్టింది. అలాగే లేక్ టౌన్‌లోని మెడికల్ సప్లయర్ కార్యాలయంతోపాటు తాలాలోని ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి మందులు సరఫరా చేసిన వ్యక్తి నివాసంలో సైతం సోదాలు నిర్వహించింది. ఇప్పటికే ఇదే విషయంలో పశ్చిమ బెంగాల్‌లోని హౌరా, సోనార్‌పూర్, హుగ్లీలలో ఈడీలు సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సోదాలు జరిగిన కొద్ది రోజులకే ప్రొ. సందీప్ ఘోష్ నివాసాలతోపాటు ఇతర ప్రాంతాల్లో సైతం ఈడీలు సోదాలు నిర్వహించింది. గత నెలలో ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచారం ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే ఆ కాలేజీ ఆసుపత్రి ప్రిన్సిపల్ పదవికి ప్రొ. సందీప్ ఘోష్ రాజీనామా చేశారు. హత్యాచారం జరిగిన ట్రైయినీ వైద్యురాలు తన కుమార్తెతో సమానమన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకూడదంటూ ఆయన తన ఎక్స్ ఖాతా వేదికా స్పందించారు. ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొ. సందీప్ ఘోష్ హయాంలో భారీ అవినీతి చోటు చేసుకుందని ఆ ఆసుపత్రి మాజీ డిప్యూటీ సుపరింటెండెంట్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో ప్రొ. సందీప్ ఘోష్‌ను కొన్ని వారాల క్రితం సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. 2021లో ఆర్ జీ కర్ ఆసుపత్రి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొ. సందీప్ ఘోష్ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి ఆయన హయాంలో చోటు చేసుకున్న మందుల కొనుగోళ్లు ఇతర అంశాలపై ఈడీ విచారణ చేపట్టింది. అందులోభాగంగా ఆయా అంశాలపై ఈడీ ఆరా తీస్తుంది. ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి ప్రిన్సిపాల్ పదవికి ప్రొ. సందీప్ ఘోష్ రాజీనామా చేసిన వెంటనే ఆయనను మరో కాలేజీ ప్రిన్సిపల్‌గా మమతా బెనర్జీ ప్రభుత్వం నియమించింది. ఈ విషయాన్ని కోల్‌కతా హైకోర్టు సైతం తప్పు పట్టింది. ప్రొ. సందీప్ ఘోష్‌ను దీర్ఘ కాలిక సెలవుపై పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

## ట్రంప్‌పై కమలదే పైచేయి.. హారిస్ ఇయర్ రింగ్స్‌లో సీక్రెట్ డివైస్! వాడీవేడిగా తొలి డిబేట్



**న్యూయార్క్-నవభూమి:** నవంబర్‌లో జరిగే అగ్రరాజ్య ఎన్నికల సందర్భంగా జరిగిన డిబేట్‌లో డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తొలిసారిగా ముఖాముఖీ తలపడ్డారు. గత డిబేట్‌లో ట్రంప్ వైపే స్పష్టంగా మద్దతు చూపిన మీడియా, ఈసారి మాత్రం కమలా హారిస్‌కు ఎడ్జ్ ఇచ్చింది. మంగళవారం రాత్రి వీరిరువురికి మధ్య జరిగిన సంవాదంలో ఆర్థిక వ్యవస్థ, గర్భ విచ్ఛిత్తి నుంచి వలస విధానం వరకు పలు అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది.

90 నిముషాల పాటు జరిగిన ఈ చర్చలో హారిస్ కొన్ని సమయాల్లో సంభాషణను నియంత్రించారు. ట్రంప్‌ను అతని ఆర్థిక విధానంలోని లోపాలను ఎత్తి చూపారు. అలాగే 2020 ఎన్నికల్లో పరాజయాన్ని ట్రంప్ అంగీకరించడానికి నిరాకరించడం, సభలలో అతని వ్యవహార శైలిపై చురకలంటించారు. అయితే ట్రంప్ పలుసార్లు అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. సమయం గడిచే కొద్దీ ఆయనలో చికాకు కన్పించింది. హారిస్ ఆరోపణలను సమర్థించుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించినట్టు కన్పించగా, హారిస్‌లో దృఢ విశ్వాసం, దూరదృష్టి కన్పించాయని పలువురు వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. గత జూన్‌లో ట్రంప్‌తో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జరిపిన సంవాదం కన్నా హారిస్ చక్కగా తన వాగ్ధాటితో ఆకట్టుకున్నారు. అప్పటి సంవాదంలో పలుసార్లు బైడెన్ తడబడగా, హారిస్ మాత్రం సూటిగా సమాధానం చెబుతూ తనకు, ట్రంప్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రస్ఫుటింప చేశారు. కమల ఇయర్ రింగ్స్‌లో సీక్రెట్ డివైస్!

డిబేట్ సమయంలో కమల ఇయర్‌రింగ్స్‌లో రహస్య వినికిడి పరికరం ఉందని ఆరోపణలు వస్తున్నాయి. టెక్నాలజీకి సంబంధించిన ఓ వ్యాసంలో ఓ మహిళ ధరించిన కర్ణాభరణం వంటి ఇయర్‌పీస్‌తో కమల ధరించిన ఇయర్ రింగ్స్‌ని పోల్చి చూపిస్తున్నారు. 'ట్రంప్‌తో చర్చలో కమల బాగా మాట్లాడారు. కానీ ఆమె కర్ణాభరణాలు నాకు ఆసక్తికరంగా మారాయి. అవి చెవి రింగుల మాదిరిగా కనిపించే ఓ ఇయర్‌ఫోన్ గురించి ఓ టెక్ ఆర్టికల్ గుర్తుకు వచ్చింది' అని ఓ ఎక్స్ యూజర్ పేర్కొన్నారు.

## ఇద్దరు ఆర్మీ అధికారులపై దారుణంగా దాడి.. స్నేహితురాలిపై సామూహిక అఘాయిత్యం



**భోపాల్-నవభూమి:** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలో ఊహించని దారుణం జరిగింది. జామ్ గేట్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఇద్దరు ఆర్మీ యువ ట్రైనీ అధికారులు, వారి స్నేహితురాళ్లపై సాయుధ దుండగులు అత్యంత కిరాతకంగా దాడికి పాల్పడ్డారు. దోపిడీ చేసేందుకు వచ్చిన దుండగులు ఆర్మీ ఆఫీసర్లను దారుణంగా కొట్టారు. మహిళా స్నేహితుల్లో ఒకరిపై సామూహిక అత్యాచారానికి కూడా పాల్పడ్డారు. ఈ ఘటనకు పాల్పడ్డవారిలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడ్డవారిలో ఒకరికి నేర చరిత్ర ఉందని పోలీసులు తెలిపారు. ఈ నేరానికి సంబంధించిన పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బాధిత ఆర్మీ అధికారులు మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణ పొందుతున్నారు. అధికారులు ఇద్దరూ మధ్యాహ్న సమయంలో మహిళా స్నేహితులతో కలిసి బయటకు వెళ్లారు. సమీపంలో ఉన్న ఛోటీ జామ్‌లోని ఫైరింగ్ రేంజ్‌కు వెళ్లారు. అయితే వారిని అకస్మాత్తుగా 8 మంది వ్యక్తులు పిస్టల్స్, కత్తులు, కర్రలతో చుట్టుముట్టారు. డబ్బు, నగలు, వస్తువులు దోచుకోవడానికి వచ్చిన దుండగులు ఇద్దరు ట్రైనీ అధికారులను దారుణంగా కొట్టారు.

ఒక ఆఫీసర్‌ని, ఒక మహిళను బందీలుగా మార్చుకున్న దుండగులు.. మరో అధికారిని, ఒక మహిళను వదిలిపెట్టి రూ.10 లక్షలు తీసుకొచ్చి బందీలుగా ఉన్నవారిని విడిపించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో వారి చెర నుంచి బయటపడ్డ ఆర్మీ అధికారి వేగంగా తన ఆర్మీ యూనిట్ వద్దకు వెళ్లి విషయాన్ని కమాండింగ్ అధికారికి చెప్పారు. ఇదే సమయంలో డయల్-100 ద్వారా పోలీసులకు కూడా సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన పోలీసులు, సైనిక అధికారులు ఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. అయితే వాహనాలను ముందుగానే గమనించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు.

బాధితులు నలుగురినీ వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు ఆర్మీ అధికారులకు గాయాలు అయ్యాయని వైద్యుల్ను తెలిపారు. ఒక మహిళపై అత్యాచారం జరిగినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినట్టు బద్గొండ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ లోకేంద్ర సింగ్ హిరోర్ చెప్పారు. దుండగులపై దోపిడీ, అత్యాచారం ఆయుధ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఇండోర్ రూరల్ ఎస్పీ హితికా వాసల్ మీడియాకు వెల్లడించారు. ఈ నేరంతో సంబంధం ఉన్న ఇతర నేరస్తుల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

## జీఎస్‌టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్




**న్యూఢిల్లీ- నవభూమి:** పెట్రోల్, డీజిల్‌ను జీఎస‌టీ పరిధిలోకి తీసుకురావాలన్న అభ్యర్థనపై ఏం చెబుతారని కేంద్రప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో సాధ్యాసాధ్యాలపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. పెట్రోల్, డీజిల్‌ను కూడా జీఎస‌టీ పరిధిలోకి తీసుకొచ్చి, దేశవ్యాప్తంగా ఒకే రకమైన ధరకు విక్రయించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ సీనియర్ న్యాయవాది కనకరాజ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

## 70 ఏళ్లు పైబడిన వారందరికీ.. 5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

**న్యూఢిల్లీ- నవభూమి:** ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం ఇకపై దేశంలో 70 ఏళు ్ల, ఆ పైబడిన వయసు వారందరికీ వర్తించనుంది. ఆదాయంతో సంబంధం లేకుండా ఆ వయసు వారంతా అర్హులవుతారు. దీనికి బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం ఆమోద ముద్ర వేసింది. ఆ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లో తాజా నిర్ణయంతో దాదాపు 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ధి కలుగుతుందన్నారు. వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఏడాదిలో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం పొందవచ్చన్నారు. ఇప్పటికే ఈ పథకం వర్తిస్తున్న కుటుంబాల్లోని 70 ఏళ్లు, ఆ పైబడిన వారుంటే... వారికి అదనంగా ఏడాదికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తారు. ఒకవేళ ఇతర ప్రభుత్వ బీమా పథకాల్లో (సీజీహెచ్ఎస, ఈసీహెచ్ఎస, సీఏపీఎఫ్) ఏవైనా వర్తిస్తుంటే.. దాన్ని లేదా ఆయుష్మాన్ భారత్‌ను ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రైవేటు ఆరోగ్య బీమా పాలసీలు ఉన్నా లేదా కార్మిక రాజ్య బీమా (ఈఎసఐ) పథకం వర్తిస్తున్న వారు ఆయుష్మాన్ భారత్‌లో కూడా లబ్ధి పొందవచ్చు. ఈ పథకంలో అర్హులైన సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా కొత్త కార్డు జారీ చేస్తారు. ప్రస్తుతం ఈ పథకంలో 12.34 కోట్ల కుటుంబాలకు చెందిన 55 కోట్ల మందికి ఆరోగ్య బీమా సౌకర్యం ఉంది. పరిమితి ఏడాదికి రూ.5 లక్షలు. ఈ పథకంలో ప్రజలు ఇప్పటిదాకా లక్ష కోట్ల రూపాయల లబ్ధి పొందారని, లబ్ధిదారుల్లో 49 శాతం మహిళలని కేంద్రం పేర్కొంది. ప్రపంచంలో ప్రభుత్వాలు అమలుచేసే ఆరోగ్య బీమా పథకాల్లో అతి పెద్దదిగా ఆయుష్మాన్ భారత్‌కు పేరుంది. ఈ పథకాన్ని 70 ఏళ్లు, ఆ పైబడిన వారి కోసం విస్తరిస్తామని ప్రధాని మోదీ ఏప్రిల్‌లో ప్రకటించారు. కాగా, కేంద్ర క్యాబినెట్ మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నాలుగో దశ అమలుకు పచ్చజెండా ఊపింది. రూ.70,125 కోట్లతో 62,500 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను నిర్మించనున్నట్లు పేర్కొంది. ఈ మొత్తంలో కేంద్రం వాటా రూ.49,087 కోట్లు కాగా.. రాష్ట్రాలది రూ.21,037 కోట్లు. ఈ రహదారుల నిర్మాణంలో 25 వేల నివాస ప్రాంతాలు అనుసంధానం అవుతాయని తెలిపింది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు ఉద్దేశించిన 'పీఎం ఈ-డ్రైవ్' పథకానికి ఆమోదం తెలిపింది. దీనికి రెండేళ్లలో రూ.10,900 కోట్లు ఖర్చు చేయనుంది. దేశవ్యాప్తంగా 88,500 ఛార్జింగ్ స్టేషన్లకు కేంద్రం తోడ్పాటు అందించనుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ శుక్రవారం 13। సెప్టెంబర్। 2024

# దర్శకుడిగా వన్స్‌మోర్.. ధనుష్ ఈ సారి డైరెక్ట్ చేసేది ఎవరినంటే..?



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అతి కొద్ది మంది కోలీవుడ్ స్టార్ యాక్టర్లలో ఒకరు ధనుష్ క్లాస్, మాస్ హీరోగా కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న ఈ స్టార్ యాక్టర్ ఇటీవలే డైరెక్టర్ కమ్ హీరోగా తెరకెక్కించిన రాయన్ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. ధనుష్ మరోసారి డైరెక్టర్ క్యాప్ పెట్టుకోబోతున్నాడన్న వార్త ఒకటి లైమ్ లైట్‌లోకి వచ్చింది. తమిళ నటుడు అరుణ్ విజయ్ లీడ్ రోల్‌లో నటించనున్న సినిమాకు దర్శకత్వం వహించనున్నాడు.అరుణ్ విజయ్‌తో సినిమా డిస్కషన్ తుది దశలో ఉందని.. అన్నీ కుదిరితే త్వరలోనే ఈ ఇద్దరి కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఉండబోతుందని కోలీవుడ్ సర్కిల్ టాక్. అంతేకాదు ఈ చిత్రంలో ధనుష్ కీలక పాత్రలో కనిపించనున్నాడట. అరుణ్ విజయ్ నటిస్తోన్న త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది. ఇదే నిజమైతే ధనుష్ సినిమా అరుణ్ విజయ్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది ల్యాండ్ మార్క్ సినిమాగా నిలువడం ఖాయమని సినీ జనాలు చర్చించుకుంటున్నారు. ధనుష్ నెక్ట్స్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నటిస్తోన్న కుబేర



## సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నా..అభిరామి




ఒకప్పుడు దక్షిణాదిన కథానాయికగా రాణించిన అభిరామి ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా సత్తా చాటుతున్నది. రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రంలో ఆమె కీలక పాత్రలో నటించింది. జె.శివసాయి వర్ధన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం అభిరామి పాత్రికేయులతో మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభంలో కొన్ని సినిమాలు చేసిన తర్వాత యుఎస్ వెళ్లి చదువుకున్నా. పెళ్లిచేసుకొని అక్కడే కొన్నాళ్లు సెటిల్ అయ్యాను. ఇప్పుడు ఇండస్ట్రీలో మళ్లీ బిజీగా మారడం ఆనందంగా ఉంది' అని చెప్పింది.సినిమాలో తన పాత్ర గురించి మాట్లాడుతూ 'ఇందులో నేను గౌరి అనే బ్యాంక్ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను. మా అమ్మానాన్న కూడా బ్యాంక్ ఎంప్లాయిస్ కావడంతో పర్సనల్‌గా ఈ క్యారెక్టర్‌తో బాగా కనెక్ట్ అయ్యాను. గౌరి సింగిల్ మదర్. బలమైన ఆదర్శాలు కలిగిన మహిళగా కనిపిస్తుంది. మన ఇంట్లో తల్లి, సోదరి తరహాలో దర్శకుడు నా పాత్రను తీర్చిదిద్దాడు' అని పేర్కొంది. మహారాజ, సరిపోదా శనివారం చిత్రాల్లో తాను పోషించిన పాత్రలకు మంచి గుర్తింపు దక్కిందని, కథ..క్యారెక్టర్ నచ్చితేనే సినిమాలను అంగీకరిస్తున్నానని అభిరామి చెప్పింది. ప్రస్తుతం తమిళంలో లీడ్ రోల్స్‌లో రెండు చిత్రాల్లో నటిస్తున్నానని, తెలుగులో రెండు కథలు విన్నానని, మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ వివరాలను త్వరలో వెల్లడిస్తానని ఆమె తెలిపింది.

## అమెరికా నేపథ్య కథ



వి.ఎన్ ఆదిత్య దర్శకత్వంలో కేథరీన్ ట్రెసా కీలకపాత్రలో ఓ థ్రిల్లర్ చిత్రం రూపొందనుంది. డాక్టర్ మీనాక్షి ఈ చిత్రానికి నిర్మాత. మంగళవారం కేథరిన్ పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు శుభాకాక్షలు తెలుపుతూ మేకర్స్ ప్రత్యేక పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ప్రేక్షకులకు నచ్చే అంశాలతో, స్ట్రాంగ్ కంటెంట్‌తో ఈ సినిమా ఉంటుందని, ఈ సినిమా ద్వారా ఎంతోమంది దేశ, విదేశాలకు చెందిన కొత్త నటీనటులను పరిచయం చేస్తున్నామని, తెలుగు, తమిళ, కన్నడ నటీనటులతోపాటు అమెరికన్, స్పానిష్ పీపుల్, ఆఫ్రికన్స్, యూరోపియన్స్, ఏషియన్స్ చెందిన ఆర్టిస్టులు కూడా ఇందులో నటిస్తారని వీఎన్ ఆదిత్య తెలిపారు. యూఎస్‌లోని డల్లాస్‌లో చిత్రీకరణ జరుపుకునే ఈ సినిమా పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తామని ఆయన అన్నారు. ఈ చిత్రానికి రచన: పద్మావతి మల్లాది, సమర్పణ: ఏయు అండ్ ఐ, నిర్మాణం: ఓ.ఎం.జి.ప్రొడక్షన్స్.

## సెన్సార్ పూర్తి చేసుకున్న 'దేవర'.. రన్‌టైం ఎంతంటే.?



యంగ్‌టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస ప్రమోషన్స్ చేస్తుంది దేవర టీం. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది.ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పనులు పూర్తిచేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సభ్యులు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసినట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమా రన్‌టైమ్ 2 గంటల 57 నిమిషాల 58 సెకన్ల పాటు ఉండనుంది. ఇక మూవీలో విజువల్స్ అద్భుతంగా ఉంటాయని, చివరి 40 నిమిషాలు సినిమాలో హైలైట్ ఉంటుందని సెన్సార్ బోర్డ్ చెప్పినట్లు టాక్.



కేథరీన్ ట్రెసా

## సింగర్ మనో కుమారులపై కేసు



ప్రముఖ సింగర్ మనో కుమారులపై కేసు నమోదైంది. కళాశాల విద్యార్థులపై దాడి నేపథ్యంలో మనో కుమారులు రఫీ, షకీర్ సహా మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.వివరాల్లోకి వెళితే.. చెన్నై ఆలప్పాక్కంకి చెందిన 20 ఏళ్ల కృపాకరన్ , మదురవాయల్‌కు చెందిన 16 ఏళ్ల కాలేజీ విద్యార్థి వళసరవాక్కం శ్రీదేవి కుప్పంలోని ఫుట్‌బాల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు. వారు మంగళవారం రాత్రి అకాడమీ నుంచి ఇంటికి వెళ్తూ.. స్థానికంగా ఉన్న హోటల్ వద్ద ఆగారు. ఆ సమయంలో మనో కుమారులు రఫీ, షకీర్‌లు తమ స్నేహితులతో కలిసి అక్కడే ఉన్నారు.మద్యం మత్తులో ఉన్న వారు.. కృపాకరన్‌తోపాటు 16 ఏళ్ల బాలుడితో ఘర్షణకు దిగారు. ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి.. గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో ఇద్దరిపై ఐదుగురు దాడి చేశారు. ఈ దాడిలో కృపాకరన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వళసరవాక్కం పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. రఫి, షకీర్.. వారి స్నేహితులు విఘ్నేష్, ధర్మ, జహీర్‌పై కేసు నమోదు చేశారు. హత్య బెదిరింపులు, దాడి, అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి సెక్షన్ల కింద కేసులు బెక్ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## సినీ పరిశ్రమలో విషాదం.. ప్రముఖ తెలుగు సినీ గేయ రచయిత కన్నుమూత



తెలుగు సినీ పరిశ్రమలో విషాదం. ప్రముఖ తెలుగు సినీ గీత రచయిత గురుచరణ్ (77) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇవాళ తెల్లవారుజా మున తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఇక గురుచరణ్ మరణవార్త తెలుసుకున్న సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నారు.గురుచరణ్ అసలు పేరు మానాపురపు రాజేంద్రప్రసాద్. ప్రముఖ దర్శకుడు మానాపురపు అప్పారావు, నటి ఎంఆర్ తిలకం దంపతుల కుమారుడు ఇతను. గురుచరణ్‌కు చిన్ననాటి నుంచే సినిమా పాటలు రాయడం అంటే ఆసక్తి ఉండడంతో ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశాడు. అనంతరం దాదాపు దాదాపు రెండు వందలకు పైగా సినిమా పాటలు రాశారు. రౌడీ గారి పెళ్లాం లోని బోయవాని వేటుకు గాయపడిన కోయిల, అల్లుడుగారు సినిమాలోని ముద్దబంతి నవ్వులో మూగబాసలు లాంటి పాటలు అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచాయి.

## ప్రొఫెషనల్‌గా ఫుల్ బిజీ.. మరో బిజినెస్‌లోకి మహేశ్ బాబు.. !




ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాప్ స్టార్లలో ఒకడు మహేశ్ బాబు . ఈ స్టార్ యాక్టర్ ఓ వైపు సినిమాలతో ఎంటర్‌టైన్ చేస్తూనే.. మరోవైపు పలు బ్రాండ్లను ప్రమోట్ చేనస్తున్నాడని తెలిసిందే. ఇప్పటికే మహేశ్ బాబు ఖాతాలో క్లాతింగ్ బ్రాండ్, మల్టీప్లెక్స్ బిజినెస్, రెస్టారెంట్ ఉన్నాయి. తాజాగా మహేశ్‌బాబు మరో వ్యాపారంలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడనే వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇంతకీ ఆ బిజినెస్ ఏంటనే కదా మీ డౌటు.. వెల్‌నెస్ బ్రాండ్ ఫిట్ డే బిజినెస్. హైదరాబాద్‌కు చెందిన ఈ స్టార్టప్ కంపెనీలో మహేశ్ బాబు పెట్టుబడులు పెట్టనున్నట్టు ఫిలిం నగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. తాజా సమాచారం ప్రకారం ఫిట్ డే పోషకాహార విలువలు కలిగిన హెల్త్ సప్లిమెంట్స్ ప్రోటీన్, చిప్స్, ప్రోటీన్ బార్ లాంటి ఉత్పత్తులను అమ్మనుంది. ఇదిలా ఉంటే మహేశ్ బాబు ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి డైరెక్షన్‌లో ఎస్ఎస్ఎంబీ 29 చేస్తున్నాడని తెలిసిందే.గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా రాబోతున్న ఈ చిత్రం 2025 జనవరిలో సెట్స్‌పైకి వెళ్లనున్నట్టు వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.ఓ వైపు ప్రొఫెషనల్‌గా ఫుల్ బిజీగా ఉంటూనే.. మరోవైపు మల్టీపుల్ బిజినెస్ ప్లాన్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు మహేశ్ బాబు.

## పారాలింపిక్ పతక విజేతలను కలుసుకున్న ప్రధాని మోదీ..



**న్యూఢిల్లీ-నవభూమి:** పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన భారత అథ్లెట్లను ప్రధాని మోదీప్రశంసించారు. ఇవాళ ఆయన తన నివాసంలో ఆ అథ్లెట్లను కలిశారు. ఆ క్రీడాకారులకు ఆయన కంగ్రాట్స్ తెలిపారు. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్‌కు 29 పతకాలు వచ్చిన విషయం తెలిసిందే. పతకాలు గెలిచిన పారా అథ్లెట్లను మోదీ ప్రశంసిస్తున్న వీడియోను క్రీడా మంత్రిత్వశాఖ తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. పారా అథ్లెట్లతో భేటీ సమయంలో క్రీడామంత్రి మన్సూక్ మాండవీయ, పీసీఐ అధినేత దేవేంద్ర జాజారియాలు ఉన్నారు.వీల్‌చైర్ షూటర్ అవనీ లేఖరా పారాలింపిక్స్‌లో వరుసగా రెండోసారి గోల్డ్ సాధించారు. ప్రధాని మోదీతో ఆమె ఫోటో దిగారు. పారాలింపిక్స్‌లో ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతం, 13 కాంస్య పతకాలను ఇండియా గెలిచింది. మెగా టోర్నీకి 84 మందితో భారత బృందం పారిస్‌కు వెళ్లింది. స్వర్ణ పతక విజేతలకు 75 లక్షలు, సిల్వర్ మెడల్ విన్నర్‌కు 50 లక్షలు, కాంస్య పతక విజేతకు 30 లక్షలు అందజేశారు.

## హాకీలో దక్షిణ కొరియాపై భారత్ విజయం



**న్యూఢిల్లీ-నవభూమి:** చైనాలోని హులున్‌బుర్‌లో జరుగుతున్న ఏషియన్ ఛాంపియన్స్ ట్రోఫీ హాకీలో.. భారత జట్టు 3-1 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత జట్టు సెమీస్‌లోకి ప్రవేశించింది. భారత్‌కు ఇది వరుసగా నాలుగవ విజయం. ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత్, ఏసీటీ టోర్నీలో చైనా, జపాన్, మలేషియాపై విజయాలు నమోదు చేసింది. కొరియాతో జరిగిన మ్యాచ్‌లో అరైజీత్ సింగ్ హుందాల్ 8వ నిమిషంలో, హర్మన్‌ప్రీత్ సింగ్ 9వ, 43వ నిమిషాల్లో గోల్స్ చేశారు. కొరియా తరపున జీ హున్ యాంగ్ ఓ గోల్ చేశాడు. పెనాల్టీ కార్నర్‌ను అతను గోల్‌గా మలిచాడు. చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు శనివారం పాకిస్థాన్‌తో తలపడనున్నది. టాప్ నాలుగు జట్లు సెమీస్‌లో పోటీపడుతాయి.

## భారత్‌తో టెస్టు సిరీస్.. జట్టును ప్రకటించిన బంగ్లాదేశ్



**ఢాకా-నవభూమి:** భారత్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు బంగ్లాదేశ్ జట్టును ప్రకటించింది. గాయపడ్డ షోరిఫుల్ ఇస్లామ్ స్థానంలో వికెట్ కీపర్, బ్యాటర్ జకీర్ అలీని ఎంపిక చేశారు. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్ షోరిఫుల్ రెండు మ్యాచ్‌లకు దూరంకాను న్నాడు. గత నెలలో పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టు సమయంలో.. అతనికి గజ్జల్లో నొప్పి వచ్చింది. పాక్‌కు వెళ్లిన 16 మంది బృందంలో.. ఒక్క షోరిఫుల్ మాత్రమే మిస్ అవుతున్నాడు. ఇటీవల ముగిసిన ఆ సిరీస్‌లో 2-0 తేడాతో బంగ్లాదేశ్ సంచలన విజయం నమోదు చేసిన విషయం తెలిసిందే.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**